భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

★

ఏప్రిల్ 1972

సంపుటము : 49 : సంచిక : 4 :

విడిపత్రిక వెల ఒక రూపాయి



26 - 3 - 72

శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి 34-వ పుణ్యవర్ధంతి

శివముల్ తత్వముల్ పరవశించిన వేళ, అనర్ఘ ధర్మముల్
శివములు చేతలై పరిమళించిన వేళ, రసాత్మ భావముల్
శివములు గీతికల్ మధుర శీధువు లందినవేళ తెల్గునన్
ప్రవరము శైవతేజము శుభాకృతి వెల్గిన వెల్గు వెల్గులై.

విషయానుక్రమణిక

ఏప్రిల్ 1972

దీప్త్యంతర చైతన్యం

శ్రీ వక్కలంక వెంకట కృష్ణారావు

1

ప్రొద్దు తిరుగుడు పువ్వూ ప్రతీక్షిస్తూంటుంది
పుష్కరాలు నవ్వినపుడు
పొడుపు కొండవైపు తిరగాలని
పొగులుతున్న నాకు తోడుగా
సంధ్యకు
స్వాగతం పలకాలని

కాని
నేనూ పూలూ ప్రకృతీ
మౌనంగా జాలిపాటలు పాడుకొంటూ

వెలుగుచెండు
వెనకో ముందో
పేరోలగంలోకి ప్రవేశిస్తుంది
అంతర్వ్యదనాలని
కాంతిజలాల ప్రక్షాళించుకొని
అంతరాళ సదనాంగణాన
కలయంపి జల్లి
కలల రంగవల్లికలు దిద్దుకొనవచ్చునని
ఎదలో ఏవో వెఱ్ఱి ఆశలు
ఎఱసంజాలేదు ఎండారాదు
ఎరిసే ఎకిమీడూ రాడు
ఏడుపుతప్ప పిచ్చి కన్నీళ్ళు తప్ప

2

పోనీ
పలుకు లెరుగని చలువతూళ్ళైనా
అలల ఆనందపు మున్నీట
దరివిస్తాయనుకొంటాను
గుండె దిటవు పరచుకొంటగా

అదే అంటాను
ఉదధి తోటి
ఉత్పలాలతోటి
అదీ వమ్మౌతుంది

మెరుపైనా మెరవదు
మేఘాల గర్భంలోంచి
కడలుకొనే దుఃఖం
కలువల కనుగొలకులలోంచి
నా ఏడ్పే ఎడదలోంచి

వెలుగూలేదు వెన్నెలాలేదు
పెల్లుబికే కడలీలేదు
ఒక్క దుఃఖం తప్ప
సుడులు తిరిగే అంతస్స్రస్సులు తప్ప

3

శోక క్లిన్ననేత్రాల పరికించబోతే
అంతలమగా పొనలక
పొనుగుపడుతుంది
విద్యుద్దీపాలూ
వెలగటం మానకొంటాయి
మిగిలిన వాటితో కలిసి
అగ్గిపుల్లలూ చెకిముకిరాళ్ళా
ముందే మొదగాఉుతాయి

ఒక్కపిడుగైనా పడదు
నా దీన ప్రార్థనలూ వినదు
అందుకే
ఇంతటి కటిక చీకటి
దిక్కులలోంచి
దివాంతరాళాల్లోంచి
చిక్కగా అంతటా చోటు చేసుకొంటూ

ఆశల నిచ్చెనలెక్కి
వెలిగించ యత్నిస్తే
చుక్కలవత్తులూ లేవు
ఆకాశం ప్రమిదలో

పనీలేదు పాటాలేదు
కోరికాలేదు గోదారీలేదు
ఒకే ఒక్క ఏడుపు మిగిలింది
మౌనశోకం మాత్రం మిగిలింది

4

ఉరుములూ ఊరుకొంటాయి
ఊర్ధ్వలోక శయన గృహంలో
ఒళ్ళుమరచి నిద్రించి
శబ్దాలన్నీ
శ్మశాన వాటికలో
నిమ్న సమాధి మగ్నమైపోతాయి

ఐనా
'ఏ చీమన్నా చిటుక్కుమనక పోతుందా'
అన్న ఆశ
ఈహలు నశించిన
ఇసుల విరుల కేసరాలని
ఇసక రేణువు
ఇనుమడించిన నిస్పృహల

అంచులని
ఆవరించుకొని

గాలి పయనించదు
కక్షపూనినట్టు
ఏ చెట్టూ పిట్టా చలించవు
ఎఱుగొన్నట్టు

శరీరమూ తిమ్మిర్లెక్కి
బరువైపోతుంది
ప్రాణశక్తి నశిస్తుంది
అంతటా
ప్రళయానంతర ఘోర నిశ్శబ్దం
పొంపిరిపోయి
సృష్టి పూర్వ భీకర గాఢతమిస్రం
దట్టంగా ఆక్రమించుకొని
నాలో ఘనీభవించిన
అతిశీతల దుఃఖంలాగ
ఏకాంత నీరవ దీన రోదనం లాగ

5

అక్కడనుండే ఆరంభమౌతుంది
వ్యస్తాన్వేషణ
అనాంత జ్యోతిర్మయాకాశం కోసం
కటిక చీకటిని
అంతర్దుఃఖ ఘనోపలవర్షాన్ని
అంతమొందించటంకోసం

అప్పటికప్పుడే దిగులూ తొలగుతుంది
నిత్య సత్యదీప్తి
అంతటినీ ఆవరించుకొని
అన్నిటిలో ఇరవు చేసికొని

అగపడుతుంది
అల్లంత దూరం నుంచి

దాని చుట్టూ
చుక్కలూ సూర్యుడూ
చపలలూ చంద్రుడూ
నిప్పులు నిర్ఘాతాలూ
అన్నీ
మనముందు
మహోజ్వలంగా
గర్వంతో ప్రకాశించేవన్నీ
నిస్తేజంగా ఉంటాయి
ఆ కాంతి ప్రతిఫలిస్తూ
పెద్దబోగిమంట చుట్టూ
జుట్టు రేపుకొని
ముంగాళ్ళ మీద కూర్చున్న
అమాయకపు అల్లరి పిల్లల మొహాల్లాగ

అదొక్కటే జ్వలిస్తూంటుంది
అన్నీ అనుసరిస్తూంటాయి
ఆ సర్వోత్కృష్ట చైతన్య ప్రభని
అనంతబాహ్యా జగదనుభవంలోకి
అనువదిస్తూ

అది గుర్తించిన నాలోనూ
సుమాళించి విరుస్తుంది
విపురు కప్పిన నిప్పుమొగ్గ
బహుదళ పుష్పమై ప్రజ్వరిల్లుతూ

తెలుగు నవల-సమకాలీనత

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా తీసుకుని సామాజిక జీవితాన్ని స్ఫురింపజేసే సాహిత్య ప్రక్రియ నవల. నవల చరిత్రకాదు. కాకపోతేనేం, నవలద్వారా సమకాలీనజీవితాన్ని గూర్చి వ్యక్తమయ్యే చారిత్రక సత్యం మరొకవిధంగా లభ్యంకాదు! నవలద్వారాజీవితాన్నిగూర్చి కలిగే ప్రత్యక్షానుభూతికూడా విశిష్టమైనదే.

నవల సమకాలీన జీవితాన్ని ప్రతిబింబిస్తుంది అంటే అద్దంలా ప్రతిబింబిస్తుందని అర్థంకాదు. నిజానికి నవలారచయిత చేసేది ఒక వ్యాఖ్యానమే. రచయిత దృక్పథాన్నిబట్టి ఆ వ్యాఖ్యానం ఉంటుంది. రచయితకూడా సమాజంలోని వాడేగనుక అతని దృష్టి, వ్యాఖ్యానమూ సమకాలీన సామాజిక జీవనంలో ఒకభాగమే అవుతాయి. నవలారచయిత చేసే వ్యాఖ్యానం పాత్రసృష్టి, కథాసంవిధానంవంటి ప్రక్రియలద్వారా జరగటంవల్ల పాఠకుల కది వ్యాఖ్యానంలా తోచదు. యథార్థజీవితంలో ఎవరిమటుకు వారికి మనుష్యుల్నిగూర్చి వ్యాఖ్యానించుకునే అవకాశం ఉన్న రీతిగానే నవలలో కనిపించే వ్యక్తులపట్ల పాఠకులకూ అటువంటి స్వాతంత్ర్యం ఉంటుంది, ఉండాలి! రచయిత ఎంత ఎక్కువగా ఈ అవకాశాన్ని కలిగించితే అతని నవల కళగా అంత సార్థకతని పొందుతుంది.

నవలలో కనిపించే జీవితదృశ్యం నవలాకారుని చేత ఎన్నుకోబడిన ఒకానొక భాగమేతప్ప, యాథార్థ్యం యొక్క పూర్తి స్వరూపంకాదు. ఆ మాటకు వస్తే జీవితానుభవంలోకూడా యాదార్థ్యంయొక్క పూర్తి స్వరూపమేమిటో ఎవరికీ తెలీదు అనే చెప్పాలి. ఎవరు చూచే ముక్క వారికి యదార్థం. అందులో ఏది ముఖ్యం ? ఏది ముఖ్యంకాదు? అనుకోవడంలోకూడా దృష్టిభేదం ఉంటుంది. అందువల్లే ఒకరు సమకాలీన జీవితంలో రాజకీయపరిణామాలకు ప్రాముఖ్యం యిస్తూ నవలవ్రాస్తే, మరొకరు వ్యక్తి అంతర్యంలో జరిగే సంఘర్షణని చిత్రిస్తారు. ఒక కాలంలోనే వచ్చినవైనా యిలా నవలల్లో ప్రతిబింబించే సమకాలీనత భిన్నత్వంలో ఏకత్వాన్నీ, ఏకత్వంలో భిన్నత్వాన్నీ ప్రదర్శిస్తూ, జీవితంయొక్క వైవిధ్యాన్నీ, సంశ్లిష్టస్వరూపాన్నీ బుజవుచేస్తూ ఉంటుంది.

తెలుగు నవలపుట్టి వందఏళ్లవుతున్నది. ఈ వందఏళ్లలో రాజకీయంగా సాంస్కృతికంగా తెలుగుదేశం ఎంతో మారిపోయింది. ఆర్థిక వ్యవస్థ భూస్వామ్యంనుంచి ధనికస్వామ్యానికి మారింది. వ్యవసాయమే నేటికీ ప్రధానంగాఉన్నా, సామాజిక సంబంధాలలో వ్యాపారదృష్టి ప్రబలుతూరావడం గమనించదగిన మార్పు. దాన్నిబట్టి మనుష్యుల వ్యవహారాల్లో, స్త్రీ పురుషుల సామాజికప్రతిపత్తిలో ఎన్నో పరిణామాలూ, కొత్త సమస్యలూ వచ్చాయి. వీటిని తెలుగునవల ఎలా ప్రతిబింబిస్తూ వచ్చింది ? ఈ పరిశీలనకు అనువుగా ఒక చారిత్రక విభజనని గుర్తించుకోవడం అవసరం. 1878 లో వీరేశలింగంగారు 'రాజశేఖర చరిత్రము' వ్రాసేనాటికి బ్రాహ్మసమాజోద్యమంతో ప్రేరణపొందిన సంస్కరణ భావాలు తెలుగునవలలో ప్రధానంగా కనిపిస్తాయి. 1920 లో వ్రాయబడిన 'మాలపల్లి' నాటికి గాంధీగారి జాతీయోద్యమం తాలూకు సంస్కరణభావాలూ, దేశీయతాదృష్టి నవలలో ప్రాధాన్యం వహించాయి. 1939–46 మధ్య సంవత్సరాలలో ఆర్థికమైన ఒత్తిడీ, సమాజానికీ వ్యక్తికీ ఏర్పడే సంఘర్షణ నవలలో ప్రతిఫలించాయి. 1947 లో దేశానికి స్వాతంత్ర్యంవచ్చిన తర్వాతికాలంలో తెలుగునవల బహుముఖాలుగా విస్తరించింది. ఏవో కొన్ని సంస్కరణ భావాలతో, తాత్త్వికవాదాలతో జీవితాన్ని వ్యాఖ్యానించే ప్రయత్నంమాత్రమే చెయ్యక, జీవితాన్ని భిన్న

రంగాల్లో, భిన్నవర్గాల్లో వాస్తవికతాదృష్టితో పరిశీలన చెయ్యడం ప్రారంభించింది. 1960 తర్వాత స్త్రీ ప్రతిపత్తిని గూర్చి స్త్రీలు వ్రాస్తున్న నవలలకు ఎంతో ప్రాచుర్యం వచ్చింది.

1878 నాటి 'రాజశేఖర చరిత్రము'లో రాజకీయాలు కనిపించవు. హేతువాదంమీద ఆధారపడి మూఢవిశ్వాసాలను తొలగించుకోవాలనే ఉత్సాహం, స్త్రీ జనోద్ధరణ, స్త్రీ విద్య, జీవితంపట్ల శాస్త్రీయ దృక్పథం, మనుష్యుల్లో నిజాయితీ ఆనాటి సమాజక్షేమానికి అవసరమని సూచించటమే ఆ నవల ఉద్దేశం. కాని నాటి జమీందారీవ్యవస్థ స్వరూపం కూడా ఆ నవలద్వారా మనకు అవగత మౌతున్నది. ముఖస్తుతి చేసేవాళ్లకి డబ్బు ముట్టజెప్పడం, అలవిగాని అప్పులుచెయ్యడం రాజశేఖరునికష్టాలకు మూలకారణం. ఇది రాజశేఖరునిలో ఒట్టి భోళాతనమే కాదు. భూస్వామ్యంలో కష్టపడకుండా పొలంమీద అయివేజువస్తుంటే డబ్బువిలువ తెలీక దాన్ని నిర్లక్ష్యంగా ఖర్చుపెట్టే భూస్వామి మనస్తత్త్వమూ అందులో కనిపిస్తుంది. ఈ మనస్తత్త్వం జమీందారుల్లోనూ భూస్వాముల్లోనూ తర్వాత త్వరగా మారుతూవచ్చింది. 1921 నాటి 'మాలపల్లి' నవలలో సామాజికశక్తిగా డబ్బు ప్రాధాన్యం గుర్తించిన భూస్వాములు కూలిరేటును డబ్బురూపేణా హెచ్చించడానికి నిరాకరిస్తారు. ధాన్యంధర పెరిగింది, కూలిగా ధాన్యమే యివ్వమంటే, కాదు డబ్బేయిస్తాంఅంటారు. ఈ ఘర్షణ మూలంగానే సంగదాసు హత్య జరుగుతుంది. ఇక్కడ భూస్వామ్య వ్యవస్థ ధనస్వామ్య వ్యవస్థగా మారుతున్న సంధియుగంలో, తారుమారౌతున్న మానవ సంబంధాల సమస్య మనకు గోచరమౌతుంది. 1934 నాటి 'వేయిపడగ'ల్లో జమీందారు రామేశ్వరశాస్త్రి మాసికానికి డబ్బుదానం యివ్వకపోవడం ధర్మచ్యుతిగా చెప్పబడింది. జమీందారు బ్రాహ్మణ్యాన్ని పోషించడం, వాళ్ల అవసరాలకు దానాలుచెయ్యడం ప్రాత వ్యవస్థ లక్షణం. క్రొత్త జమీందారు మారుతున్న వ్యవస్థలో డబ్బు ప్రాధాన్యాన్నీ, దాని క్రొత్త ప్రయోజనాల్ని గుర్తించాడు. ప్రజలపట్ల అతనికి బాధ్యత ఏమీలేదు. బ్రిటిషు ప్రభుత్వానికి మాత్రమే అతను బాధ్యుడు. పైగా అతను క్రొత్త నాగరకతవైపు ఆకర్షింపబడ్డాడు. ఇదంతా ఆ జమీందారుల్లో నైతికపతనంగా, ధర్మచ్యుతిగా వర్ణింపబడింది 'వేయిపడగ'ల్లో. 1934 నాటిదే 'నారాయణరావు' నవల. అందులో జమీందారు ముందుచూపుగల మనిషి. ఒక సామాన్య రైతు కుటుంబం జమీందార్లకంటే మంచి ఆర్థిక స్థోమత గలిగి ఉండటాన్ని గమనించి, ఆ కుటుంబానికిచెందిన చదువుకున్న నారాయణరావుని అల్లుడిగా వరిస్తాడు. 1946 లో వెలువడిన 'అసమర్థుని జీవయాత్ర' లోని సీతారామారావులో యింకా రాజశేఖరుని మనస్తత్త్వం ఛాయలే మనకి కనిపిస్తాయి. డబ్బుపట్ల నిర్లక్ష్యం, వంశాభిమానం అతన్ని కష్టాల్లోకి తోస్తాయి. అంటే 60 ఏళ్ల తర్వాతకూడా ప్రాత ఆర్థిక వ్యవస్థ వాసనలు అక్కడక్కడ వ్యక్తుల్లో వదల్లేదన్నమాట !

1880 నుంచీ 1920 వరకు వచ్చిన నవలల్లో అగ్రవర్ణాలవారి స్థితిగతులు ముఖ్యంగా నాటి బ్రాహ్మణ్యంయొక్క ఆర్థిక దుస్థితి మనకు చక్కగా బోధపడుతుంది. వ్యవస్థ మారుతూ ఉండటంవల్ల బ్రతుకుదెరువు మార్చుకోవలసిన అవసరం వచ్చింది. సంస్కృతాధ్యయనమూ, పౌరోహిత్యము వంటివి చేతగాకపోతే శవవాహకత్వమూ, నల భీమ పాకశాస్త్రమూ తప్పనిసరి అయ్యాయి. చిలకమర్తివారి 'గణపతి' (1920) నవలలో హాస్యంకంటె ఆనాటి విషాదపరిస్థితే మనల్ని ఎక్కువగా ఆకట్టుకొంటుంది. ఇంగ్లీషు చదివి ఉద్యోగంచెయ్యడం క్రొత్తగా ఏర్పడుతున్న మార్గం. కాని దానికికూడా ధనం అవసరమే ! 1894 లో వెలువడిన 'రామచంద్ర విజయము' ఒక పేదబ్రాహ్మణ యువకుని కథ. ఇంగ్లీషు చదువుకొని పైకిరావడమే రామచంద్రుడు సాధించిన ఘనవిజయం. 1935 నాటి 'వేయిపడగ'ల్లో సంప్రదాయాన్ని అభిమానించే ధర్మారావు ఇంగ్లీషు చదువుకొన్నా ఉద్యోగం చెయ్యడానికి ఇష్టపడడు. అది అతనికి దాస్యంగా తప్పుగా తోస్తుంది. 'నారాయణరావు' నవలలో రామచంద్రం చదువుకోసం అమెరికా వెళ్తాడు. ఇంగ్లీషు చదువుకీ బ్రతుకుదెరువుకీ గల సంబంధం 1925—35 మధ్యకాలంలో ఎలా మారిపోయిందో

కుటుంబరావు నవల 'చదువు' చక్కగా వివరిస్తుంది. చదువుమీద ఎన్నో ఆశలు పెట్టుకొని మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన ఒకతల్లి కొడుక్కి చదువు చెప్పిస్తుంది. ఆస్తిపాస్తులు తెగనమ్ముకుని అతడు చదువుతాడు. రాజకీయోద్యమాలు ఒకవైపూ, ట్రేడ్ డిప్రెషన్ మరోవైపూ ఆ యువకుణ్ణి సంపాదనకు మార్గంలేని అసమర్థుడిగా, నిరుద్యోగిగా చేస్తాయి. జీవనోపాధికి ఇంగ్లీషు చదువును మించిన మార్గంలేదు అనే దృష్టినుంచీ అసలు జీవికకి అది పనికేరాదు అనేదాకా వచ్చినమార్పు పై నవల్ని పోల్చి చూస్తే తెలుస్తుంది.

'రాజశేఖర చరిత్రము'లో నాటి స్త్రీల దుర్భర పరిస్థితియొక్క యాదార్థ్యం నీలాటిరేవులో వాళ్ల సంభాషణద్వారా చక్కగా వ్యక్తం చెయ్యబడింది. స్త్రీ కి చదువురావడమే ఒక గొప్పదోషం అనాడు. బాల్యవివాహాలు సరేసరి! ఇల్లుపట్టిన విధవాడబడుచు అంటే జీతంలేని వంటలక్క! చిలకమర్తివారి 'రాజరత్నను' (1919) నవలకూడా నాటిస్త్రీల అజ్ఞానాన్నీ, కుటుంబ జీవితాన్నీ చక్కగా వర్ణిస్తుంది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'ఆత్మబలి' (1919) నవల యౌవనంలోఉన్న వితంతువు ఎదుర్కొనే విషమపరీక్షనీ, గ్రామీణ స్త్రీల జీవితాన్నీ వారి కలల్నీ చిత్రిస్తుంది. వితంతువుకి తీరనికోరికలు ఉంటాయి అనే సత్యాన్ని గుర్తించిన మొదటి తెలుగ నవల ఇది. కాని వితంతువు తన సుఖాన్ని బలియివ్వడమే కర్తవ్యం అనే సూచనతోనే నవల ముగుస్తుంది. వెంకట పార్వతీశ్వరుల 'మాతృమందిరం' (1919) నవలలోకూడా వితంతువు పునర్వివాహానికి అంగీకరించదు. తన నిర్ణయానికి సంస్కరణవాదంతో సంబంధంలేదనే అంటుంది.'మాతృమందిరం'లో వేశ్యాలోలుడైన భర్త నిరాదరణచేసిన స్త్రీపరిస్థితి ఎంతదీనంగా ఉంటుందో వర్ణింపబడింది. భార్యలని విడిచి బలాదూరుగా లేచిపోయిన భర్తలు ఈ నవలల్లో తరచు కనిపిస్తారు. ఆ స్త్రీల పరిస్థితికూడా వితంతువుల పరిస్థితికంటే మెరుగేమీ కాదు. వీరేశలింగంగారి సంస్కరణవాదం సమాజం అంతరాంతరాల్ని కదిల్చినట్లుగానీ, స్త్రీలకు వలసినధైర్యం ఇచ్చినట్లుగానీ తోచదు. అటువంటి స్థితిలో చలంనవలలు 'దైవమిచ్చినభార్య' (1923), శశిరేఖ (1926), 'బ్రాహ్మణీకం, 'అరుణ', 'మైదానం' తీవ్రమైన తిరుగుబాటుని ప్రోత్సహించాయంటే, తత్ఫలితంగా ఒక మానసికవిప్లవం సమాజంలో వచ్చిందంటే, అది తెలుగునవల సాధించిన ఘనవిజయంగా చెప్పుకోవాలి. భర్త లేచిపోతే, వేశ్యాలోలుడైతే మిన్నకుండే సమాజం స్త్రీలో అటువంటి ప్రవర్తనని సహించదు. స్త్రీ తను వలచిన వానితో లేచిపోవడాన్ని ప్రథమంగా చిత్రించిన నవల 'మాలపల్లి' (1921). దాన్ని ఘోర పాపంగా చూపిస్తూ ఆ వ్యక్తికి తగిన శిక్ష కూడా విధించింది. కాని చలం నవలల్లో కథల్లో అదే నిష్కృతిగా విమోచనా మార్గంగా చూపింపబడింది. చలం వాదాన్ని పరాస్తం చెయ్యాలనుకున్న విశ్వనాథ నవలల్లో కూడా లేచిపోయిన స్త్రీలు పెద్దగా శిక్షననుభవించిన జాడ కనుపించదు. ఇది 1935 నాటికి వచ్చిన మార్పు. 'వేయిపడగ'ల్లో (1934) మంగమ్మ, 'చెలియలికట్ట'లో రత్నావళి వ్యక్తిగతమైన వికాసాన్నీ, ఆత్మసంస్కారాన్నీ పొందటమే మనం చూస్తాము. స్త్రీలో వ్యక్తిత్వం తాలూకు స్పృహనూ, సామాజిక దురన్యాయాన్ని ప్రతిఘటించే గుండె దిటవునూ తెలుగు నవల చలం రచనలద్వారా కలిగించిందంటే అతిశయోక్తి కాదు. ఈ నాటి నవలా రచయిత్రులు ఆయనకెంతో రుణపడి ఉన్నారు.

తెలుగు నవల పుట్టిన నలభై ఏళ్లదాకా దేశంలోని రాజకీయోద్యమాన్ని ప్రతిబింబించిన నవల రాలేదు. వేలూరి శివరామశాస్త్రిగారి 'ఓబయ్య' (1920) గాంధీ ఉద్యమాన్ని ప్రతిబింబించే మొదటి నవల. (1880—1920) మధ్యకాలంలో వచ్చిన చారిత్రక నవలలో జాతీయోద్యమప్రభావం పరోక్షంగా మాత్రమే ప్రతిఫలించింది. 1921 లో వచ్చిన ఉన్నవవారి 'మాలపల్లి' ప్రత్యక్షంగా జాతీయోద్యమానికి నివాళిపట్టింది. 'మాలపల్లి' ధ్యేయం గాంధీ ధ్యేయమే. హరిజనోద్ధరణమూ, తద్వారా మానవధర్మపరిణామమూ. 'మాలపల్లి' నవలలోనే ప్రప్రథమంగా కర్షకులూ, పంచములూ చిత్రించబడ్డారు. గ్రామీణ వ్యవస్థలో బ్రాహ్మణ్యం ఎలా దిగజారిపోయిందో ఆ నవలలో వ్యక్తమౌతుంది. ఆనాటి సెటిల్మెంటులూ, జైళ్లూ, గ్రామాలూ పట్టణాలూ (మద్రాసు), ఆర్థికవ్యవస్థనుంచీ ఆధ్యాత్మిక

మార్గందాకా పరిపుష్టంగా చిత్రింపబడ్డాయి. ఈ నవలలోని యాదార్థ్యచిత్రణమూ, సామాజిక విప్లవశక్తీ నాటి ప్రభుత్వానికి భయం కలిగించింది. 1930 ప్రాంతాల వచ్చిన 'మాధవాశ్రమం' నవల కూడా రాయలసీమలో గాంధీ ఉద్యమాన్ని వర్ణించింది. అటుపైన 1947 తర్వాతగాని రాజకీయాలను వర్ణించే నవలలు రాలేదు. 1951 లో వచ్చిన కృష్ణారావుగారి 'కీలుబొమ్మలు' ఆ నాటి రాజకీయ పరిస్థితులదృష్ట్యా గ్రామీణ జీవితాన్ని ఆవిష్కరించింది. 1954 లో మహీధర రామమోహనరావు 'రథచక్రాలు'తో ప్రారంభించి వ్రాస్తూవచ్చిన నవలలు కమ్యూనిస్టుపార్టీ చరిత్రనూ, తత్సంబంధియైన రాజకీయసాంఘిక పరిస్థితులనూ వర్ణిస్తాయి. తెలంగాణాలో రాజకీయ పరిణామాలనుగూర్చి 'ప్రజల మనిషి' 'మృత్యుంజయులు' నవలలు వచ్చాయి. 1947 పూర్వం తెలంగాణా గ్రామీణ జీవితాన్ని యథాతథంగా చిత్రించిన నవల 'చిల్లర దేవుళ్ళు' ఇటీవలే వచ్చింది. 1920—46 మధ్యకాలంలో తెలుగువారి మద్రాసు జీవితాన్నీ, రాజకీయ పరిణామాల్లో మారుతూవచ్చిన ఒకానొక బూర్జువామనస్తత్వాన్నీ సుదీర్ఘంగా వర్ణించిన నవల ఉప్పల లక్ష్మణరావుగారి 'అతడు—ఆమె', 1950 లో వచ్చింది. బాపిరాజు నవలలు 'నారాయణరావు' 'కోణంగి' కూడా 1935 ప్రాంతాల మద్రాసులో తెలుగువారి జీవితాన్ని వర్ణించేవే.

1939—46 ప్రపంచయుద్ధం జరిగిన కాలంలో ధనస్వామ్యవ్యవస్థ బలపడడమే కాకుండా ఎన్నోవింతపోకడలు పోయింది. దేశంలో పరిశ్రమలూ, వ్యాపారమూ విస్తరించడమేగాకుండా నల్లబజారు దగాలూ, మోసాలూ నిత్యకృత్యమైపోయాయి. ధనార్జనలో బయలుదేరిన క్రొత్త నైతికపద్ధతులు కుటుంబజీవితంలోకూడా ప్రవేశించి, వ్యక్తులమధ్య సంబంధాల్ని కలుషితంచేస్తూ జీవితాన్ని వక్రగతులు పట్టించిన వైనం కుటుంబరావు నవల 'వారసత్వం' చక్కగా చిత్రించింది. కాని ఇది ఒకవిధంగా ప్రవాసాంధ్రుల కథ. యుద్ధకాలంనాటి అవ్యవస్థ, ఆర్థిక దుస్థితీ తెలుగుదేశంలో సామాన్యకుటుంబాలమీద, యువతీయువకులజీవితాలమీద చూపిన ప్రభావాన్ని వర్ణించిన నవలలు 1947 తర్వాతే వచ్చాయి— శారద వ్రాసిన 'మంచీ—చెడూ' (1951) అపస్వరాలు (1952); మంజుశ్రీ 'జారుడుమెట్లు'; పోతుకూచి సాంబశివరావు 'ఉదయ కిరణాలు'; 'అన్వేషణ'; కొమ్మూరి వేణుగోపాలరావు 'పెంకుటిల్లు'; శ్రీదేవి 'కాలాతీతవ్యక్తులు'; భాస్కరభట్ల 'యుగసంధి' మొదలైనవి.

అదేకాలంలో వ్యక్తికీ సమాజానికీ ఏర్పడే సంఘర్షణ తాలూకు బహిరంతరస్వరూపాల్ని వ్యక్తిగవేషణద్వారా వ్యక్తంచేసిన నవలలు—'అసమర్థుని జీవయాత్ర (1946) 'అల్పజీవి', 'చివరకు మిగిలేది', (1947). ఈ నవలలు తెలుగు నవలా ప్రక్రియ మనోవైజ్ఞానిక (**Psychological**), తాత్త్విక (**Metaphysical**) రంగాల్లో ప్రవేశించటాన్ని సూచిస్తాయి. ఈ ధోరణిలోనే 1955 తర్వాత వచ్చిన నవలలు— గోపీచంద్ 'మెరుపుల మరకలు' 'యమపాశం'; హితశ్రీ 'అంతర్వాహిని'; భాస్కరభట్ల 'వెల్లువలో పూచికపుల్లలు'; ఆర్. ఎస్. సుదర్శనం 'మళ్లీ వసంతం', 'అసురసంధ్య'; వాసమూర్తి 'ఇహపరాలు'; వి. నాగరాజు 'తాగుబోతు'; సి. వి. సుబ్బారావు 'ఆమె చెప్పింది'.

స్త్రీ తన చదువుమీద ఆధారపడి, ఉద్యోగం చేస్తూ, సమాజంలో స్వతంత్రప్రతిపత్తితో బ్రతికే మార్గాన్ని అన్వేషిస్తే ఎదుర్కొనే సమస్యల్ని చిత్రించే నవలలు 1947 తర్వాతే వచ్చినట్లు తోస్తుంది. వాటిలో మొదటిది మాలతీచందూర్ 'చంపకం—చెదపురుగులు'. స్త్రీ అన్వేషించే ప్రతిపత్తికి ఆమెకు దగ్గరివారైన తల్లిదండ్రులూ, తోడబుట్టినవారూ ఆటంకం ఎలా కల్పిస్తారో, వాళ్ల స్వార్థం ఎలా వింతరీతుల్లో పనిచేస్తుందో చక్కగా చిత్రిస్తుందీ నవల. 1960 లో లత వ్రాసిన 'ఎడారిపువ్వులు' నవలలోకూడా తండ్రి స్వార్థం కొమార్తె జీవితానికీ సుఖానికీ అడ్డురావడమనేది ఎలా ధర్మంగా నీతిగా చెలామణీ అవుతుందో చిత్రించబడింది. సమాజంలో వ్యక్తిగా ప్రతిపత్తికోరి, తనచుట్టూ అల్లుకొనిఉన్న ధర్మపన్నాలనీ, స్వార్థపరుల మమకారబంధాలనీ, సంప్రదాయాన్నీ వదిలించుకునేందుకు నేటి స్త్రీ సాగిసను నిరంతర సమరం 1961 తర్వాత వచ్చిన

కొన్నినవలల్లో ప్రధాన వస్తువుగా ఉంటున్నది. ఈ ధోరణిలో ద్వివేదుల విశాలాక్షి, వాసిరెడ్డి సీతాదేవి వంటి రచయిత్రులే కాకుండా వీరాజీ, గొల్లపూడి మారుతీరావు కూడా కొన్నినవలల్లో స్త్రీ ప్రతిపత్తిని గూర్చి, మారవలసిన దృక్పథాన్నిగూర్చి చక్కని విమర్శావ్యాఖ్యానమూ చేసిఉన్నారు. వీరాజీ 'ఇద్దరం ఒకటే', 'విడీవిడని చిక్కులు', 'ప్రేమకు పగ్గాలు' నవలలూ, మారుతీరావు 'పిడికెడు ఆకాశం', 'వెన్నెల కాటేసింది' నవలలూ యిందుకు ఉదాహరణలు. ఈ ధోరణి 1921—46 మధ్యకాలంలో కాల్పనిక వాదం, భావకవిత్వం స్త్రీనిగూర్చి తీర్చిదిద్దిన భావాలకు ప్రతిక్రియ. చలం స్త్రీలకు సమాజంమీదా, వివాహవ్యవస్థమీదా తిరుగుబాటు నేర్పినా, ఆయన చిత్రించిన స్త్రీ సమాజంలో యిమిడే వ్యక్తి కాదు! ఆయన సృష్టించిన 'అరుణ'లాగే ఏ స్వప్నసీమలకో వలస వెళ్లవలసిందే! విశ్వనాథ, బాపిరాజు ప్రభృతులు ప్రేమనుగూర్చి వివాహాన్నిగూర్చి చేసిన చిత్రణల్లో కూడా స్త్రీ కవిత్వానికీ, సౌందర్యానికీ, ధర్మానికీ ప్రతీక అయిందేతప్ప వ్యక్తిగా స్వతంత్రప్రతిపత్తికి నోచుకోలేదు. ఆ విషయం సమాజం దృష్టికి తీసుకు రావాలనే ధ్యేయం నేటి నవలల్లో కనిపిస్తోంది.

విద్యార్థుల మనస్తత్వాన్నీ జీవితాన్నీ చిత్రించే నవలల్లో పేర్కొనదగినవి 1960 తర్వాత వచ్చినవి—నవీన్ 'అంపశయ్య'; నాగరాజు 'ప్రేమికుడు'; ఇచ్ఛాపురపు రామచంద్రం 'తొలి మజిలీ'. వైద్య వృత్తినిగూర్చివచ్చిన నవల 'హౌస్ సర్జన్'. ఒక పోలీసు కానిస్టేబిల్ జీవితాన్ని యథాతథంగా వర్ణించిన నవల—శీలావీర్రాజు 'మైనా'. వర్ణాంతర వివాహాలనుగూర్చి వ్యాఖ్యానించిన నవలలు—రంగనాయకమ్మ 'బలిపీఠం'; ఎన్. ఆర్. నంది 'నైమిశారణ్యం'.

1872 నుంచీ చూస్తే ఈ వంద ఏళ్లలో తెలుగునాట జీవితం ఎంతో వైవిధ్యాన్నిచెంది నాటికీ నేటికీ పోలికేలేని విధంగా పరిణామం చెందింది. ఈ బహుముఖ పరిణామాన్ని మొదట 50 ఏళ్లలో కంటె ఆవరి 50 ఏళ్లలో పుష్కలంగా చిత్రిస్తూ వచ్చింది తెలుగు నవల. ఇలా రాశి పెరుగుతోంది. ఇందులో నెల్లూ పొల్లూ కలిసే ఉంటున్నది. నవల సమకాలీనత—అంటే ఎప్పటికప్పుడు స్పందించే గుణం—దాని సాహిత్య వాల్లభ్యానికీ, శిల్పసౌందర్యానికీ ముప్పుతెచ్చిపెట్టకుండా, నవలా రచన కేవలం పత్రికా రచన (**Journalism**) గా పర్యవసించే ప్రమాదం కలక్కుండా జాగ్రత్త పడటం నేటి రచయితల బాధ్యత.

అల్పమైన విలువలు

శ్రీమతి ఆర్. వసుంధర

'ఒకసారి ఆయమ్మ అయ్యతో కొట్లాడి ఒక పూటంతా అన్నంతినకుండా ఏడ్చారమ్మా ...' అన్నది పెరట్లో బియ్యం బాగుచేస్తూ రాజామణి.

అక్కడే కుర్చీలోకూర్చుని పుస్తకం చదువుతూ మరో ప్రక్క రాజామణి బియ్యం ఒళ్ళో పోసుకోకుండా అప్రమత్తతతోఉన్న నేను చేతిలోని పుస్తకాన్ని స్టూలు మీద పడేశాను. 'ఏమిటీ ? ఎందుకూ ?' అంటూ నిటారుగా కూర్చున్నాను, లోపల్నుండీ ఉబికివస్తున్న ఆసక్తిని పైకి కనబడనీయకుండా ఉంచాలని ప్రయత్నిస్తూ.

'ఏందో, రవ్వలకమ్మలు చేయించుకుంటానన్నారు. అయ్య వీల్లేదన్నారు. అమ్మ అలిగి ఏడ్చింది...' అన్నది రాజామణి ఏదో సామాన్యవిషయం చెబుతున్నట్లు.

అది సామాన్య విషయంకాదు. ఆమెను గురించిన నా ఊహను తలక్రిందులు చేస్తున్న విషయం. ఆమె నగలకోసం ఏడ్చేటంతటి తేలికమనిషని నేను అనుకోలేదు. నాకు ఆమెతోగల పరిచయం స్వల్పమే అయినా, ఆమె గొప్ప వ్యక్తిత్వంగల మనిషని తెలిసినంతలోనే అంచనా వేసుకున్నాను. మావారూ, అతనూ ఒకేరకం ఆఫీసర్లు కావడంవలన ఇద్దరం ఒకఊళ్ళో ఉండటం జరగదు. ఈ సారి అతను ఖాళీచేసిన చోటులోనికి మావారిని వేశారు. వాళ్ళ యిల్లూ, వాళ్ళ పనిమనిషీ, వాళ్ళ చాకలీ, వాళ్ళ పాలమనిషీ, వాళ్ళ కొట్టువాళ్ళూ అందరూ అన్నీ మాకు వారసత్వంలాగా దిగుమతీ అయ్యారు. వాళ్ళు ఇల్లు ఖాళీచేసేలోగా రెండురోజులపాటు మేము హోటలో ఉన్నాం. అప్పుడు వాళ్ళు మమ్మల్ని ఒక పూట భోజనానికి పిలిచారు. అదే ఆమెతో పరిచయం. ఆవిణ్ణి చూడగానే నాకు ఆనందం కలిగింది. తెల్లగా, చక్కగా, లావుగావున్నా నాజూగ్గా, కడిగిన ముత్యంలాగా, ఒంటెడునగలతో లక్ష్మీదేవిలాగా కనిపించింది. ఆమెచేసిన వంటకాలు, వడ్డించిన తీరు, ఇల్లుదిద్దుకునే నైపుణ్యం, పిల్లల విషయంలో క్రమశిక్షణ అన్నీ ఎంతో బాగున్నై. ఆ యింట్లో కనిపించే ఆడంబరం, శుభ్రత, మురుకుదనం, ఆదరణ అన్నీ ఆమెతోపుట్టి యిల్లంతా వ్యాపించి ఇంటినీ, ఇంట్లోని ప్రతి మనిషినీ, ప్రతి పనినీ నడుపుతున్నట్లుగా తోచింది నాకు ఆ కాస్సేపట్లోనే. తర్వాత క్రమంగా ఇరుగు వాళ్ళూ, పని వాళ్ళూ ఆ అభిప్రాయాన్ని బలపరిచారు. ఆమె భలే మనిషి. ఆ భార్యా భర్తలిద్దరూ అనన్యసామాన్యమైన ఒద్దికతో, పరస్పర సహకార సానుభూతులతో లక్ష్మీకేశవుల్లా కనిపించారు.

ఆ లక్ష్మీదేవి గురించి రాజామణి ఆ మాట చెప్పగానే నాలో ఏదో సంభ్రమం కలిగింది. మొదట ఒక్క క్షణకాలంపాటు రాజామణిమీద కోపం వచ్చిన మాట నిజమే. ఆమెను గురించి మాట్లాడ్డానికి యీ రాజామణికి తాహతు ఎక్కడిదీ? ఆమెకు అందం, డబ్బు, చదువు, సంస్కారం అన్నీ వున్నాయి. జీవితంలో విలువైనవేవో ఆమెకు తెలిసుండాలి. ఈ రాజామణికి ఏవీ లేవు. ఉత్త అల్పురాలు. నాగలోకాన్ని గురించి నక్కమాట్లాడ్డం ఎంత హాస్యాస్పదం! అనిపించిందిగాని, అంతలోనే వాళ్లను గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి పెద్దదై పోయింది. రాజామణిమాటలు నిజం కావేమోనన్న అనుమానం కొంచెం కూడా రాలేదు. 'ఓహో, ఈమెను గురించి గొప్పగా అనుకున్నానుగాని నిజానికి మామూలు మనిషే' అనీ తోచింది. ఆ తలపులో సంతృప్తిలాంటిదీ కలిగింది. తరువాత రాజామణిని గుచ్చిగుచ్చి ప్రశ్నించాను. ఒకరిదగ్గర నాలుగేళ్ళు వరసగా పనిచేసిన మనిషికి

ఆంతరంగిక కార్యదర్శి స్థానం లభిస్తుంది గనుక వాళ్ల వివరాలన్నీ తెలిసే వుంటాయి...భార్యా భర్తలకు అడపా దడపా వాదాలూ వివాదాలు వస్తూనే వుండేవి. రాజామణికి ఏడాదిపాటు పనిచేస్తే కొత్తకోక యివ్వొచ్చని అయ్య అంటే, అలాంటి ఒప్పందం ఏమీలేదు గనక పాత చీరె చాలని అమ్మ అన్నప్పుడు ఒకసారి తగూపడ్డారు. 'ఇట్లాంటివేవే ఎన్నో వుండేయి' అన్నది రాజామణి జల్లెట్లోని బియ్యంలోని పెద్దరాళ్లను చకచకా ఏరిపారేస్తూ, మొహంలోని యోగముద్ర చెరక్కుండా.

రాజామణి మామూలు మనిషికాదు. లక్ష్మీదేవి దాన్ని నాకు పరిచయం చేసిన విధానం యిది: 'రాజీకి నోట్లో నాలుకలేదు. ఒక్కమాట మాట్లాడదు. ఒక్కమాటకు బదులు చెప్పదు. చెప్పిన పని శుభ్రంగా చేస్తుంది. ఇచ్చింది తీసుకుంటుంది. అంతే, దానిరాత బాగాలేక, లేనిపోని తంటాతెచ్చుకొని, కష్టపడుతున్నదిగని అది మంచిది' అన్నదామె నవ్వుతూ, ఆప్యాయంగా దాన్నిచూస్తూ. అక్కడున్న యితర పనివాళ్లూ ఆమె మాటను ఏకగ్రీవంగా ఆమోదించారు. ట్రాన్స్ఫరయి వెళ్లిపోతున్న యజమానురాలు, వెళ్తూవెళ్తూ యింకో రెండు రూపాయిలు అదనంగాయిచ్చే అవకాశం ఉన్నప్పుడు, పరివారంలో యిలాంటి ఏకగ్రీవత దానంతటదే కుప్పతిప్పలుగా పుట్టుకొస్తుంది. రాజామణిమాత్రం సిగ్గుపడిపోతూ కళ్లు వాల్చుకున్నది, మాటాడకుండా.

రాజామణి బాహ్యరూపం చూసేవాళ్లకు వికారం కలిగిస్తుంది. మొదటిసారి చూడగానే నాకు చాలా అయిష్టత కలిగింది. వేరే ఎవర్నైనా పనికి పెట్టుకుందాం అనుకున్నాను. కాని లక్ష్మీదేవి మాటమీదనే దాన్ని పెట్టుకున్నాను. వెడల్పుగావుండే వికారమైన మొహమూ, పసుపురంగులో గారకట్టిన పలువరుసా, పాతికేళ్లకే సగం నెరిసిపోయినజుట్టూ, బూడిదరంగు కంటిపాపలూ, పొగచూరిన కట్టెలాంటి పొట్టిమనిషి—ఇది రాజామణిరూపం స్థూలంగా. అటువంటి కళ్లు నేను ఎక్కడా చూడలేదు మనుషులో. రాజామణి సాధారణంగా కళ్లెత్తి ఎవర్నీ చూడదు. కాని, చూచినప్పుడు ఆ బూడిదరంగు కనుపాపల్లోంచీ ఏదో అసహజమైనది బయల్దేరి యివతలివాళ్లను తాకుతుందేమోనన్న గగుర్పాటు కలుగుతుంది. ఆ కళ్లల్లో ఒక వెల్తురుగాని భావంగాని జీవంగాని లేదు. అన్నింటిమీదా ఒక బూడిదరంగు తెర దిగిపోయింది. కాని నిదానంమీద గమనిస్తే, ఎప్పుడో ఒకసారి, బహు అరుదుగా ఆ కళ్లు మెరవడం, ఆ మొహంలో ఒక వింత భావం వెలగటం కనిపిస్తుంది. తన విశాలమైన మనస్సునీ, దేవుడు తన వంతుకైయిచ్చిన గొప్పబాధల్నీ నోరెత్తకుండా సహించగల తన ఓర్మిని ఏ కించిత్తో మాటల్లో వెలువరించవలసివచ్చినప్పుడూ, నరసిమ్మాయి ప్రస్తావన వచ్చినప్పుడూ ఒక తెల్లటివెల్తురు తళుక్కుమంటూ కళ్లల్లో ఆ చివర్నుండీ యీ చివరికీ ప్రసరిస్తుంది. బూడిదలాంటి ఆకాశంలో అకస్మాత్తుగా ఇంద్రధనస్సు కనిపించినట్లుగా, నిర్జీవమైన ఎర్ర భూమిలో విరబూసిన తంగేడుమొక్కల గుంపును చూచినట్లుగా చూపరుల్ని విభ్రమంలో ముంచుతుంది. అప్పుడు రాజామణి నవ్వుతో యీ చెవినుండీ ఆ చెవివరకూ విప్పారిన పలువరుసను పెదాలచాటుకు నెట్ట యత్నిస్తూ, కళ్లల్లోని మెరుపును చాటుచేస్తూ సిగ్గుగా పైరెప్పలు క్రిందికి జార్చుతుంది. కాని అది అరుదైన విషయం. అది జరిగే సందర్భాలు వేరువేరుగా కనిపించినా విషయం మాత్రం ఒకటే. అది రాజామణి మొగుడు నరసిమ్మాయి. రాజామణి మనసుయొక్క వైశాల్యమూ, బాధా సహిష్ణుతా, నరసిమ్మాయీ— మూడూకూడా ఒకటే నిజానికి. నరసిమ్మాయే రాజామణి ప్రియుడు, మొగుడు, బాధ, బ్రతుకు—అన్నీను. వాడు లేకుంటే రాజామణికి యీ కడగండ్లు ఉండవు. అందరి మాదిరిగా తనచాకిరీతో పొట్టపోసుకుంటూ, ముసలి ముప్పుకు నాలుగురాళ్లు వెనకవేసుకుంటూ హాయిగా ఉండేది, కంటినిండా నిద్రపోయేది అనుకోవచ్చు. మొగుడైనాకాని వాడికోసం ఇన్ని బాధలుపడుతూ ఉండటం సహజంకాదు గనుక అలా అనుకుంటాము. కాని మనిషిని మనిషిని ఆవరించిఉన్న పరిస్థితులనూ విడదీయటం సబబుకాదేమో. జీవితంలో విలువైనవేవో తెలుసుకోలేని పేద బ్రతుకులు అంతకంటే వేరుగా ఉండటానికి వీలుకాదేమో!

నరసిమ్మాయి రాకపూర్వం రాజామణి జీవితం చాల మామూలుగా ఒడుదుడుకులు లేకుండా జరిగిపోతుండేది. దాని మొగుడు పెళ్లయిన ఏడాదికే

పోయాడు. అప్పట్నుంఢీ పుట్టింట్లోనే ఉండిపోయింది. రాజామణికి బంధువులు చాలామంది ఉన్నారు. ముసలి తల్లి, పదిమందిపిల్లలతల్లియైన అక్క, పనిలేక డబ్బులేక బాధపడే అన్న, ఇంకా పిన్నమ్మలు, చిన్నా న్నలు, మామలు, అత్తలు, వాళ్లసంతానం అంటూ బీరకాయపీచులాగా పెనవేసుకుపోతూ చాలా బలగం ఉన్నది. కడుపు నింపుకోవడానికి పాచిపనులు చేసుకుం టుంది. ఒంట్లో ఓపికవుండి, రెండిళ్లలో పనిచేసుకో గల ఒంటరిమనిషికి లోటేమీ ఉండదు. అందులోనూ రాజామణికి సినిమాలు చూడాలనిగాని, కొత్తచీరలు కట్టుకోవాలనిగాని కోరికలు లేవు. తనకు దొరికిన అన్నమూ కూరలూ ఇంట్లోవాళ్లకిచ్చేది. 'నీవూ తిన్నావా ?' అని కనుక్కోగల అక్కరలేక పోయినా, అదితెచ్చే కూరలూ జీతండబ్బులూ నాకు కావాలంటే నాకు రావాలంటూ పిల్లలతల్లి అక్కా, డబ్బు అవ సరంలో ఉండే అన్నా పోటీలు పడేవారు. ఒకసారి వారూ ఒకసారి వీరూ మరోసారి ముసలితల్లీ దాని డబ్బు వాడుకునేవారు. మాకివ్వలేదంటే మాకివ్వ లేదని అందరూ దాన్ని తిట్టేవారు. ఈ విధంగా 'సద్దులేని మనిషి' అని పేరు తెచ్చుకుంటూ, బంధు వుల మధ్యన కాలం వెళ్లబుచ్చుతుండేది రాజామణి. ఇంకా ఎన్నోఏళ్లు, చిరకాలం, చచ్చేవరకూ అల్లాగే నలుగురి మధ్యనా వేలెత్తి చూపించుకోకుండా దాని బ్రతుకు వెళ్లమారి పోయుండేది, నరసిమ్మాయి తటస్థపడకుండా ఉంటే, దానికి పాడుబుద్ధి పుట్ట కుండాఉంటే !

నరసిమ్మాయికి పెళ్లామూ ఇద్దరు పిల్లలూ ఉన్నారు. కనుముక్కు తీరుగా ఉండీ చూపరియైన వాడే. బాధ్యతలను లెక్కచెయ్యని స్వభావంకల కులాసామనిషి. ఏ ఒక్కపనితోనూ కుదురుగా ఉండ కుండా కొన్నాళ్లిక్కడ వంటపనిలోనూ, కొన్నాళ్లె క్కడో కూలిపనిలోనూ ఉంటూ హుషారుగా సరదాగా స్నేహితులతో ప్రొద్దుపుచ్చుతూ తిరిగేవాడు. అటు వంటివాడికి రాజీమీద ఇష్టం కలిగింది. కారణం వాడికైనా తెలుసో తెలియదో. స్నేహితుడు సుబ్బరమణియం ప్రోత్సాహప్రోద్బలాలతో రాజీ వెంట పడ్డాడు నరసిమ్మాయి. కాలక్రమేణ వాళ్ల ప్రేమ చలంగారి మైదానంలో రాత్రిపూట విహారాలుగా పరిణతి చెందింది. ఆ మైదానం అక్కడి హైస్కూలు కాంపౌండు. విశాలమైన ఆటస్థలం, ఆ వైపు కొండ, ఈ వైపు చేలు, పైన ఆకాశంలో చంద్రుడు—అటువంటిచోట ఒంటరియైన జంటగా ఆటపాటల్తో విహరించేవారు వాళ్లిద్దరూ. వెన్నెల రాత్రిళ్లల్తో గాలికదలని వేళల్లో రాజీ పాట హైస్కూలుకు దగ్గరగఉన్న ఇళ్లల్లోకి వినిపించేదట.

కాని నరసిమ్మాయి కోరుకునేది యిటువంటి జీవితంకాదు. 'పనిచేసి ఒళ్లరగ్గొట్టుకొని సంపాదించి వాళ్ల మొగాల వేస్తున్నావు. నీకేం సుఖం? నాతో వొచ్చెయ్యి. నీవు బ్రతికినన్నాళ్లూ నీ భారం నాది' అన్నాడు. అటువంటిమాట నరసిమ్మాయి గనక అన గల్గాడుగాని వేరేవాళ్లు అనుకునే సంగతికాదు. పెండ్లాం, పిల్లలూ, బంధువులూ నరసిమ్మాయిని ఒదలరు. రాజీ బంధుజనం దాన్ని చెడిపోనివ్వరు. అసలటువంటి పనిచేసే సాహసం రాజీకి లేదు. అది నోట్లో నాలుకలేనిది! అయినా నరసిమ్మాయిని ఇలాంటి కారణాలు బంధించలేవు. పట్టుదలగా రాజామణిని ఒప్పించడానికి ప్రయత్నించాడు, సుబ్బరమణి చేత దానికి హితవు చెప్పించాడు. చాలా ప్రయత్నం చేశాడు.

ఆఖరికి వాళ్లిద్దరూ ఆ ఊరిబయట మైదా నంలో ఒక గుడిసెలో కాపరం పెట్టారు. వాళ్ల కుటుంబాల కోపతాపాలూ, తిట్లూ, అభ్యర్థనలూ, కొట్లాటలూ వాళ్లను మరింత దగ్గరకు తెచ్చాయే గాని వేరుచెయ్యలేకపోయాయి.

ఏళ్లు గడుస్తున్నా నరసిమ్మాయి వాగ్దానం తప్పలేదు. రాజీని విడవలేదు. కట్టుకున్నదాన్ని చూస్తున్నట్లే చూస్తున్నాడు. అంతకంటే ఎక్కువ గానే చూస్తున్నాడనాలి. ఎందుకంటే కట్టుకున్న పెండ్లాందగ్గరున్నన్నాళ్లూ ఆవిడ నరసిమ్మాయిని ఇంకా ఎక్కువ డబ్బుతేలేదనీ, ఎప్పుడైనా తాగుతా డనీ, సినిమాకు వెళ్తాడనీ నిత్యమూ సాధిస్తూ రాచి రంపాన పెడుతుండేది. ఇప్పుడు శుభ్రంగా పనిమానేసి, రాజామణి తెచ్చింది తింటూ, ఎప్పుడైనా తను సంపా దించింది తాగుతూ, హాయిగా గడిపేస్తున్నాడు. తాగి వచ్చి పనినుంచీఆలస్యంగా ఇంటికొచ్చిందనో, బంధు వుల్తో మాట్లాడిందనో, వాళ్లకు డబ్బు లిచ్చిందనో ఏదో ఒక సాకుతో రాజామణినీ చితక తంతున్నాడు.

తరువాత బోలెడంత పశ్చాత్తాపంతో దానికి క్షమార్పణలు తెలుపుకొని, దాన్ని బలవంతాన సినిమాకు తీసుకెళ్ళి, రెండురోజులపాటు తాగకుండా ఉంటున్నాడు దానికోసం. రాజీకోసం, వేరే ఎవరూ ఎప్పుడూ ఇలా త్యాగాలు చెయ్యలేదు !

రాజామణి ఒళ్ళు మంచిదికాదు. అప్పు డప్పుడు పైత్యమూ జ్వరము ముంచుకొస్తాయి. అలాంటప్పుడు ఒకసారి నరసిమ్మాయి దానిచేత పనిమాన్పించి ఇంట్లోనేవుండి తనకు వండిపెడుతూ, తాను తెచ్చింది తింటూవుండే ఏర్పాటుచేశాడు బలవంతాన. కాని పదిరోజుల్లోనే వాడు ఇంటికి డబ్బు తేలేడనీ, అంతా తాగేస్తాడనీ తెలిసిపోయింది. అందువలన ఇప్పుడు రాజీకి జబ్బుచేస్తే పనిమానెయ్యమని పదిసార్లు చెప్తాడుగాని, బలవంతం చెయ్యడు. దానికి కావలసిన గంజి కాచిపోసి, తొందరగా కోలుకొని పనిలోకి వచ్చేట్లు చూస్తాడు.

ఇన్నేళ్లు గడిచినా నరసిమ్మాయి కుటుంబానికి వాడిమీది ఆశ పోలేదు. అర్నెల్లకోసారి పోలీసు బావమరిదో, పోస్టుజవాను బావమరిదో వచ్చి నరసిమ్మాయితో పేచీ పెట్టుకుంటారు. వాడు సంపాదించింది రాజామణికి దోచిపెట్టడానికి వీల్లేదనీ అదంతా తమ తోబుట్టువుకే చెందాలనీ పంచాయతీ పెడతారు. రాజామణి సుడిగాలిలో చిక్కుకుపోయిన ఎండుటాకులాగా కొట్టుకులాడిపోతుంది. నరసిమ్మాయి యీ అవమానం సహించలేక, రాజామణి దగ్గరుండే డబ్బంతా తీసుకుని, చిన్నకత్తి ఒకటి చేతబట్టుకొని, దోవలో కనపడ్డవాళ్లందరికీ ఆ కత్తిని చూపిస్తూ, తన బావమరదుల్ని యివాళ్టితో అంతంచెయ్యబోతున్నానని చెప్పుకుంటూపోతాడు. ఏఅర్ధరాత్రికో సుష్టుగాతాగి, తూలుకుంటూ, బావమరదుల్ని తిట్టుకుంటూ ఇంటికొస్తాడు.

రాజామణికీ నరసిమ్మాయికీ ఉండే సంబంధం నిజంగా అనిర్వచనీయమైనది; అవినాభావమైనది అనాలి. వాళ్లిద్దరూ ఒకరికొకరు అన్నివిధాలా తగిన మనుష్యులు. దానిదగ్గరలేని లోకజ్ఞానం, ముందుకుపోయే పురుషలక్షణం నరసిమ్మాయి దగ్గరున్నవి. వాడిదగ్గరలేని ఓరిమి రాజీ దగ్గరున్నది. ఇద్దరూ కలిస్తే హాయిగాబ్రతగ్గలతెలివి పుట్టుకొస్తుంది.

'మీకు తోచినంత జీతం ఇవ్వండి......నేను నోట్లో నాలుకలేనిదాన్ని' అన్నది రాజామణి పనిలో చేరబోయేముందు. నెలాఖరున పదిరూపాయ లిచ్చాను. ఆ మధ్యాహ్నం రాజీ పనిలోకి రాలేదు. నరసిమ్మాయి వచ్చి 'పదిహేను రూపాయి లిస్తేనే రాజీ పని చేస్తుంది...'అని నా మొఖంవేపు ఆశగాచూసి 'ఆ మిగతా అయిదు రూపాయిలూ నా చేతికివ్వండి. దాన్ని పంపిస్తాను' అన్నాడు. నేను ఒప్పుకోలేదు. 'మాకు పని తక్కువగనుక పదికంటే ఎక్కువ యివ్వను' అని చెప్పేశాను. మర్నాడు రాజీ పనిలోకొచ్చింది. 'ఆయన మాటలు కేమిలే అమ్మా. చేసేదాన్ని నేను...ఆ యమ్మ నన్ను బిడ్డలాగా చూసుకునేది. మీరూ అట్లాగే చూసుకోండి' అన్నది. 'చేసేది నీవైతే నిన్న మధ్యాహ్నం పనికి రాలేదెందుకూ'అని అడుగుదామనుకొని, మళ్లీ బిడ్డలాంటిదికదా అని సమాధానపడి ఊరుకున్నాను.

నరసిమ్మాయి తాగి కొట్టినప్పుడు, ఎక్కువ దెబ్బలు తగిలినప్పుడు రాజామణి బంధువులు ఏ చాటుగానోవచ్చి 'అయ్యో, పిచ్చిదానా, ఒళ్లు కరిగించుకొని సంపాదించి ఎవడి ఎదానో పోస్తున్నావే. వాడు నిన్ను చంపుతున్నాడే. ఇటు కులానికి చెడితివి. అటు బతుకూ చెడెను' అంటూ సానుభూతి చూపిస్తారు. వాళ్లు చెప్పినప్పుడు తిరిగి మాట్లాడకుండా వింటుంది రాజీ. వాళ్లచేత పావలో పరకో పెడుతుంది. కాని వాళ్లమాటలు దానికి రుచించవు. 'ఏ సంసారంలోనైనా కష్టం సుఖం వుండదా. ఆయనకి నామీద ఎంత అపేక్ష ! నా కర్మ వల్ల యీ తాగుడు పట్టుకుంది' అనుకుంటుంది. వాళ్ల మాటలకి లోపలే బాధపడిపోతుంది.

వారాని కోపూటైనా చెప్పా పెట్టకుండా పని మానేస్తుంది రాజీ—వాడు కొట్టినప్పుడు. పని మానేసిన కారణం చెప్పడానికి దానికి చాలకష్టంగా ఉంటుంది. ఏడుపు, అవమానం, ఇది అందరికీ జరిగేదే అన్న ధీమా—అన్నీ కలబోసినట్లుంటుంది దాని భావం. 'ఆయమ్మ నన్ను బిడ్డలాగా చూసుకునేది. ఆయన కొట్టినప్పుడూ, నాకు జబ్బుచేసినప్పుడూ ఎన్నిసార్లు పనిమానేసినా ఏమీ అనలేదు. ఒకసారి నాకు ఎక్కువదెబ్బలు తగిలినప్పుడు ఆయన్ని పిలిపించి కోప్పడి, ఆయమ్మకూడా ఏడ్చేసింది' అన్నది.

లక్ష్మీదేవిగారిలాగా రాజామణిని బిడ్డలాగా చూసుకోవలసిన బాధ్యత నామీదున్నదన్న భావన నాలో నాటుకపోయింది. అందువలన చెప్పకుండా పనిమానె య్యడం వలన కలిగే కష్టాన్ని నోరెత్తకుండా అనుభవించ వలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా రాజామణి కష్టం నా కష్టంగా మారిపోయేంత కాలం గడిచాక ఒకసారి అన్నాను: 'నీవు చాకిరీచేసి వాడిని పోషిస్తున్నావు. వాడేమో నీకష్టం గమనించకుండా యిష్టంవచ్చినట్లు తాగుతున్నాడు. వాడు నీకు మొగుడుకూడా కాదు. చీటికీ మాటికీ ఈ తన్నులేమిటి? నీ బ్రతుకు నీవు వేరుగా బ్రతుక్కోరాదా?' అని. రాజామణి కనుబొమల మధ్యన అయిష్టతను సూచించే చిన్నగీత కనపడి అంతలోనే మాయమైంది. కొంచెంసేపు మాట్లాడకుండా నిలుచున్నది. 'నేను స్వంతానంటే పోనివ్వడు. ఆయన్ని పొమ్మంటేపోడు. నీవు చచ్చేదాకా నా దగ్గ రుండాల్సిందే. నేను లేకుండా నీవుండటానికి వీల్లేదు. నీవు నా చేతులమీదగా దాటిపోయినాకనే నేను బయటకి పోయేది అంటాడు' అన్నది ఎంతో గర్వంగా, ఆనందంగా.

చచ్చేదాక వదల్నంటున్నాడు. లంబాడిదయ్యంలాగా పట్టుకున్నాడు. దాని చావుగురించి మాట్లాడ్డానికి వాడి కెంత ధైర్యం! తాగితాగి వాడే ముందు చావొచ్చునుకదా! సమాజం వాడికేదో హక్కును దత్తంచేసినట్లు మాట్లాడుతున్నాడే. అసలు దానికీ వాడికీ ఏమిసంబంధం గనక! వాడు బుద్ధిలేకుండా అవమానకరంగా మాట్లాడుతుంటే ఆ రాజామణికి ఏడుపు రావలసిందిపోయి ఆనందం కలుగుతున్న దెందుకో? కులం పోగొట్టుకొనకముందు దానికి దెబ్బలుండేవికాదు. రోగం వచ్చినప్పుడు పలకరించి సలహాలిచ్చే బంధుబలగం ఉండేది. చస్తే కొమ్ము పట్టడానికి కులపువాళ్లుంటారని గ్యారంటీ ఉండేది. సమాజంలో మనిషిగా ఎన్నోహక్కులు కలిగిఉండేది. అనవసరంగా తెలివితక్కువగా అన్నీ పోగొట్టుకున్నది రాజామణి ఈ దెబ్బల్లో చస్తూ యిలా బ్రతకడానికి?

ఆనాడు నాకూ మా ఆయనకూ ఆయన భోంచేస్తున్నప్పుడు మాటామాటా వచ్చింది. ఆయనకు తెలిసినవాళ్లెవరో పాతకారు మంచిదొకటి అమ్ముతున్నారట. రోజూ ఆఫీసుకి బస్సుల్లో రిక్షాల్లో వెళ్లడం కష్టంగా ఉన్నది గనుక ఆ కారు కొనుక్కోవాలని ఆయన ఉబలాటం. వెధవకారుకి బోలెడు ఖర్చు గనుక ఆ డబ్బుపెట్టి నగ చేయించుకుంటే మన డబ్బు మన దగ్గరే వుంటుందని నా ఉద్దేశం. ఇద్దరం ఘాటుగానే మాట్లాడుకున్నాం. భోజనం సగంకాకుండానే ఆయన అన్నంపళ్లెం విసురుగా తోసేసి లేచివెళ్లిపోయారు. ఆ రోజు సాయంత్రం ఇంట్లోఉండబుద్ధికాకనాలుగిళ్లవతలఉన్న నా స్నేహితురాలు సుజాతను చూడాలని వెళ్లాను. వాళ్ల వాకిట్లోకి వెళ్లేసరికి లోపల్నుండి మాటలు వినిపిస్తున్నై. రాజామణి గొంతు. 'ఆ యమ్మమీద అరిచి అన్నం తినకుండా పళ్లెంతోసేసి లేచిపోయారు. ఇట్లాగే ఏదో ఒకటి పడుతూనే వుంటారు...' అంటున్నది.


ఖచ్చితంగా నా సంగతే! ఉదయం జరిగిన సంగతి! చిన్నవిషయాన్ని కొండంతచేసి చాటిస్తున్నది! ఈ సుజాతకు పనివాళ్లమాటలు వినే దుర్బుద్ధి ఎందుకో అని విసుక్కున్నాను. మా తగాదాలు మరి కొన్ని రాజామణిదృష్టి కి రాకముందే దాన్ని పంపించెయ్యడం మంచిదని నిశ్చయించుకున్నాను. సంసారమన్నాక వారి వారి హక్కుల్ని కోరికల్ని సమర్థించుకోవలసి నప్పుడు ఎన్నో మంచిచెడ్డలు, సర్దుకుపోవడాలు ఉంటాయి మరి. సవ్యమైన సంసారం లేని దానికి యిటువంటి విషయాలు ఏంతెలుస్తాయిగనుక!

సాధారణంగా అతి తక్కువగా మాట్లాడే రాజామణి ఎక్కడైనా భార్యాభర్తల మధ్యన కించిత్తు అభిప్రాయభేదం రాగానే అదేదో గొప్పవిషయమైనట్లు చాటింపువెయ్యడం ఎందుకో నాకు అర్థం కాలేదు. దానికెవరో ఏదో అపకారం చేసినట్లు ఈ ఏడ్పుగొట్టుతనం ఏమిటి? జీవితంలో విలువైనవేవో కానివేవో తెలుసుకోగల వాళ్లను విమర్శించ

డానికి యీ కులంలేనిదానికి సిగ్గైనాలేదు! అనుకున్నాను. దాని క్షుద్ర జీవితకథను తలచుకుంటే ఒక చిన్నవిషయం నాకు తెలియకుండా మిగిలిఉన్నట్లు తోచింది. ఊరికే ఊసుపోక అడిగాను 'పుట్టినప్పట్నుండీ చచ్చేదాకా అవసరమయ్యే బంధువుల్నీ కులాన్నీ విడిచిపెట్టి ఇటువంటి తెలివితక్కువపని ఎందుకు చేశావూ ?' అని.

రాజామణి కళ్లల్లో సిగ్గులమెరుపులు దాచుకుంటూ నెమ్మదిగా చెప్పింది : 'ఏం చేసేదమ్మ. నా ఖర్మ, నేను పనిచేసే ఇంటిఅమ్మ పెద్ద స్టీలుగిన్నెలో అన్నం ఇచ్చింది. ఆయన ఆ గిన్నెకాస్తా దాచేశాడు. ఎంత బతిమాలినా యివ్వలేదు. తనతో వచ్చేస్తానంటేనే యిస్తాననీ లేకపోతే యివ్వననీ పంతం పట్టాడు. ఆయమ్మగిన్నె ఏదంటే ఏంచెప్పేది ? నోట్లో నాలుకలేనిదాన్ని, అందుకని...' అన్నది.

ఒక్క స్టీలుగిన్నెకోసం! ఒక జీవితాన్ని నడిపించడానికి, మరో మలుపుకు తిప్పడానికి ఎంత అల్పమైన కారణం! ఎంత అల్పమైన విలువలు!! అని ఆశ్చర్యపోయాను. బ్రతుకు విలువ ఎంతటిదో దాని లాంటివాళ్లకు ఎలా తెలుస్తుందిఅని సమాధాన పడ్డాను. ఇంతకూ దాని ఏడ్పుగొట్టుతనానికి కారణంమాత్రం నాకు తెలియడంలేదు !



కవిబ్రహ్మ - కథన శిల్పము

శ్రీ 'కుమార భారతి'

ఆనుశాసనికపర్వంలో సౌపర్ణోపాఖ్యానమున్నది. దాని లోని శిల్పరామణీయక విచారణ ముద్దిష్టాంశం.

ఆదిపర్వంలోనూ ఈ కథ వుంది.

ఈ కథ పుట్టడాని క్కారణం—

'ఒరులవలనఁ బుట్టు నోటమియును నెగ్గు
బొరయకుండ నరసి పుత్రవరులఁ
దగిలి కాచునట్టి తల్లి సర్పములకు
నేల యలిగి శాప మిచ్చె నయ్యె'?

ఇది. శాపహేతువిశదీకరణార్థం కథ చెప్పబడింది. కథను రెండు ఖండాలుగాచేస్తే ప్రథమ ఖండం వినత దాస్యం. పూర్వకథ. ఉత్తరభాగం గరుడుని సుధా నయనం. నన్నయగారిపని పూర్వ కథా ప్రాధాన్య విశదీకరణం. తర్వాతి భాగానికి ప్రాధాన్యం లేదు. ప్రశ్న పూర్వకథకే పరిమితమౌతున్నది కాబట్టి.

తిక్కనగారి ప్రాధాన్య ముత్తర కథా భాగానికి. కథకు వక్త భీష్ముడు. శ్రోత ధర్మరాజు. ఇతని ప్రశ్న?

'గరుత్మంతుడు మహానుభావుండ కా విందు నవ్విహగవిభుని వృత్తాంతము వినవలతు వివరింపవే'

కాబట్టి కథ సుపర్ణుని మహానుభావ వ్యక్తీకరణమే ప్రాధాన్యం దీనికి. కద్రూవినతల కథకు కాదు. ఇందుచేతనే అప్రధానమైన ఈ కథ (వినతాదాస్య వృత్తాంతం) గరుత్మంతుడు పుట్టిన తర్వాత—నడుమ చెప్పబడినది. గరుడి మాహాత్మ్య కీర్తన ప్రధానం కాబట్టి ప్రధానపాత్రను ముందు వర్ణించి, అప్రధానమైన (వినతకు కద్రువ దాసి కావటం) కథను తర్వాత వర్ణించినాడు. ఇందు చేతనే వినతాదాస్యాన్ని ఏకవాక్యంలోనే సూచించి ఊరుకున్నాడు. నన్నయగారివలె దీర్ఘకరించలేదు. తిక్కనగారి ప్రణాళికతో దానికి ప్రాధాన్యం లేదు.

ఈ కథలో రెండురకాల శిల్పాలు.

1. కథ చెప్పడంలోని పద్ధతికి సంబంధించినది. ప్రధానవిషయం, కథన శిల్పం.

2. రచనాశిల్పం. పైదాన్ని పోషిస్తూ — తాత్కాలిక విషయాన్ని భాసింపచేసేది.

కథనశిల్పం

ఈ కథ లోకవృత్తాంతంగా కవి సంఘటించాడు. లోకంలో ఆ కథ ఎలా జరుగుతుందో అలాగే వ్రాయటం. లోక స్వభావంపై ఆధారపెట్టి వ్రాయటం. పాత్రలు దివ్యులు — కశ్యపబ్రహ్మ భార్యలు సంతానం కాబట్టి.

ఒక కుటుంబముంది. సవతులున్నారు. వాళ్ల మధ్య పోరుపులు — కష్టనష్టాలు, సుఖదుఃఖాలు. ఇలాగా సాగుతుందికదా! ఆ పద్ధతి వుంది. ఇందుకే కవి కథాంతంలో వ్రాశాడు.—

'మానవలోక కలిత బహుళానందకరము' — అని. మనుష్య స్వభావోచితంగా కథాయోజనం జరిగింది. ఆ దృష్టితోడనే చూడాలి. ఈ మానవ స్వభావం కథలో మూడు నాల్గు ఘట్టాల్లో కన్పిస్తుంది.

కద్రువకు ఇంటినిండా సంతానం. పాపం! వినతకు—లేదు. ఆమెకు వగపు; మాత్సర్యంకల్గి ఒక అండాన్ని అవియించింది.

'వగపు నాకులేదని; మాత్సర్యం — దానికున్న దని'—సావత్న్యమంటే ఇంతేకదా ! ఆ అవియించిన అండమునుండి పూర్వాంగ దార్ఢ్యంకల ఒక కుమారు డుదయించి అన్నాడు.

'ఇరువుర మేము పుట్టెదు మహీనపు
మేనులతో మహాబల
స్ఫురణ వెలుంగ నప్పెనుపుఁ బొందఁగ
నీ కవియించి లిట్లు మ
త్సరమున జాపలంబుననుం—'

అని శపించాడు. శాపం రావడానికి కారణం మాత్సర్యం—ఎవరినిగూర్చి?—కద్రువనుగూర్చి. ఆమెకే దాసి కమ్మన్నాడు కొడుకు. ఆమె మాత్సర్యంచేత తనకు అపరాంగం లేకుండాపోయింది. ఆ కోపంచేత తల్లియని కూడా చూడలేదు !

శపించినవాడు సూర్యరథ సారథ్యానికి తన దారిన తానుపోలేదు. మాతృదేవత అమాయకురాలు—ఉత్తమురాలు—మెత్తనిది.

కోపంతో ఏదో అన్నాడు. శాపభీతయై తల్లి ఏమౌతుందోనని తమ్ముడు పుట్టేవరకుండి వెళ్ళిపోయాడు.

ఆ తమ్ముడు జన్మించినదే తడవుగా తాతగారైన బ్రహ్మదగ్గర పెరుగుతున్నాడు. సిద్ధసాధ్యులు ముద్దు చేస్తున్నారు. మహైశ్వర్యం— అధికారం— ఇంకేముంది?— ఇంటి గొడవ పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. పెద్దదిక్కుండి ధనవంతులైన వారి వ్యవహారమింతేకదా! — కాని వారు దుర్మార్గులు కావచ్చు. వీడు కాలేదు. ఐశ్వర్యాదులుండి దుర్మార్గులు కాకపోవడం నిజంగా గొప్పతనమే.

ఈ కథ నింతటితో త్రెంపి వినతకు దాస్యం ప్రాపించిన కథ గ్రహించాడు. ఆ కథనుండి ఈ కథలోనికి దూకిన దూకు సొగసుగా వుంది.

'జననిం బాసి జరించినప్డు తనయిచ్చం బక్షి
నాథుండునున్
—చరించుఁ బరితుష్టస్వాంతుఁడై యెల్లెడన్
అక్కాలంబున వినోదంబున కరిగి యెక్కయెడ—
చంచుల జిగురాకు జించి యాడుచు నలి
నెలుగించు గుండుకోయిలల సొంపు'—

తగిలి కొనియాడుచు— ఎవరు?— గరుత్మంతుడని పాఠకుడనుకోవడం సహజం. కాని కద్రూ వినతలని పద్యం చివరలో అనగానే మనకు విభ్రాంతి కల్గుతుంది. ఇదొక చమత్కారమైన మలుపు.

సవతులు విహరిస్తున్నారు. ఉచ్చైఃశ్రవం కన్పించింది. వినత ఆశ్చర్యంతో 'ఎంత తెల్లగావుందో చూడవే'— అన్నది.

కద్రువ—'అపరాంగమున నీలిమ తోచటం లేదా!'— అన్నది.

వాదు పెరగటం—పందెం వేసుకోవటం జరిగింది. వినతపోయి చూద్దామంటే కద్రువ 'పతి పరిచర్యకు కాలంబయ్యె'— తర్వాత చూద్దామన్నది. కద్రువ గడుసరితనమంతా ఆ మాటలో ఉన్నది.

'వినత కాదిప్పుడే చూద్దామంటుందా?'— నీకు పతిపరిచర్యకంటె గుర్రమంతోక ఎక్కువా'—అని కద్రువ నిగ్గదీస్తుంది.

లోకమం దపకీర్తి. వినత సరే నన్నది. ఇంటికి వెళ్లారు. కద్రువ నాటిరాత్రి కొడుకుల నడుగుతుంది—గుర్రం'తోకను నల్లచేయరయ్య' అని. పెద్దకొడుకులు వాసుకి మొదలైనవాళ్లు 'ఇది అధర్మం — మేం చేయం—పొమ్మన్నారు. తల్లి — పెద్దకొడుకు లిట్లు మాట్లాడుతుండగా—

—'కొందరు జననిఁ దొఱఁగి
యెక్కడేనిఁ జనిరాభంగిం
జనిన తనూజుల పేర్కొని—
నెవరువిడిచి యా నెలంత నిష్ఠురమతియై'

శపించింది.

ఎదిరించిన పెద్దకొడుకుల నేమీ అనలేదు. ముఖం తప్పించినవాళ్లను శపించింది—చిత్రం. లోక స్వభావ మంతే. ఎలాగంటే—?

ఒకతల్లి పెద్దవాడికొక పనిచెబుతుంది. నేను 'చేయనుపో' అంటాడు. తనంతవాడైన ఆ కొడుకు నేమంటుంది తల్లి ?— అనలేదు. కాని మాట వినలే దన్న కోపంపోదు. అది ఆవంలోని నిప్పులాగా వుంటుంది. పైకి పొక్కదు. చిన్నకొడుకున్నాడు. ఎప్పుడూ వాడి ఆటపాటలేమో— వాడేమో!—వేళకింత తినటం—పోవటం: ఇంటిపట్టునే ఉండడు. పెద్ద కొడుకుపైనున్న కోపం రాజీరాజి వీడిమీదికి ప్రస రిస్తుంది. 'ఈ చిన్నవెధవ కిల్లేపట్టదు. వాడు చచ్చిన బాగే. ఒక యేడుపేడ్చి వూరుకోవచ్చు. వాడేమైనా నామాటవింటే నాకీ బాధ వుంటుందా ! ఈ దొరగా రేమో నామాట వింటూరా, పెడతారా! ఆ చిన్న వెధవ ఎటుచచ్చాడో—'

ఇది లోకస్వభావం. చేయనన్నవాడికి లేదు. వీడికి నింద. మానసిక ప్రవృత్తి లిలాగే వుంటా యనడాని కెప్పుడు ?

ఆ పాముల్లో కొన్ని ఇక్కడుంటే మనకేమి మూడుతుందో అని మొకం తప్పించినవి. లోకంలో కొందరుంటారు. పనికి పాపరాజులు, తిండికి పోతు రాజులు. ఆ మొకం తప్పించిన నాగు లీరకం వాళ్ళు.

ఈ తల్లి ఎలాచస్తే మనకేమని ఎటోవెళ్లారు. వాళ్లచావుకి వచ్చింది.

తల్లికి కోపంరావటం—శపించటం జరిగింది.

వినత దాసి ఔతుంది. ఈ పైకథ ఎప్పుడు జరిగింది ?— ఆ తన నుద్ధరించే కొడు కింట్లోలేని వేళ. ఆయనకీ గొడవ తెలియదు. తాతగారి తొడ మీద ఆడుకోవటం — ఆయన ముద్దుగా ఇదీ అదీ తినిపిస్తే తినటం. క్రొవ్వి తిరగటం — ఇలావుంది వ్యవహారం.

ఒకనాడు నారదుడుచూచి అన్నాడు :

దాసియై సవతాలికి తల్లిపనులు—
సేసి నలగంగ నద్దెస చింతవంత—లేక
నీ విట్లు తిరుగంగ లెస్సయగునె—
యద్భుతోజ్వలతేజ కశ్యపతనూజ'

ఒక కుటుంబంలో కొడుకొకడు గొప్పవాడు. ఇంటి సాధకబాధకాలు పట్టించుకోడు. పట్టించు కోక పోవటంలో అశ్రద్ధతప్ప వేరేకారణం ఉండదు. ఎక్కడో ఉంటాడు. ఈ తల్లిదండ్రులు 'పోనీ పసి వాడు ! వాడికీ గొడవలుచెప్పి బాధించటం దేని' కని చెప్పరు. ఐనవాడొకడు చూస్తాడు. వాడి దగ్గరకు పోయి : 'ఏరా ! చూడబోతే గొప్పవాడివి. వాళ్లంత బాధపడుతుంటే నీ తిరుగుడేమో నీవేమో. వాళ్లగోడె పట్టించుకో వెలారా?—' అని చీవాట్లు పెడతాడు. వాడు బుద్ధిమంతుడైతే దిద్దుకుంటాడు. ఈ సంద ర్భాన్ని దృష్టిలో పెట్టుకొని పై పద్యాన్నిచూడాలి ! [నారదుడన్న సంబోధనలో ఎంత గడుసుదనం ఉందో! 'అద్భుతోజ్వల తేజ— కశ్యప తనూజ'—సంయుక్తాక్షర విన్యాసం— గరుత్మంతుని బలపరాక్రమాల నపహసిం చటం—కశ్యప—'శ్య' (యతిస్థానం) మీద విరిచి నొక్కటం. అంతాకలిసి నారదుని క్రోధభావాన్ని ధ్వనిస్తుంది. వాడొకవేళ ఎదురుతిరిగితే 'నేనే మన్నా నురా! — కశ్యపుడి కొడుకువుకాదా! అద్భుతోజ్వల తేజుడవుకావా !'—అని తప్పించుకోవచ్చు. ఇదే రచనా శిల్పం ... వేరే వ్రాయదగింది. సందర్భం కాబట్టి వ్రాయటం.]

విన్న గరుడునికి కోపంవచ్చింది— 'ఆ! నాతల్లి నింతచేసిందా పెద్దమ్మ!' అని. పిదప వగపట. 'నా తల్లి ఇంత పడికూడా నాకు కబురు చేయలేదే. అయ్యో' —అని. తానూ పట్టించుకోలేదు. [illegible] ఏండ్ల దాస్యము. తనతోచెప్పటానికి తానింట్లో ఉంటేనా !—అదంతా కలిసి వగపు. ఆ మనోభావ క్రమ వికాస విన్యాసంలోఉంది కవి నిద్ధాతనం.

ఆ వగపు మనస్సులో పెట్టుకొని,

'మేలుమే లప్పహితంబుజేసెం జెలియల్ మను చున్నది', అన్నాడు తల్లి అమాయకత్వాన్ని పురస్క రించుకొని. కద్రువచేసిన మోసంపై కోపం. అట్టి దుర్మార్గురాల నప్పగారని వెన్నంటితిరిగే తల్లిమీద కోపం. ఆమె నోరిగద్దరితనంమీదా, ఈమె నోరు లేనితనంమీదా కోపం. వెంటనే వాయువేగంతో

వెళ్లి తల్లినిచూచి 'విషాదభరార్తమూర్తియై', నమస్కరించినాడే కాని ఏమీ మాటాడ లేదు. ఏమంటాడు? దోషం తనది. ఇంతటి కొడుకుండగా అంతబాధ ననుభవించిన పిచ్చితల్లిని చూచి ఏమంటాడు?—అవురుమనాలి. ఆయన గంభీరుఁడు కావున లోలోపలే అవటిల్లిపోయాడు. అందుకని విషాద భరార్తమూర్తియై అని వ్రాయటం.

కద్రువ కడకేగి—'పరమవినీతిమై నెఱిగి బాంధవ మారఁగ—తారితారి అల్లన'నేదో అన్నాడు. మనం పెద్దవాళ్ల దగ్గరకువెళ్లి సమయంకోసం వేచి వుండటం; దానికోసం మనం పడేపాట్లు ఆ—'తారి తారి'—మాటలో ఉంది. సరే అన్నాడు—'నీ చెల్లెల్ని ఇలా దాసిగా చేయడం నీకే మచ్చుగదమ్మా! విడచి పెట్టు...లోకం నిన్ను స్తుతిస్తుంది'—ఆమె చలించ లేదు. మళ్లా అన్నాడు—'నేను నీకు కుమారుణ్ణేకదా! నా మొగం చూచియైనా వదలిపెట్టు'అని. అంతా లోకమే! ప్రతిమాటలోనూ లోకస్వభావమే. కద్రువ సంగతి ఇతనికి తెలియదు. పుట్టిం దగ్గర్నుంచీ బ్రహ్మదగ్గరేగా నివాసం. 'నేనింత వాణ్ణి—నా మాట వినదా మా పెద్దమ్మ'—ఈయనకు ధీమా!

'నన్నుఁజూచియైన తల్లి కృపసేత పెద్ద యును లెస్స' అన్నాడు. ఈ మాట సరిగా ఇలాగే వాడటం ఉందికదా! వీడెంత సేపటికి వదలటఁలేదని కద్రువ ముఖం 'మురకటించుకొన్నదట.' ఎంత సొగసైన తెనుగుమాట. సొగసెక్కడుంది! శబ్దం అభినీతం కావాలి! అంటే శబ్దానికి అభినయశక్తి నాధానించాలి—అభినయముఖంగానే రసానుభూతి. అభినయాపేత శబ్దానికి రసానుభూతిని కల్గించేశక్తి ఉండదు. ఇదే శబ్దం చూస్తే—మూతి ఒక ప్రక్కకు త్రిప్పి ఈఁ—అని సాగదీసినట్టు — ఈ లోకంలోని దృశ్యం కన్నుల్లో పొడుస్తున్నది కదా! ఇదే శబ్దాభి నయమంటే. (తిక్కనగారిశబ్ద మిలాగే వుంటుంది సర్వత్రా). కద్రువ వినతపై పెత్తనం చెలాయిస్తున్నది. వీడేమోవచ్చి బంధుత్వం త్రవ్వుతున్నాడు. ఈ కోపాన్ని ఆ శబ్దం అభినయిస్తున్నది.

సందర్భోచితంగా శబ్దాన్ని పొదగటం విద్య. ఇందుకనే ఒకచోట విశ్వనాథవారు:

'పదునేను పర్వములు వ్రాసిన ఆ మహానుభావుడు ...తెనుఁగు భాషయొక్క జీవముచేత, నుడికారముచేత, బలుకుబడిచేత—ననంతాచ్ఛాంధ్ర శబ్ద సంయోజనంచేత' అని వ్రాయటం. మురకటించుకొని ఆమెఅన్న మాటలన్నీ వట్టి ఎగతాళి. ఎత్తిపొడుపు.

'బలవంతుడవు నేర్పు చందములఁ జెప్పంజాలి
తీ రిత్త పల్కులఁ దేర్పం బనిలేదు

'బలవంతుడవు—పెద్ద మొనగాడవు — ఇన్నాళ్లేమైనావు ? ఇవాళవచ్చి నేర్పుగా బంధుత్వం త్రవ్వుతున్నావ్. ఇన్నాళ్లేమైం దిది ? నేర్పుగా మాట్లాడగానే సరా ! ఈ నాటికి నీ అవసరంకోసం 'పెద్దమ్మ' అంటావా! చాల్లే! ఈ రిత్తమాటల్తో పనికాదు. నీకు తల్లికావాలంటే — లోకులు నిన్నుం బ్రణుతింప తెమ్మమృతమున్—'

ఈ పద్యరచన సర్వం ఆమె మనస్సులోని కోపం—అవహేళన వీటిని ధ్వనిస్తున్నది, పద్యంలో బిగింపులేదు. అంతా శిథిలబంధం. గాఢబంధంకల తిక్కనగారి వాక్యం ఇక్కడిలా వచ్చిందంటే నిర్మాణ మార్మికతా దృష్టితోనే. పండితరాయలన్న నిర్మాణ మార్మికతా దృష్టితో చూడాలి. వాడన్న చులకన—'తేగలడా !' అన్న ధీమా. తెస్తే చూద్దాం! తేలేడు—దాస్యం పోదు. ఒకవేళ తెస్తాడయ్యా — అమృతం దక్కుతుంటే ముచ్చు వినతదాస్యం దేనికి ? ఈ భావంతో హేళనగా 'తల్లికి మదింగూర్తేని వేబోయి లోకుల్ ప్రణుతింప దెమ్మమృతమున్' అన్నది. అదేదో చాల తేలికైనట్టు. అలా అనటంలో 'తేనేతేలే!' డని ఆమె నమ్మకం.—'ఎలా?' కశ్యపునితో ఈ మాట చెపితే గరుత్మంతుడు — తండ్రిఅన్నాడు 'అమృతంబు దుర్లభంబ య్యమరులకేని' అని. మరి ఆయన భార్యకీ సంగతి తెలియదా ! అందుకని— 'అది తీసుకురా ! నీవు చెప్పినట్టే చేద్దామన్నది !', వాడు భయపడి పోవచ్చు—తెస్తేసరి. ఎలాగైనా మంచికే. ఇంకొక

భావముంది. లోకంలో తనమీద తప్పులేకుండా చేసి కోవడానికిది ఒకమార్గం. రేపు లోకమిలా తనను ఆడి పోసుకోవచ్చు — 'తనంత కొడుకువచ్చి పసం నోరుతెరిచి అడిగాడు. లేదన్నది. ఏమాడువారో— మగవాడు—పిల్లవాడు అడిగినదాన్ని కాదనడానికి నోరెలా వచ్చిందమ్మా !' అని ఇరుగు పొరుగు వాళ్లు బుగ్గలు నొక్కుకోవచ్చు. అందుకని ఈ అపవాదు నుండి తప్పుకోవడానికి—'అలాగే నాయనా! అమృతం తెచ్చిచ్చి నీ తల్లిని తీసుకుపో !' అన్నట్లుగా. అప్పైన వ్రాసినట్లు—ఇంత భావాన్ని కడుపులో పెట్టుకొన్నదా పద్యం—అంటే కద్రువ. లోకంలో లౌక్యులైన తెలివి గల వాళ్లలాగే మాట్లాట్టం మనకు తెలిసిందే.

సరే ! గరుడు డంగీకరించి తండ్రిదగ్గరకు వెళ్లటం, ఆయనఉపాయం చెప్పటం—ఈయన స్వర్గ లోకానికిపోవటం జరిగింది.అమృతంచుట్టు అగ్ని ప్రజ్వ రిల్లుతున్నది. చూచిన వీడు— ఎలారా! అని బ్రహ్మ (తాత) దగ్గరికి వెళ్లాడు. ఆయన వెన్న వేయ మన్నాడు. ఇందులోనూ లోకస్వభావముంది. ఆ నిప్పును చూచి తన రెక్కలు కమరువేమో అను కొన్నాడట గరుడి. వాడంత బలశాలి—గొప్పవాడు ఇలా అనుకోవడం బాలచేష్ట. మన ఇంట్లో పసివాడి కొక విషయం తెలియదు. దాన్ని చూడగానే వీడు తెలియదనుకొని పెద్దవాళ్ల నడిగి సమాధానం పొందటం—తెలిసిందే. పెద్దవాళ్లందుబాటులో వుండరు. వీడే తంటాలుపడతాడు. అలాగే గరుడుడు. నిప్పును చూడగానే! ఎలా! ప్రశ్న. మనస్సులో తాతయ్య కన్పించాడు. ఇంక ఆలోచించకుండా ఆయన దగ్గరికి పరుగెత్తాడు.

సుధనుతెచ్చి కద్రువకు చూపి తల్లిని గ్రహిం చాడు. అమృతం కద్రువ కియ్యలేదు. ఎందుకని! కద్రువ అన్నమాట 'తెమ్మమృతమున్'— ఎట్లు ?— లోకులు నిన్నుం బ్రణుతింప. అలాగే తెచ్చాడు. ఇమ్మనలేదు—తెమ్మన్నదంతే. అరే! తెమ్మంటే ఇమ్మని కాదా! సందర్భవశాత్తూ—అన్న వ్యక్తి ననుసరించి ఉంటుంది—వ్యవహారం. ఆమె తనను తిరస్కారంగా ఎత్తిపొడుస్తూ—కొడుకని చూడకుండా! ఛీ—ఫో! అన్నట్లు మాట్లాడింది. అందుకని ఇవ్వక్కర్లేదు. గరుడు డన్నాడు.

'జననీ ! నీ వమృతమ్ము తెమ్మనిన
ఆ సత్యోక్తి పాటించి యే
జని నానావిధ కర్మకర్మఠుడనై
సాధించి వేదెచ్చితిన్;
వినతం దోడ్కొనిపోయెదన్
మనమునన్ విభ్రాంతి లేకుండుమీ'—

సంబోధనలో అవహేళనముంది. 'బలవంతు డవు'— అని తన నన్నట్లే.

ఇలా మాట వెరపుతో ఆమెను జయించి తల్లిని తీసికొని వెళ్లిపోయినాడు గరుడుడు. 'మాట వెరవు'—కవి వాడినమాట. వెరవేమి?—తెమ్మన్నదే గాని ఇమ్మనలేదు. కాబట్టి అమృత మివ్వక్కరలేదు. ఆమె దుస్స్వభావ. మాయకురాలు. అలాంటివాళ్ల నలాగే శిక్షించాలి.

ఒక ముక్కుపొగరుబోతు అన్నా డొకడితో— 'ఒరే ! నా చెయ్యి వంచు. నీ బలం చూద్దాం' అని. వీడు 'సరే'నని—అన్నవాడి చెయ్యి వెనక్కువంచటం మొదలుపెట్టేసరికి, వాడికి చెయ్యి బెణికి—ఇలాగా వంచమంటే ! పైకి వంచాలిగాని—అని ఏడ్చాడు. వీడన్నాడు. 'నువ్వు ఎటువంచాలో చెప్పలేదుగా మరి' అని. ఈ లౌకికసంఘటనలో విషయ మేమిటి? వాడి తలపొగరణచటమే. అలాగే కద్రువ పొగరు తగ్గించటం కోసం, కవి అలాగా కథను వ్రాశాడు. ఇదే లోక స్వభావం.

కథ సిద్ధసాధ్యులతో ప్రారంభమయింది. వాళ్లు గరుత్మంతుణ్ణి లాలిస్తున్నవాళ్లు. మళ్లీ వాళ్లు గరుడుని స్తుతించడంతో కథా సమాప్తి జరిగింది. కథ ఎక్కడ, ఏ స్థాయిలో మొదలౌతుందో ఆ స్థాయిలో అక్కడే ముగుస్తుంది. కథ కొక పొందిక వస్తుంది దీనివల్ల. కుదింపు వస్తుంది. శరీర పార్శ్వాలు రెండూ సమానంగా ఉండటం అందం. ఎగుడు దిగుడుంటే

వికారం. కథకు మొదలూ చివరా రెండంచులు. శిల్పానికి పార్శ్వాల్లాగా. కాళిదాసు మాళవిక నన్నాడు 'పార్శ్వే ప్రమృష్టే ఇవ'— అదీ శిల్పసౌందర్యం.

ఇది ప్రధాన కథన శిల్పం

రచనా శిల్పం :

దీన్నిగూర్చి 4, 5 పద్యాలు తీసుకొని విచారించాలి.

I. (1) (అరుణుడు) అనూరుడు పుట్టినప్పుడన్న మాటలు.

(2) గరుడి జన్మ—ఈ రెంటిని చంపకమాల ల్లోనే వ్రాశాడు కవి.

II. (1) కద్రువ గరుత్మంతునితో చెప్పినమాటలు.

(2) గరుత్మంతుడు సుధతెచ్చి ఆమెతో అన్న మాటలు—రెంటినీ మత్తేభాలలో వ్రాశాడు

III. కద్రువ శాపం.

—(విధానంగా వీటిని చూస్తే మిగతా పద్యాలూ ఇలాగే చూడవచ్చు. అరుణుని మాటలు: 'ఇరువుర'—మన్న పై పద్యము. అరుణుని మాటలు.

'ఘనతర కంధరుండు దృఢకాయుడు
దీప్తముఖుండు వహ్ని లో
చనుఁడు మహోత్తమాంగకుఁడు
చారుసుసంగతపక్షసారముం
డనుఁడు—పరిస్ఫురద్ద్యుతి
విడంబితబాలదివాకరుండు లో
క నయన పర్వ నిర్వహణకారి
సుపర్ణుఁడు పుట్టె భూవరా !

అరుణునికి కోపం రావడానికి కారణం — కద్రువపై వినతకున్న మాత్సర్యం. దాన్ని నొక్కుతున్నాడరుణుఁడు. మ—తోపాదంతెగి, 'త్వరము'—తో తృతీయచరణారంభం జరగటంతో, రెండవపాదాంతం బరువంతా, 'త్వ' మీదపడి అతని కోపభావాన్ని రమణీయంగా ధ్వనితం చేస్తున్నది— రచన.

ఇరువుర — పద్యంలో అహీన—యతిస్థానం 'హీ'. దీనిమీద ఊనికవుంది. అరుణుఁడు గరుడుడు అహీన బలోపేతులు. ఎంతబలము !—'హీ'ని సాగదీసి చదివితే తెలుస్తుంది. (తెలుగులో యతిప్రాసలు భావ, రస వ్యంజ్యకాలనటం ఇందుకే. అక్కర్లేదు ! బరువు చేటనడం — ఎలాంటిదంటే, బలమైన ఆహారము తినకూడదు—అరగటం కష్టంకాబట్టి—అనటం లాంటిది.)

ఇద్దరన్నదమ్ములూ సమానబలస్ఫురణ గలవారు. బలంలోనే కాదు. సర్వమునందు. ఆ సాదృశ్య స్ఫురణకై ఇద్దరినీ ఒకే వృత్తంలో వర్ణించాడు కవి. కాని ఘనతర—పద్యం ఘనతమం. విచిత్ర శైలీ రమణీయమైనది. చిన్నవాక్యాలే కావటానికి. కాని ఎంత ఓజోగుణం — అనుసంధించాడు మహాకవి ! పద్య రచనలో — శబ్దసంయోజనంలో నిబిడత్వ ముండాలి. దంతురత్వ ముండాలి. అది పాత్రలో ఉంది. అదే శబ్దంలోకి జారింది. పై పద్యంలో ఓజస్సులేదు. (తేజస్సుంది—యతిప్రాసల్లో — మత్సరమని విఱవటంలోని 'కాంతి' ఎంత ఓజస్సుతెచ్చాడు కవి ఈ పద్యంలో.)

అరుణుడన్నాడు 'అప్పెనుపుఁ బొందగ నీ కవియుంచి తిట్లు—న'న్నని. పెనుపు పొందనివాని మాట పై పద్యము. పెనుపుపొందిన అహీనబలుని మాట క్రింద పద్యం. బలస్ఫురణ ఎక్కువగలిగి పుట్టినవాడు గరుడుడు— ఇందుకని ! పద్యం—పట్టాశ్వం కదను త్రొక్కినట్లు నడుస్తున్నది.

ఇద్దఱి మనస్సులూ—ఆలోచనా పద్ధతులూ ఒకటే కాబట్టి అరుణుడు శప్తవినతను చూచి :

'తల్లీ వలవ దడల నిది విధాతృ వశమయి వచ్చెన్' అన్నాడు.

సరిగా గరుడుడు కూడా కద్రువతో తన తల్లి దాస్యాన్ని విడుమంటూ :

'దాస్యకర్త్రి నా జనయిత్రికి నివ్విధంబునన్ రాకయు దైవకృత్యము' అని సమానదైహిక—మాన


సిక—విన్యాస సూచనకై సమానవృత్త స్వీకరణం చేశాడు.

(2) అలాగే కద్రువ ఏమనస్తత్త్వంతో ఎగతాళిగా 'బలవంతుడవు'—అన్నదో!—సరిగా అలాగే గరుత్మంతుడు 'జననీ' అని అదే మనస్తత్త్వంతో ఆక్షేపించాడు. ఇది ఆక్షేపణ. లోకస్వభావ మింతే. అవతలి వాడెలా నిందిస్తాడో మనమూ సరిగా అదే పద్ధతిలో పగ తీర్చుకొంటాం.

(3) కద్రువ శాపపద్యం. ఇది భావవ్యంజ్యకత కుదాహరణ. (పైది మనస్తత్త్వ సామ్యతకు)

ఆతడు (జనమేజయుడు) సర్పయాగ మను
నధ్వరముం గుపితాత్ముడై పితృ
ప్రీతిగజేయుఁ దద్దహన
భీకర భూరి శిఖాప్రవేశ సం
జాత దురంత తాపమునఁ
జావగలారని శాపమిచ్చెఁ—ద
త్పాతన వృత్తికిన్ వెఱచి
తక్కటినాగము లా భుజంగితోన్'

సమాసజటిలత కోపజటిలతకు వ్యంజ్యకం. గీటుకొట్టిన భాగాలమీద బరువుంచి చదివితే పండ్లు మీటుతూ అన్నట్లుంటుంది. అలాగే అన్నదామె. ఆ కోపమంతా 'చావగలా'రన్నమాటలో గూడు కట్టుకొన్నది—పర్యవసానంలో తేలికపనిచేసి పీడవిరగడైనదని చేతులు దులుపుకొన్నట్లుంది ఆ మాట అనటం. వాడిది త్రాచుపాముపగ—అని లోకం. పద్యంలో 'భుజంగి'శబ్దం దీన్ని స్పృశిస్తుంది. త్రాచు తన గుడ్లను తానే తింటుందని లోకం. ఇది సర్పస్వభావం. ఇందుకే 'భుజంగి'. ఈ రచనా శిల్పం పై శిల్పాని కంగభూతమౌతున్నది.



ఆనందలీల

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

బ్రతుకుల్లో ఏళ్ళమ్మైలురాళ్ళు గడుచుకొంటూ,
వెలుగూ చీకటీ గట్లమధ్య పడవ నడుపుకొంటూ,
ఎర్రని ఎండల్లో ఎండీ,
జడివానల్లో తడిసీ,
తెలతెల్ల మంచుపొగల్లో కనుమరుగవుతూ,
ఈ శిశిర వేళదాకా వచ్చేనా!

నేనీ లోకానికి వస్తూ వస్తూ
పసితనపులేత గుప్పిళ్లల్లో దాచుకు తెచ్చుకున్న దేదో
పోగొట్టుకొని,
పోగొట్టుకొన్న దేదో మర్చిపోయి
తలకొట్టుకొని,
బిక్క మొగం వేసుకొని,
జీవితం పొడగునా వెదుక్కొంటూ వచ్చేనా!

నన్నంతా వింతగా చూసి పక్కలకి
తప్పుకొన్నారు —
తప్పుకొని, మొగాల్చాటుజేసి
నవ్వుకొన్నారు—
పిచ్చివాణ్ణను కొన్నారు—

అవునవును,
వస్తూంటే తోవలో
అందంగా, ఆకుపచ్చగా మోగే గాజుల చెయ్యొకటి
సన్నటి అరటినారతో అల్లిన మల్లె మొగ్గలదండ
సుతారంగా పుచ్చుకొని నన్నలంకరించవస్తే

ఆ అద్భుత సుగంధ లక్షణాన్ని భరించలేక
కంగారుపడిపోయాను,
కళవళపడిపోయాను—
అంతలో అర్జంటుపని, మీదపడి, బస్సుఎక్కి
వెళ్లిపోయాను–

అవునవును ఒకసారి
ఎందుకో దిక్కుతోచక ఒక్కక్షణం
బ్రతుకు దిగాలుపడి ఆగిపోయినపుడు,
చప్పగా చదికిలబడిపోయినపుడు,
'నెలవంక' నా కళ్లమీద జారిగా
మెత్తని వెన్నెలరెక్క విప్పితే
సంసార వ్యూహంలోపడి గమనించక
వెలుగులోనూ వెదుక్కొంటూ
ముందుకు వెళ్లిపోయాను.

ఈ అదృష్టాధ్వంలో
చిక్కులూ, బీటముళ్లూ వేసుకొంటూ, విప్పుకొంటూ,
పనులన్నీ మళ్లా మళ్లా సర్దుకొంటూ,
డబ్బులెక్కలు చూసుకొంటూ,
ఏదో పోగొట్టుకొన్న వెర్రితోనే బ్రతుక్కొంటూ,
నిట్టూర్పులతో, నిస్పృహలతో,
అసంతృప్తితో, అశాంతితో,
జీవితమంతా కిక్కిరిసిపోయి
దారిపొడుగునా కన్నీటి ముత్యాలేరుకొంటూ,
దండగుచ్చి మనఃపేటికలో దాచుకొని
రహస్యంగా చూసుగుంటూ,
వస్తూ ఉంటే,
నా వెనక ఎవరిదో నవ్వు మోగినట్టయింది—
మోగి, ఆగినట్టయింది–
'గజ్జెలందియాలు ఘల్లుఘల్లున మోగ్రియకండా',

గాజులున్నా గల్ గలా మనకుండా,
వెనకాలే నిశ్శబ్దంగా వొచ్చి
నవ్వుమోగి ఆగినట్టయింది—
అప్పుడు హఠాత్తుగా,
నా పసితనపుటానందమండపంలో
మోగిన వెండిగంట జ్ఞాపకం వచ్చింది—
అడుగడుగునా నేను పోగొట్టుకున్నదేదో
గుర్తుకు తెచ్చింది—
గుండెల్లోంచీ కన్నీరు చిమ్ముక వచ్చింది.



మహాయోగి అరవిందుడు

శ్రీ "కాకుమాను తారానాథ్"

(గత సంచిక తరువాయి)

అరవిందుని యోగసాధన వివరణ కష్టమైనదనే చెప్పాలి.

అంతేకాదు. అరవిందులే స్వయంగా ఒకసారి, ఎవ్వరూ తనజీవితచరిత్రను వ్రాయలేరనీ, ఎందు కంటే అది పైపైన చూడతగిన జీవితంకాదు కాబట్టి, అని అన్నారు. అలాగే మానవునిలో అనేక వ్యక్తిత్వాలున్నాయి. కాని నిజమైన వ్యక్తిత్వమేమిటి? ఒకానొక పనికి భగవానుని ఉపకరణంగా ప్రపంచ నాటకరంగంలోకి విసిరివేయబడిన అంశగానే నిజమైన వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలె. (.. But the true person is also there; it is the Eternal thrown out in time as the Cosmic and the indivi dual for a particular purpose, use or work. This true person is all the time conscious of his identity with the Cosmic). అయితే ఈ నిజమైన వ్యక్తి ఎప్పుడూ తన తాదాత్మ్యతను విస్మరింపడు. (This true person is all the time conscious of his identity with the cosmic.)

అలాగే నిజమైన ఆధ్యాత్మిక పురుషుని జీవిత మంటే ఆయన ఏమిచేశాడు లేదా ఆయన సమకాలి కులు, ఆయనను ఏవిధంగా చూశారు అన్నదికాదు కావలసింది అంటారు అరవిందులు. ఒకప్పు డెలా ఉండే వ్యక్తి, తరువాత తరువాత అంతర్గతంగా ఎలా మారాడన్నదే ప్రశ్న. ఆ ఆధ్యాత్మిక పురుషుని బాహ్య జీవితానికి కావలసిన సర్వస్ఫూర్తి, శక్తి అంతర్గత జీవితమే 'సప్లై' చేస్తుంది. ఇదే అరవిందుని దృక్పథము.

తరువాత అరవింద వివరణలో ఇంకొక బాధ ఉంది. ఆయన తన భావాలన్నిటినీ ఆంగ్లభాషలో వెలువరించారు. దానిలోనూ ఆయనభాష ప్రత్యేకంగా ఆయనభాషే. అనేక నూత్నపదప్రయోగాలతో, ఆయన భావావేశాన్ని వెలువరించటానికి, గంగావతరణ వేగంతో, గంభీరమనోజ్ఞంగా ఉంటుంది. దానిని అర్థం చేసుకోవటమంటే మననం చేయవలసిందే. ఆ భావాలను తెలుగులో యథాతథంగా అనువదిం చటం, అర్థరహితమూ, వ్యర్థమేకాకుండా, ఈ రచ యిత దానికి అనర్హుడు. కాబట్టే నాకు తోచిన భాషలో ఆ భావాలను, నా శక్తికొలదీ ఈ చిత్రణలో ప్రదర్శించటానికి ప్రయత్నం చేస్తున్నాను. ఇందులో అనేకదోషా లుండవచ్చు.

పాండిచేరి జీవితంలో అరవిందునికి యౌగిక సహాధ్యాయిని లభ్యమయింది. ఆమెయే నేడు 'మాత' పేరుతో అరవిందాశ్రమపు రూపురేఖలను దిద్దుతూ వుంది. వ్యక్తిగతజీవితంలో ఒకనాటి శ్రీమతి పాల్ రిచర్డ్, ఫ్రెంచివనిత. ఆమెకు చిరుతవయస్సులోనే–11, 13 సంవత్సరాల వయస్సులోనే ఆధ్యాత్మిక అనుభవాలు కలుగసాగాయి. భగవంతుని అస్తిత్వంలోనూ, మాన వుడు భగవంతునితో ఐక్యత పొందగలడు అన్న విషయంలోనూ నమ్మకంకుదిరిన బాలిక అయింది. 1910 లో తన భర్తతో ప్రథమంగా పాండిచేరి రావటం, అరవిందుని దర్శించటం జరిగింది. అప్పటి నుండి ఆమె భారతదేశం రావటానికి తహతహలాడి, 1920 నుండి ఈ దేశంలో స్థిరనివాస మేర్పరుచు కోవటం జరిగింది.

ఈ దేశము ఎంత అదృష్టానికి నోచుకుందో! ఇరువురు ఐరిష్ స్త్రీలు సోదరినివేదిత, అనిబిసెంట్ లు ఈ దేశముకోసం తమ సర్వస్వాన్ని ధారపోసి, మన నుంచి వెళ్లిపోతే, నేడింకొక ఫ్రెంచిస్త్రీ 'మాత' రూపంలో ఈ దేశంకోసం, దీని పరిశుద్ధ ఆధ్యా త్మిక, చైతన్యస్రవంతి కోసము అహర్నిశలూ పాటు పడుతున్నది.

*　*　*

అరవిందుని పాండిచేరి జీవితాన్ని, మనకు లభ్యమయ్యే వివరాలరీత్యానే అంచనా వేయబూనటం దుస్సాహసమే. అరవిందుడు—కొంతమంది దృష్టిలో చెప్పుకోవాలంటే — చాలా అధునాతనయోగి. మద్యమాంసాదులు, పొగపీల్చటం ఆయన కేవలం ఒకానొక దశలోమాత్రమే మానివేశారు. ప్రారంభదశలో పాండిచేరిలో ఆర్థికమైన అనేక ఇబ్బందులకు గురి అయ్యారు. ఒక్కొక్క రోజున చేతిలో 0–4–0, 0–8—0 మాత్రమే ఉండటం సంభవించేది. ఉన్న ఒక రిద్దరు అనుచరులూ ఉన్నంతలో ఆయనజీవితం సౌఖ్యంగా గడిచేందుకే ప్రయత్నించారు.

ఈ జీవితంలో రెండు విషయాలను మనం గుర్తుంచుకోవలె.

మొదటిది బ్రిటిష్‌ప్రభుత్వము ఆయన మీది నుంచి దృష్టిని మరల్చలేదు. చాలారోజుల వరకు, ఏదోవిధంగా రెచ్చగొట్టయినాసరే ఆయనను బ్రిటిష్ ఇండియాకు రప్పించి, తిరిగి ఆయనను బంధించాలని చూచింది. ఒకప్పుడు ఫ్రెంచిప్రభుత్వమే అరవిందుని, బ్రిటిష్ ప్రభుత్వానికి ఒప్పచెపుతుందేమోటనేటంత అనుమానాలు కలగటం, విప్లవకవి సుబ్రమణ్య భారతి ప్రభృతులు పాండిచేరి వదిలి ఎక్కడికోపోయి తలదాచుకొని భారత స్వాతంత్ర్య సమరాన్ని సాగించాలి అని ఆలోచించేటంతవరకు విషయాలు పోయాయి. ఏది ఏమైనా అరవిందుడు తనకొచ్చిన భయమేమీ లేదనే దృఢవిశ్వాసాన్నే వెల్లడించారు. అదృష్టవశాత్తు అరవిందుని విశ్వాసమే నిజమైనదని ఋజువయింది.

ఇంకొకసారి సాక్షాత్తు ఒక సి. ఐ. డీ. యే అరవిందుని పరివారంలో కలిసిపోవటం జరిగింది. కాని కొన్నిమాసాలతరువాత, అతనంతట అతనే తన నిజరూపాన్ని ప్రకటించుకొని, అరవిందుని వదిలి వెళ్లటం జరిగింది.

రెండవ విషయము యోగసాధన కాలపరిమితి. ఒకటిమట్టుకు ఇప్పుడు తథ్యమైన విషయంగా చెప్పుకోవచ్చు. పాండిచేరికి పోయినపుడు అరవిందుల ఊహలో తాను శాశ్వతంగా పాండిచేరిలోనే ఉండిపోతాననే భావన లేదనిపిస్తుంది. తమ ఆశయము 4, 5 సంవత్సరాలలో నెరవేరుతుందనీ, తిరిగి భారత దేశానికొచ్చి క్రియాశీలరంగంలో ప్రవేశిస్తాననే ఆశను వారు అప్పుడప్పుడూ వెలువరించారు.

కాని పరిస్థితి మారింది. అరవిందులు ఇక తిరిగి భారతదేశంమీద (బ్రిటిష్ ఇండియాలో) కాలూనలేదు. కాని దేశరాజకీయ పరిస్థితిని గమనిస్తూనే అప్పుడప్పుడు తమ అభిప్రాయాలు వెల్లడిస్తూవచ్చారు. క్రిప్స్ రాయబారవర్గ పథకాన్ని యథాతథంగా ఆమోదించమని ఒక ప్రత్యేక దూతను ఢిల్లీ పంపారు. అతనా సందేశాన్ని ప్రముఖ పత్రికా రచయిత శ్రీ బి. శివరావుకు అందచేయటం, ఆయన దానిని శ్రీ రాజగోపాలచారికి అందజేయటం జరిగింది.

కాని ధృఢనిశ్చయంతో, రాజకీయాలలోనికి తిరిగి రమ్మనివచ్చిన అనేక ఆహ్వానాలను ఆయన నిరాకరించారు. జోసెఫ్ బాప్టిస్టా, లోకమాన్య తిలక్ ప్రభృతు లనేకమంది ఆహ్వానించినా ఎదురొడ్డి నిలిచారు. తమధోరణిలో తాము నిమగ్నులయ్యారు. వారిని ఆనాడు కలిసినవారిలో లాలా లజపతిరాయ్, డాక్టర్‌మూంజీ, తరువాత తరువాత రాష్ట్రీయ స్వయంసేవక సంఘ స్థాపకులు డాక్టర్ హెడ్గెవార్ ప్రభృతులంతా ఉన్నారు. ఆ సమావేశాల వివరాలు కూడా మనకంతగా తెలియవు. ఒకటి తథ్యం. ఏ విజ్ఞప్తీ, ఏ విన్నపము ఆయనను పాండిచేరినుంచి కదలించలేకపోయింది. రామకృష్ణ పరమహంస శతజయంతి ఉత్సవాలుకూడా ఆయనను కదలించలేదు

పాండిచేరిలోని మొదటి నాలుగు సంవత్సరాలు, దాదాపుగా ప్రపంచానికి దూరంగా జీవితం గడపటం జరిగింది. తరువాతి సంఘటన 'ఆర్య' మాసపత్రిక ప్రచురణ. పాల్ రిచర్డ్ దంపతుల ప్రోత్సాహంతో 1914 లో అరవిందుని జన్మదినమైన ఆగస్టు 15 న 'ఆర్య' ప్రథమ సంచిక వెలువడింది. అయితే ఇది 7 సంవత్సరాలు మాత్రమే నడిచింది. 1921 జనవరిలో దాని ఆఖరిసంచిక వెలువడింది. బహుశా ఈ అధునాతన పత్రికా ప్రపంచ చరిత్రలో, అంత స్వల్పకాలంలో అంతటి ఉదాత్త సందేశాలను ప్రపంచాని కందజేసిన పత్రికలు లేనేలేవేమో! తరువాత తిరిగి ఒక విధమైన ఏకాంతవాసం సాగింది. కేవలం మాత (శ్రీమతి రిచర్డ్) ద్వారానే బాహ్యప్రపంచంతో

ప్రవర్తించటం జరిగింది. ఈ కాలంలోని మహత్తర సంఘటన నవంబరు 24, 1926 నాటి విషయము. అతీతమనస్సు ఆనందము అవతరణకు అనువుగా ఉపరిమనోదైవతమగు కృష్ణుడు భూతధాతువు లోనికి అవతరించిన దినమది. అది మొదలు ఆ రోజు అరవిందుల సిద్ధికి జ్ఞాపకముగా పరిగణింప బడుచున్నది. ఆనాటి సాయంకాలం 6 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో, ముఖ్యాతిముఖ్యులైన శిష్యులు—24 మంది ఉండటం జరిగింది. 1927 లో 'దర్శన' పద్ధతి ప్రవేశ పెట్టబడింది. సంవత్సరంలో 4 రోజులు మాత్రమే సర్వులూ దర్శనం పొందటానికి వీలుచేయబడింది.

ఈ ఏకాంతత తిరిగి 1930 లో సడలింప బడి, విపరీతంగా బాహ్యప్రపంచంతో సంబంధం పెంపొందించారు. అయితే అది కేవలం లేఖలద్వారా మాత్రమే. 1930 నుంచి 1938 దాకా ఈ పద్ధతిలో పనిచేయటం జరిగింది. ఈ దినాలలో పని ఎంత ఒత్తిడిగా ఉండేదంటే, ఒక్కొక్కసారి ఉత్తరాలకు సమాధానాలు తెల్లవారుఝామున 5 గంటలదాకా వ్రాస్తూ ఉండేవారు. 1938 తరువాత తిరిగి ఏకాంతవాసాన్ని వాంఛించారు. కేవలం మాత ద్వారానే సర్వవ్యవహారాలు జరగటంకాకుండా, సర్వకార్య భారమూ ఆమే వహించటం జరిగింది. వారి జన్మ దినమైన ఆగష్టు 15 న 1947 లో భారత స్వాతంత్ర్యవార్తను విన్నారు. ఆ రోజు వారి దర్శనార్థుల సంఖ్య 2000 లకు పెరిగింది. చిట్టచివరి దర్శనము 24 నవంబరు, 1950 న జరిగితే, డిసెంబరు 5 న అరవిందులు మహాసమాధి పొందటం జరిగింది.

అరవిందుల ప్రముఖ రచనలన్నీ దాదాపుగా 'ఆర్య'లో ధారావాహినిగా వెలువడ్డాయి. వారి ముఖ్య గ్రంథము 'The Life Divine' 'ఆర్య' ద్వారానే ప్రపంచానికి అందజేయబడింది. అలాగే వారి బృహత్తర పద్యకావ్యము 'సావిత్రి' కూడా పాండిచేరిలోనే తుది మెరుగులు దిద్దుకుంది.

క్లుప్తంగా మనమిప్పుడు అరవిందుల దృక్పథాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిద్దాం. అది ఈ దేశంలోని ప్రాచీనసాహిత్యం, వేదాలు, ఉపనిషత్‌లు గీత ఆధారంగా నిర్మించబడ్డదే. ఆధార మవే అయినా నవ్యత ఉంది. ఆయన దృక్పథానికి మూడు ఆధారాలున్నాయి. మొదటిది: పరిణామక్రమం క్రిందనుంచి ఎలా పైకిపోతున్నదో, అలాగే పైనుంచి క్రిందికి దిగటంకూడా ఉంది. ఇవి రెండూ ప్రక్కప్రక్కనే జరుగుతూఉన్నాయి. రెండవది: ఈ ప్రయాణాల్లో ఏదశకాదశలో, ఒక ఐక్యత, ఒక పూర్ణత కనపడుతుంది. మూడవది: అతీతమనస్సు (Supermind) భావన. ఈ మూటి ఆధారంగానే దాదాపుగా వారి 'The Life Divine' రచన సాగింది.

వీటినింకా అర్థం చేసుకునేందుకు ప్రయత్నిద్దాం.

ఈనాడు మనమంతా పరిణామవాదాన్ని నమ్ముతూ, దానినిగురించి మాట్లాడుతున్నాము. ఈ మాటల్లో, పదార్థము (matter) లోనుంచి జీవం (life) ఎలా కనబడిందీ, అలాగే మనస్సు (mind) ఎలా పదార్థంనుంచి బయటపడిందీ చెప్పుకుంటున్నాం. అయితే 'పరిణామం' (Evolution) అనే మాట కేవలం ఒక ఫలితాన్ని సూచించేమాటగానే మిగిలిపోయింది. దాని అసలు అర్థాన్ని అది సూచించటం లేదు. నిజానికి పదార్థంలోనుంచి ప్రాణం, ప్రాణంలోనుంచి మనస్సు ఎందుకుపుట్టాలి? మన ప్రాచీన వేదాంతధోరణిని నమ్మకపోతే, దీనికి పరిష్కారం దొరకదు.

ఆ ధోరణి ఏమిటి? అసలు పదార్థమనేదే ఒక విధమైన ముసుగు కప్పుకున్న ప్రాణం. కాబట్టే పదార్థంలో ప్రాణం, ప్రాణంలో మనస్సు ఇదివరకే గర్భితమై వున్నవి. కాబట్టే మానవుని మనస్సు, భగవంతునివైపు, సచ్చిదానందంవైపు, అమృతత్వం వైపు వేసే గంతులన్నీ అర్థవంతాలే. ఎందువల్లంటే ప్రకృతి–పరిణామక్రమంలో మనస్సుని దాటి ముందుకు పోవాలనిచేసే ప్రయత్నాలే అవి. పదార్థాన్ని దాటి ప్రాణంవైపు, ప్రాణాన్నిదాటి మనస్సువైపు నడిస్తే మనకులేని అభ్యంతరం, మనస్సును అతిక్రమించ దలుచుకుంటే ఎందుకుండాలి?

ప్రకృతి, జంతువును ఒక ప్రయోగశాలగా వాడుకుని మానవుని తయారుచేసింది అని చెప్పబడుతూంది. అదే ప్రకృతి, ఈ మానవుని సహకారంతో,

అతనినే ప్రయోగశాలగామార్చి, ఒక అతీత మాన వుణ్ణి, భగవంతుణ్ణి తయారుచేయటానికి ఎందుకు వాడుకోగూడదు. అసలు పరిణామమంటే ఏమిటి ? ప్రకృతియొక్క క్రమానుగతవికాసమేకదా ! ఒకా నొక దశలో మనకు కొన్ని కొన్ని విశేషాలు తెలుస్తూ వచ్చాయి. కాని దానివల్ల మనకు తెలియనిదల్లా లేనిదికాదే ! సృష్ట్యాదినుంచీ ప్రకృతిలో విద్యుత్ శక్తి, పరమాణుశక్తులున్నాయి. కాని వాటిని మానవమాధ్యనే తెలుసుకోవటం జరిగింది. అందు వల్ల, అంతకుముందు ఇవి ప్రకృతిలో లేవనటం భావ్యం కాదుకదా. అలాగే పరిణామక్రమంలో, ఈ క్రమానుగత వికాసదశలో, ఒకదశలో, మానవుని దశలో — ఇక చాలు, ఈ పరిణామం ఇంతకుమించి పోగూడదు అని ప్రకృతిని శాసించటానికి మనకేం హక్కుంది ?

నిజంగా పదార్థంలో ప్రాణం వగైరాలు ఇమిడి ఉంటే, కనపడే ప్రకృతి కనపడని భగవంతుడేఅయితే, పరిణామక్రమంలో కేవలం ఒక దశఅయిన మాన వుడు—తనలోపలా బయటా కల భగవంతునిగురించి తెలుసుకోవటానికి చేసే ప్రయత్నమే మానవుని గొప్ప ఆదర్శమంటారు అరవిందులు. తమ 'The life Divine' గ్రంథ ప్రారంభప్రకరణంలో 'If it be true that spirit is involved in Matter and apparent nature is secret God, then the manifestation of the Divine in himself and the realisation of God within and without are the highest and most legitimate aim possible to man upon earth - (The Human aspiration-Chapter 1.) అని వ్రాశారు.

ఇప్పుడు మన పరిణామం సచ్చిదానందంనుంచి మొదలుపెట్టి—పదార్థము, ప్రాణము, మనస్సుదాకా వచ్చి ఆగింది. ఒక్క దూకుదూకి ఈ మనస్సు — అతీతమనస్సు (supermind) ను, అక్కడినుండి సచ్చిదానందమును అందుకుంటే పరిణామక్రమం పూర్తవుతుంది. అయితే ఇది కేవలం సాధకుడైన మానవుని ప్రయత్నంతోనే సాధ్యంకాదు. పైనుంచి ఆ సచ్చిదానందం క్రిందికి దిగుతూ రావాలికూడా: ఈ క్రిందినుంచి పైకి—పైనుంచి క్రిందికీ అనేవి నిజానికి ఒకేఒక చైతన్యముయొక్క రెండుకొనల క్రింద లెక్క: ఈ రెండుకొనల కలయికే పరిణామ చక్రముయొక్క సఫలత క్రిందలెక్క. దీనినే అర విందులు Ascent - Descent అనీ Evolution - Involution-అని వర్ణించారు. ఇది జరుగుతుందా—ఎప్పుడైనా సాధ్యమా — తప్పదంటారు అరవిందులు.

కొంచెం దీర్ఘమైనా, ఒకసారి అరవిందుని మాటలలోనే దీనిని తెలుసుకుందాం. 'The Divine descends from pure existance through the play of Consciousness—Force and Bliss and the creative medium of Supermind into Cosmic being; we ascend from Matter through a developing life, soul and mind and the illuminating medium of supermind towards the Devine being. The knot of the two, the higher and the lower hemisphere (పరార్థ మరియు అపరార్థ) is where mind and supermind meet with a veil between them. The rending of the veil is the condition of the divine life in humanity; for by that rending, by the illumining descent of the higher into the nature of the lower being and the foreceful ascent of the lower being into the nature of the higher, mind can recover its divine lighet in the all—compre hending—supermind, the soul realise its divine self in the all possessing all blissful Ananda, life repossess its divine power in the play of omnipotent conscious—Force and Matter open to its devine liberty as a form of the Divine Existance.' (The Life Divine—The sevenfold chord of Being—Chapter 27.)

ఈ విధంగా ascent—క్రమం ఇలా ఉంటుంది.

Matter
Life
Psyche
Mind
Supermind
Bliss
Conciousness—Force
Existance.

ఇదే తిరుగు విధంగా descent అవుతుంది.

ఇంకొక విషయాన్నికూడా మనం గమనించాలి. మనస్సు (mind) గెంతువేసే అతీత

మనస్సు (supermind) కు చేరేముందు 4 మజిలీలు చేయాలంటారు అరవిందులు. వాటినే ఆయన ఉన్నతతర మనస్సు (Higher mind), ప్రకాశాన్విత (Illumined Mind), స్వతఃస్ఫురణ మనస్సు (Intuitive Mind) మరియు ఉపరిమనస్సు (OverMind) అని వర్ణించారు.

పదార్థాన్నికూడా అరవిందులు నిరాకరించలేదు. తైత్తిరీయ ఉపనిషత్‌లో వర్ణించినట్లు పదార్థమూ బ్రహ్మమే అంటారు.

స్వర్గీయ గోపీచంద్ ప్రతిభావంతుడైన రచయిత. తాత్వికవిషయాలను సులభగ్రాహ్యంగా చెప్పటంలో ఆయన కాయనేసాటి. రచయితగా వికసించిన కొద్దీ, చిట్టచివరి రోజులలో భౌతికవాదం నుంచిఆధ్యాత్మికవాదంవైపు పయనించాడు. 1955లో 'పోస్టు చెయ్యని ఉత్తరాలు' (ఆధ్యాత్మికవాద— భౌతికవాద సమన్వయము) ప్రకటించాడు. దానిలో అరవిందుని విచారధారను తేటతెల్లంగా వివరించాడు. నాపై వివరణ సాంకేక ప్రాయమైంది స్మూత్రమే. గోపీచంద్ భాషలో అరవిందుని తెలుసుకొని, తత్వ వివరణ ఆపివేద్దాం.

'శ్రీ అరవిందుల సిద్ధాంతంలోముఖ్య సూత్రాలు రెండు. ఒకటి శ్రీ అరవిందుడు మానవుడు అభివృద్ధి చెందుతున్నాడనీ, ఈ అభివృద్ధి మానవుడు వ్యక్తిగతంగా, సాంఘికంగా పరిపూర్ణత పొందేవరకూ జరగాలనీ చెపుతారు. ఆయన పరిణామవాదాన్ని నమ్ముతారు. చలనంలేని పదార్థంనుంచి ప్రాణం వచ్చిందనీ, ప్రాణంనుంచి తన్నుతాను తెలుసుకునేజ్ఞానం వచ్చిందనీ, ఈ జ్ఞానం మానవునిలో పరిపూర్ణత పొందటానికి ప్రయత్నిస్తూ ఉందనీ చెపుతారు. పరిణామం ఇంతటితో ఆగదనీ పరిణామంలోకి ఇంకో దశ రాబోతుందనీ, అదే అతీత మానసిక శక్తిఅనీ చెపుతారు. ఏదీ శూన్యంనుంచిరాదు. కనక ఈ పరిణామంలో ఒక అంతస్తుకారణంగా, ఒక అంతస్తు వస్తూఉంది అంటారు. ఇంతకుముందు పరిణామం తెలియకుండా జరిగిందనీ, ఇక మానవునికి తన్నుతాను తెలుసుకునే జ్ఞానం ముందుకు చూడగలిగిన శక్తి వచ్చినదిగనుక, మనకు తెలిసిన పరిణామం పొందగలమనీ, ఇందువల్ల ఆనందం, కాలం కలిసిరావటం జరుగుతుందనీ చెప్తున్నారు. దీనికి ఒకమార్గం సూచించారు. ఇంతవరకూ పరిణామం యాదృచ్ఛికంగా జరిగింది. అందువల్ల ప్రకృతికి సహజమైన రీతిని నెమ్మదిగా కదిలింది. పశుదశలోనుంచి మానవుడు వచ్చాడు. పశువుకి ఈ సంగతి తెలియదు. ఇలా జరుగుతుందిఅని తెలియదు. యాదృచ్ఛికంగా జరిగింది. అదేవిధంగా పశువు తనకు తెలియకుండా మొక్కలనుంచీ, మొక్కలు చలనంలేని పదార్థంనుంచీ వచ్చాయి. మానవదశలో ఈ పరిస్థితి మారింది. మానవునికి తన్నుతాను తెలుసుకునేజ్ఞానం ఉండటంవల్ల స్వయంకృషివల్లే ఇకనుంచి అభివృద్ధి జరుగుతుంది. తన్నుతాను మార్చుకోవటంవల్ల జరుగుతుంది. దీనికొక పద్ధతి, ఒక టెక్నిక్, ఒక విధానం ఉంది' అన్నారు అరవిందుల శిష్యులైన నళినీకాంత గుప్త.

రెండు : ఇక శ్రీ అరవిందుల సిద్ధాంతంలోని రెండవ సూత్రాన్నిగురించి ఆలోచిద్దాం. ఈసూత్రం, పరిణామంలో నూతనదశ వచ్చినపుడల్లా దిగువ దశలను ఆ దశకు అనుకూలంగా మార్చుకోవాలని శ్రీ అరవిందులు చెపుతారు. నూతనంగా వచ్చినదశ, దిగువ దశలను తన నియమాలకు అనుగుణంగా మార్చుకుంటుంటుంది. ప్రాణం పదార్థంలోకి వచ్చిన తరువాత, ప్రాణంకలిగినపదార్థం, ప్రాణంలేని పదార్థానికి వలెకాక కొత్తరకంగా ప్రవర్తించటం మొదలుపెట్టింది. ప్రాణంఉన్న పదార్థం, ప్రాణంలేని పదార్థానికివలె మెకానికల్ సూత్రాలను తూచా తప్పకుండా అనుసరించలేదు. ఇదేవిధంగా మనస్సుతో కూడిన ప్రాణం, మనస్సులేని ప్రాణం మాదిరిగాకాక వేరుగా ప్రవర్తించటం మొదలుపెట్టింది. మానవుని తెలివితేటలు, హేతువాదశక్తి, శారీరక నియమాలను, రూపాలనూ, ప్రాణానికి సంబంధించిన ఇన్స్టిన్క్ట్సనీ, రియాక్షన్స్‌నీ మార్చింది. ఇప్పుడు ఈ అతీతమానసికశక్తివల్ల వచ్చిన దృక్పథంతో మనస్సునీ, ప్రాణాన్నీ, శరీరాన్నీ మార్చుకోవలసి ఉంటుంది. అప్పుడు మానవుడు విరుద్ధశక్తుల కలయికకాక ఒకేప్రవాహాన్ని ప్రతిబింబించే వాడుగా ఉంటాడు. అందువల్ల అతనే పరిణామం అవుతాడు.

ఈ స్థితిలో మానవుడు జ్ఞానాన్ని తాదాత్మ్యం వల్ల పొందుతాడు. జ్ఞానివేరు—జ్ఞానంవేరుకాదు. మనం ఏవిధంగా జ్ఞానాన్ని పొందుతున్నామో ఆలోచించి చూడు. మనం ఒక ఊహని ఊహిస్తాం. దాన్ని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నిస్తాం. ఆ స్థితికి వెళ్లటానికి ప్రయత్నిస్తాం. ఇవి ఎందుకు జరుగుతున్నాయి. ఆ ఊహను ప్రతిఘటించేదశలు మనలో ఉన్నాయిగనుక. అలాకాక అతీతమానసిక ప్రవృత్తిని పొంది దానికి అనుకూలంగా క్రిందిదశలను మలిపినప్పుడు, పరిణామానికి అనుకూలమైనదే ఊహించటం, ఊహించినంత మాత్రానే ఆ స్థితికి మనం వెళ్లటం జరుగుతుంది. అంటే ఊహకూ, ఉనికికి భేదంఉండదు. ఇప్పుడు మనం ఒకటికావాలని కోరుకుంటున్నాం. దానికోసం ప్రయత్నిస్తున్నాం. కష్టాలు పడుతున్నాం. చివరికి కృతకృత్యుల మవుతున్నాం; ఇందుకు కారణం మన కోర్కెలో తప్పు ఉండవచ్చు. అప్పుడు అలాఉండదు. కోరదగిందే కోరతాం. కోరినంతనే సాధిస్తాం. 'సంకల్ప మాత్రానే పనులౌతై' అంటారే మన పూర్వులు, అదీ ఆదశ. మనకుబాధలు ఎందుకు కలుగుతున్నాయి ? అజ్ఞానంవల్ల కలుగుతున్నాయి. పరిణామాన్ని తెలుసుకోక, దానికి భిన్నమైన ప్రవృత్తుల్ని వృద్ధిచేసుకోవటంవల్లా, మన ప్రవృత్తుల్ని పరిశుద్ధం చేసుకొని పరిణామానికి అనుకూలం చేసుకోలేకపోవటంవల్లా కలుగుతున్నాయి. అటువంటప్పుడు వీటిని సరిచేసుకున్న దశలో నిత్యానందం ఉంటుందని ఎవ్వరైనా చెపితే నేను ఆశ్చర్యపడను. ఇవీ అరవిందుల సిద్ధాంతంలోని మూల సూత్రాలు.'

పైకిపోవటం Ascent వ్యక్తిగతంగా ఎంతో మందికి సాధ్యమయింది. అరవిందులూ దానినెప్పుడో సాధించారు. కాని అతీతమనస్సును ఈ భూపదార్థం మీదికి తీసుకురావలె అనే కోరికతోనే వారు చివరి రోజులలో తమ తపస్సును తీవ్రతరం చేశారు. ఈ గంగావతరణమే వారి యోగసాధన లక్ష్యమయింది. 1926 నవంబరు 24 నాటి సిద్ధి అదేనని చెప్పవచ్చు.

ఈ విషయాన్ని అరవిందులే స్పష్టంగా చెప్పారు. అతీతమానసికావతరణము వ్యక్తిగత వాంఛా సిద్ధికోసంకాదనీ,కృష్ణపరమాత్మ సాధించని దానికోసం ఈ మూర్ఖుడు ప్రయత్నిస్తున్నాడని ఎవరైనా గేలి చేసినాసరే అది తన కనవసరమంటారు:

'It is not for personal greatness that I am seeking to bring down the Supermind. I care nothing for greatness or littleness in the human sense........I believe the descent of this Truth opening the way to a development of divine consciousness here to be the final sense of the earth evoulntion. If greater men than myself have not had this vision and this ideal before them, that is no reason why I should not follow my Truth-sense and Truth–vision. If human reason regards me as a fool for trying to do what Krishna did not try, I do not in the least care. There is no question of X or Y or anybody else in that. It is a question between the Divine and myself–whether it is the Divine will or not; whether I am sent to bring that down or open the way for its descent or at least make it possible or not....I have no intention of achieving the Supermind for myself only–I am not doing anything for myself, as I have no personal need of anything, neither of salvation (Moksha) nor supramentalisation......'

భగవాన్ కృష్ణుడు తలపెట్టని దానిని సాధించబూనుకున్నా ఫరవాలేదు అని చెప్పగల అరవిందుల ఆత్మస్థైర్యం ఎలాంటిదో ఊహించవచ్చు. కాబట్టే భారతీయ ఆధ్యాత్మికతలో అరవిందు లొకమైలు రాయి.

ఇక ఇంతటితో ఈ తత్వ వివరణ ప్రయత్నాన్ని ఆపి వేస్తున్నాను.

* * *

శ్రీమతి మృణాలినీదేవి

ఆ ఇల్లాలిగాథ మన దృష్టిలో అతికరుణ మయం. 14 సంవత్సరాల చిరుత ప్రాయంలో, అత్యున్నత అధికార దశలోఉన్న అరవిందుని వివాహమాడింది. ఆమె 19 వ ఏట భర్త సౌఖ్యమయమూ, అధికారయుతమూ, ఐశ్వర్య యుక్తమూ అని తలచబడే ఉద్యోగాన్ని జీవితాన్ని వదిలి కలకత్తా చేరాడు. నిత్యరాజకీయసమరయజ్ఞ కుండంలో సమిధగా తన్ను ఆయన అర్పించుకుంటే, ఈమె గృహిణిగా ఉంది. దానికికూడా ఆమెను నోచు కోనీయకుండా, ఆమె 23 వ ఏట—ఆమెను వదిలి చంద్రదనాగోర్ కు వెళ్ళిపోయాడు. ఆయన అను మతితో, ఆయన దర్శనార్థమై పాండిచేరి బయలు దేరిన మృణాలినీదేవి—1918 డిశంబరులో ఇన్‌ఫ్లు యంజా జ్వరంతో—తన 30 వ ఏట శాశ్వతంగా కన్ను మూసింది. చివరి ఏడెనిమిది సంవత్సరాలు ఆయన దర్శనభాగ్యానికే నోచుకోలేదు.

బహుశా ప్రపంచంలో ఒక్క భారత స్త్రీయే అలాంటి జీవితాన్ని భరించగలదేమో! ఆమెను స్మరింపని, ఆమెకు ప్రణామాంజలి సమర్పించని అరవిందుల జీవితచిత్రణ— ఎంత క్లుప్తమైనా సరే— నా దృష్టిలో అసంపూర్ణమే.

* * *

అరవిందులవారి జీవితము డిసెంబరు 5, 1950 తో ముగిసింది. ఈ సంవత్సరము వారి జన్మ దిన శతజయంతి సంవత్సరము. ఏం? ఎందుకు వారి శతజయంతి ?

నామట్టుకు నాకు ఆయన భారతదేశానికి తిరిగివచ్చిన నాటి పరిస్థితులకు, నేటి పరిస్థితులకు పెద్దగా తేడా కనపడటంలేదు. ఆ నాటిప్రశ్న—మనకు 'స్వ'రాజ్యం కావాలా, 'సు'రాజ్యం చాలా అన్నదే. దాని కానాటి నాయకులు 'స్వ'రాజ్యం కావాలి అని నిష్కర్షగా సమాధానం చెప్పటానికి తటపటాయించ సాగారు. కేవలం ఇరువురే ఇరువురు, లోకమాన్యతిలక్, అరవిందులు ఆ సమాధానా న్నీయగలిగారు.

ఆనాడే అరవిందుడు లేకపోతే మన స్వాతంత్ర్యో ద్యమం—కనీసం ఒక దశాబ్దం వెనుకబడి ఉండేదేమో ననిపిస్తుంది. ఆయనలేని బెంగాల్ విభజన- బెంగాల్‌ను దేశాన్ని ఎంతమాత్రం కదిలించి ఉండేదికాదు. కేవలం 4 సంవత్సరాల కాలంలో దేశాన్ని యావత్తూ ప్రభా వితం చేయగలిగిన దాయన బోధనా ప్రభావం.

ఆనాటినుండి ఆయన మరణానంతరం వరకు అరవిందుల కృషి, సాధన అంతా ఆ 'స్వ' ను కను గొనటంలో, వివరించటంలో, సాధించటంలోనే గడి చింది. అయితే అది సంకుచితమైనదికాదు. పాండిచేరి నాటి అరవిందులు—Lover of Humanity గా ఆవిర్భవించారు. సమస్యల ప్రతిపాదన, వివరణ అంతా ప్రపంచ దృష్టితో సాగించబడింది.

రాజకీయాలనుండి అరవిందుని నిష్క్రమణం అనేకమందిని నిర్ఘాంతపరిచింది. కాని ఒకటి తథ్యం. స్వాతంత్ర్యంరాకపూర్వం ఆయన ధోరణి మనకెలా అనిపించినా, స్వాతంత్ర్య సంపాదనానంతరం ఆయన రచనలు మనకు నూత్నమైన వెలుగును ప్రసా దిస్తున్నాయి.

ఈ దేశానికిగల గతం ఏమిటి? దాని చరిత్ర ఏమిటి? ప్రపంచ చరిత్రలో దానికిగల స్థానమేమిటి? ఈ దేశంలో సమాజం ఎలా పరిణామం చెందింది? దాని భవిష్యత్ చలనము ఎలా ఉండాలి? స్వతంత్రం ఎందుకు?

మీరు కేవలం రాజకీయవేత్తలమనుకుంటే, రాజకీయాలెలా ఉండాలి? రాజకీయాలకూ సమా జానికిగల సంబంధమేమిటి?

మీరు భగవద్భక్తులమూ, ఆధ్యాత్మికవేత్త లమే అంటారా—సమాజంనుంచి దూరంగా ఉండటం కాదు కావలసింది. వ్యక్తిగతసాఫల్యమే కాదు కోర వలసింది. సమాజాన్ని మొత్తం, మానవాళిని యావ త్తూనే దానికి ఉన్ముఖం చేయండి.

క్లుప్తంగా చెప్పాలంటే అరవిందుని పాండిచేరి జీవితం, రచనలు, 'ఆర్య' లేకుంటే 1947 తరు

వాత దాదాపుగా భారతదేశానికి మార్గదర్శకులు లేరు. గతించిన దానికంటె భవిష్యత్‌లో సాధించవలసింది చాలాఉంది అని నొక్కి చెప్పిన వాడాయనే.

అయితే అంధానుకరణ కాదుసుమా! కావలసింది. భారతదేశం సజీవంగా ఉండాలంటే కావలసింది, దాని యువతరం ఆలోచనాధీనులు కావటం. అన్నివిషయాల గురించి, కూలంకషంగా, స్వతంత్రంగా ఆలోచించ గల గటం. ఏవో కొన్ని దురభిప్రాయాలతో, పై పై మెరుగులతో మోసపోవటంకాదు. ఆయన మాటలనే యధాతధంగా ఉంచి ఈ చిత్రణను ముగిద్దాం: 'Our first necessity, of India is to survive and do her appointed work in the world, is that the youth of India should learn to think,-to think on all subjects, to think independently, fruitfully, going to the heart of things, not stopped by their surface, free of prejudgements, shearing sophism and prejudice asunder as with a sharp sword, smiting down obscurantism of all kinds as with the mace of Bhima. Let our brains no longer, like European infants, be swathed with swaddling clothes; let them recover the free and unbound motion of the Gods; let it have not only the minuteness but the wide mastery and sovereignity natural to the intellect of Bharat and easily recoverable by it if it once accustoms itself to feel its own power and be convinced of its own worth.'

క్లుప్తంలో అరవిందుల చిత్రణ ఇది.

ప్రాతఃస్మరణీయుడా యోగిపుంగవుడు.



మహిమభట్టారకుని సాహిత్య విమర్శలు

శ్రీ అవ్వారి వాసుదేవ శాస్త్రి

గీర్వాణ భాషలో అలంకారశాస్త్రములో రాజానక వంశము చాల ప్రసిద్ధమైనది. ఆ వంశములోఁ బుట్టినవారు చాలమంది అలంకార గ్రంథములు వ్రాసి ఆ వంశమునకు వన్నె తెచ్చిరి. ఇందులో రాజానక కుంతకుఁడు మొదటివాఁడు. అతఁడు వక్రోక్తి జీవిత మను పుస్తకము వ్రాసి 'వక్రోక్తియే కావ్యమునకు జీవిత'మని నిర్ణయించెను.

తరువాత రాజానకానందవర్ధనుఁడు బయలు దేరి 'ధ్వన్యాలోకము' వ్రాసి 'అదికాదు. ధ్వనియే కావ్యమునకు ఆత్మ'అని నిశ్చయించెను. తరువాత రాజానక మహిమభట్టుఁడు బయలుదేరి 'వ్యక్తి వివేకము' వ్రాసి ధ్వని అనునది అనుమానముచేత గతార్థము అగుననియు, అన్ని ధ్వనులును అనుమానములో అంతర్భావమును చెందుననియు తేల్చెను.

తరువాత రాజానక రుయ్యకుఁడు వ్యాఖ్యాతగా వెలసి వ్యక్తివివేకమునకు వ్యాఖ్యాన మనుచుఁ బ్రారంభించి వ్రాయుచు, దానిలో అనుమితివాదమును ఖండించి మఱల ధ్వనివాదమునే నిలువఁబెట్టెను.

ఈ వ్యక్తివివేకములో మహిమభట్టుఁడు ఆనందవర్ధనుని ధ్వనివాదమునేకాక రాజానక కుంతకుని కావ్యలక్షణోదాహరణములనుగూడ ఖండించెను. అదిగాక అనేక కావ్య నాటకాదులను క్రొత్త విమర్శనా సరణితో విమర్శించి, ఆ దోషములు లేకుండునట్లు తాను మఱల ఆ గద్య పద్యములను రచించి చూపెను. ఇంత నిష్పక్షపాతముగను లోతుగాను విమర్శించువారు చాల తక్కువ.

వీరందఱును ఒకే వంశములోని వారైన ఒకరిని ఒకరు సహింపలేకయో మఱియేమో యిట్లు గ్రంథములు వ్రాసికొన్నారు. శిష్యబుద్ధి విస్తృతికై వ్రాసిరన్నను దప్పుకాదు. ఇట్లు వ్రాసికొనుటకు ఈర్ష్యయే కారణమైనచో ఆ యీర్ష్యకు సారస్వత మూలముగా ప్రతిక్రియ చేసికొనుటవలన, ఇతరులకు నేవగింపు కలిగింపకుండ, పైగా సారస్వత పథికులకు చాల సంతోషమును ఉపకారమునుగూడ కలిగించిన వారైనారు.

ఇతఁడు (మహిమభట్టారకుఁడు) 9వ శతాబ్దములోనున్న ఆనందవర్ధనాచార్యుల మతమును, 10 వ శతాబ్ది పూర్వభాగములోనున్న అభినవగుప్త పాదాచార్యుల లోచనవ్యాఖ్యానమును ఖండించెను గనుకను, 12 వ శతాబ్దిలో రుయ్యకుఁడు ఈతని పుస్తకమునకు వ్యాఖ్యానము వ్రాసి, ఇతని మతమును కొంత ఖండించి యుండెను గనుకను, ఆ మధ్య కాలములో, అనగాఁ 10 వ శతాబ్ది ఉత్తర భాగములోనో, 11 వ శతాబ్ది (A. D.) లోనో ఉన్నాఁడని తోచుచున్నది.

ఈయన భీముఁడనువాని పౌత్రుఁడనియు, శ్రీధైర్యుఁడను వాని కుమారుఁడనియు, ఇతని గ్రంథాంత శ్లోకములవలననే తెలియుచున్నది.

'ఆధాతుం వ్యుత్పత్తిం
నప్తౄణాం క్షేమయోగభాజానాం।
సత్సుప్రథితనయానాం
భీమస్యాతిగుణస్య తనయానాం।
శ్రీధైర్యసాంగ భువా
మహాకవేశ్శ్యామలస్య శిష్యేణ।
వ్యక్తివివేకో విదధే
రాజానక మహిమకేనాయమ్॥

శ్యామల మహాకవి శిష్యుఁడనికూడ ఈ పద్యములవలననే తెలుచున్నది. ఇతని గ్రంథములోని యీ క్రిందిభాగము తెనుఁగులోని వ్యావహారికభాషావాదముతో

కొంత పోలునేమో సహృదయులు చూడఁగోరుచున్నాను. 10, 11 శతాబ్ది ప్రాంతములో గీర్వాణ వాఙ్మ్రపంచములోఁగూడ నిటువంటివాద మొకటి లేవఁ దీసిన వ్యక్తి యొకఁడున్నాఁడనియే దీనివలనఁ దేలు చున్నది.

ఇటువంటివే క్రొత్తక్రొత్త యభిప్రాయ ములు ఈ పుస్తకములో చాల ఉన్నవి. ఇతఁడు చాల చోట్ల ప్రాచీనులకంటె మిక్కిలి విలక్షణమైన క్రొత్తత్రోవలను ద్రొక్కెను. ఈతని పాండిత్యము చూతమా? సాధారణమైనదిగాదు. చాల ఉద్దండ మైన పాండిత్యము. తర్కశాస్త్రము సంపూర్ణముగా లోతుపాతులతో అభ్యసించినట్లు తోచుచున్నది. తక్కిన వ్యాకరణాదిశాస్త్రములుగూడ బాగుగఁ జదివి నట్లే యున్నది. ఇదిగాక భాషలో చాలగొప్ప, అపార మైనకృషి చేసెననికూడ తోచుచున్నది.

'సాధుశబ్ద'మని లోకమునఁ బ్రసిద్ధమైన శబ్దముండుగాక! అట్లయినను అసాధుశబ్దముకూడ సామగ్రీవశమునఁ బ్రయోగించినవాని కిష్టమగు నర్థ మును జెప్పుచునేయున్నదని యనుమాన ప్రమాణ ముచే నసాధుశబ్దమునకును వాచకత్వము నిశ్చయింపఁ బడినది. కావునఁ 'దగిన ప్రకరణాది సామగ్రియున్నచో శబ్దమర్థమును జెప్పఁజాలును. లేనిచోఁ జెప్పఁజాలదు' అని నిశ్చయింతము. అదియే పెద్దలచే

'అసాధు రనుమానేన
వాచక ః కైశ్చిదిష్యతే।
వాచకత్వా విశేషేఽపి
నియమ ః పుణ్యాపాపయోః॥'

(అసాధుశబ్దమైనను అర్థమును జెప్పునని కొంతమంది అనుమానప్రమాణముచే నొప్పికొనిరి. అర్థమును బోధించుటలో విశేషము లేకున్నను సాధ్వ సాధు శబ్దములకుఁ బుణ్యాపాపములఁ గలిగించుటలో విశేషము గలదు) అని చెప్పఁబడినది.

అంతమాత్రముతో, అనఁగాఁ బుణ్యాపాపముల నియమించుటలో విశేషమున్నంతమాత్రమున 'అసాధు' శబ్దమున కపశబ్దత్వము కల్పించుట యుక్తముగాదు. ఏలయన:

శబ్దమనఁగానేమి? 'శబ్ద్యతే (విమృశ్యతే= అభిధీయతే) అనేన అర్థః ఇతిశబ్దః' అనికదా దాని వ్యుత్పత్తి! ఈ వ్యుత్పత్తివలన నేమి తేలుచున్నది? అర్థము చెప్పుటలో నిది (శబ్దము) సాధనమనికదా! ఆ శబము సాధువని, అసాధువని, అపశబ్దమని మూఁడు తెఱఁగులు. ప్రకృతియనియు, ప్రత్యయ మనియు విభాగము కల్పించెడి వ్యాకరణాది లక్షణముచే ననుసరింపఁబడినది సాధువు. అట్టి లక్షణముచే ననుస రింపఁబడక 'డిత్థ' మున్నగు శబ్దములవలె వ్యుత్పత్తి యేమియులేనిది అసాధువు. అర్థము చెప్పుటనుండి తొలఁగినది అపశబ్దము. అనఁగా 'అర్థము చెప్పుటకు సరియైన సామగ్రిలేక అర్థమును జెప్పనిది' అని అర్థము.

ఇట్లు విచారింపఁగా సరియైన సామగ్రిలేక పోవుటచే నొకప్పుడర్థము చెప్పనిచో సాధుశబ్దము గూడ నపశబ్దము గావచ్చునని తేలినది. అందువలన అర్థము చెప్పుట, చెప్పకపోవుటలనుబట్టి శబ్ద మనియు నపశబ్దమనియు వ్యవహారము నేర్పఱ చుటవలన ఇతిహాసములు, పురాణములు మున్నగు వాని యందును, ఆగమశాస్త్రములోనగు వానియందును ఒకానొకచోట నసాధువులుగానున్న కొన్ని శబ్దము లను అపశబ్దములని తలఁచువారిని నిరసించినట్లయి నది. ఈ విషయమును సంగ్రహించి వ్రాసిన కారికలు:

'సామర్థ్యాదేవ శబ్దస్య విషయేఽవగతే సతి।
న ప్రయోగోఽన్యనహ్యేష స్వనిష్పత్త్యై ప్రవర్తతే।
అత ఏవ ప్రకృత్యర్థమాత్రం తత్ర ప్రయుంజతే.
సంఖ్యాసాధనకాలాదే రానుగుణ్యా నపేక్షిణః।
ఇయతా చాపశబ్దత్వం న తేషా ముపకల్పతే.
అర్థేషు శబ్దనాకర్మ కరణత్వా నపాయతః॥'

నా మతమున మాత్రము తగనిచోటఁ బ్రయో గింపఁబడిన శబ్దమే అపశబ్దము. ఎట్లన—

'మధుకరై రపవాద కరై రివ
స్మృతి భువ ః పథికా హరిణాః ప్రజాః।
కలతయా వచస ః పరివాదినీ
స్వరజితా రజితా వశ మాయయుః'

(లేళ్లకు నమ్మకము గలిగించుటకై ప్రయోగించు కిరాతుల వాద్యముచేత ఆ హరిణములు తమ్మెపట్టు

కొనుటకేర్పడిన గుంటలకు స్వాధీనమైనట్లు, భార్యావియోగముగల బాటసారులు వీణాగానమును గూడమించు తుమ్మెదల యవ్యక్త మధురగానము చేత నాకర్షింపఁబడి మన్మథునికి స్వాధీనమైరి.)

—మాఘుని శిశుపాలవధ మహాకావ్యమునుండి.

ఇచ్చట లేళ్లు ఉపమానముగుటవలన అప్రధానములు. 'ప్రధానాప్రధానయోః ప్రధానే కార్య సంప్రత్యయః' అని న్యాయమున్నదిగాన లేళ్లు ఇచ్చట ప్రధానమైననే 'రజితాః' అని ప్రయోగింపవలెను. ఏలయన—

'రంజే ర్ణౌ మృగ రమణే న లోపో వక్తవ్యః' అని కదా వార్తికము! ఈ వార్తికమేమి బోధించుచున్నది? 'లేళ్లను వేటాడుట' అను నర్థము వాక్యమువలనఁ దోఁచుచున్నప్పుడు 'రంజ్' అను ధాతువునకు 'ణిచ్' పరముగా నున్నప్పుడు న లోపము వచ్చును అనికదా! అట్లు న లోపము వచ్చినఁగదా 'రజితాః' అని రూపమగును. ఇచ్చట లేళ్లు ప్రధానముగాక బాటసారులు ప్రధానమైనందున 'రంజ్' ధాతువునకు న లోపము వచ్చుటకు వీలులేదు. కావున నిచట 'రంజితాః'అనియే ఉండవలయును. ఇచ్చట లేళ్లకున్న అప్రాధాన్యమును గణింపకయే మాఘుఁడు తగనిచోటఁ బ్రయోగించిన 'రజితాః' అనునది అపశబ్దము. ఏలయన—ఇచట పాంథులు ఉపమేయము (వర్ణింపఁబడువారు) గాన వారే ప్రధానులు. కావున నా ఉపమేయముయొక్క అర్థము ననుసరించియే శబ్దము ప్రయోగింపవలెను. కాన నిది అపశబ్దమే. ఈ మతమును సంగ్రహించి వ్రాసిన శ్లోకములు:—

'అసాధుశ్చాపశబ్దశ్చ ద్విధా శబ్దః ప్రకీర్తితః
తత్రా సాధుర్న సాధ్యోయః ప్రకృతి ప్రత్యయాదిభిః॥
శబ్దాదపేతోఽపశబ్దః శబ్దాకరణాత్మనః।
శబ్దానా హి పరామర్శో వాచ్యార్థ విషయోఽస్యయః॥
ఏవం చాసాధుశబ్దోఽపి నాపశబ్దత్వ మర్హతి।
నహ్యోఽపృథ్యేతి సాధుత్వం తయోర్విషయభేదతః॥

'అయ్యా! అట్లుపమేయములగు పాంథుల కనుకూలముగా న లోపము చేయక 'రంజితాః' అని ప్రయోగించినచో లేళ్లకు ఈ విశేషణ మన్వయించు టెట్లు? వాని కన్వయింపవలెనన్న రజితాః అని ప్రయోగింపవలెనుగదా!'అని ప్రశ్నింపవచ్చును. దానికి సమాధాన మేమన:—ప్రధానము ననుసరించి 'రంజితాః' అనియే ప్రయోగించి, అప్రధానమైన లేళ్ల కన్వయించునప్పుడు 'రజితాః'అని మార్చుకొని యర్థము చెప్పికొనునట్లు వ్యాఖ్యానించుకొనుట మంచిది. కాని అట్లు 'రజితాః'అని ప్రయోగించుట మంచిదిగాదు.

'స్మృతిభువో బతపాంథమృగవ్రజాః'—అనఁగా పాంథులే లేళు అని లక్షణతోఁ జెప్పికొన్నఁగాని, 'స్మృతిభువః పథికా హరిణవ్రజాః'—అనఁగా బాటసారులనెడి లేళ్లని వ్యస్తరూపకముగాఁ జెప్పికొన్న గాని యీ ప్రయోగము సరిపోవును. ఎందువలన నన:—అప్పుడు లేళ్లకుఁ బ్రాధాన్యము వచ్చును.

అట్లు ప్రయోగింపఁబడక, తగనిచోటఁ బ్రయోగింపఁబడినదిగావున అస్వ, గోణ్యాదిశబ్దముల వలె నిదియు నపశబ్దమే.

ఈ విషయమునకు సంగ్రహ శ్లోకములు:—

శబ్దప్రయోగః కర్తవ్యః ప్రధానార్థవ్యపేక్షయా।
తదన్యాపేక్షయా త్వర్థా దేనం విపరిణామయేత్॥
విపరీతమతోయత్స్యా దపశబ్దస్సమాంప్రతి'

అస్వః, గోణీ మున్నగు శబ్దములుగూడ నట్లే యని పెద్దలు నిశ్చయించినారు. చూడుడు:—

'అస్వ గోణ్యాదయ శ్శబ్దాః
సాధవో విషయాంతరే।
నిమిత్తభేదాత్ సర్వత్ర
సాధుత్వంచ వ్యవస్థితం॥'

అస్వః గోణీ మున్నగు శబ్దములు అసాధువులని లోకములో నొక ప్రథ గలదు. కాని ఆ శబ్దములు విషయాంతరమున సాధువులే యగును. ఎట్లనన:—

'అస్వః' అనునది 'గుర్రము' అను నర్థమున సాధువుగాదుగాని 'నస్వః అస్వః' అను విగ్రహముచే 'తాను కానివాఁడు'అను నర్థమునను, 'నాస్తిస్వం (ధనం) యస్యసః'అను విగ్రహముచే 'ధనము లేని వాఁడు'అని యర్థము చెప్పినప్పుడును అది సాధువే కదా! అట్లే 'గోణీ'అనుశబ్దము 'ఆవు'అను నర్థమున, సాధువుకాదుగాని 'అనేకవస్తువులను ధరించుపాత్ర'

అను నర్థమున నదియు సాధువేకదా! కావున నా శబ్దములకుఁగల యితరార్థములలో నవియు సాధువులే. కావున, నిట్లు అన్నిశబ్దములను అర్థభేదముచే సాధువులే యగునని యీ పెద్దలు వ్రాసిన శ్లోకమున కర్థము

కావున శబ్దము అసాధువైనంత మాత్రమున దాని నపశబ్ద మనుటకు వలనుపడదు. ఇఁక నేమన— తగనిచోటఁ బ్రయోగింపఁబడిన శబ్దమే, సాధువైనను అసాధువైనను అపశబ్దమని చెప్పఁదగును.

ఇట్లు శబ్దాపశబ్దవివరణ సందర్భమున వ్యక్తివివేకకర్తయగు మహిమభట్టారకుని క్రొంగ్రొత్త యభిప్రాయములను పరామర్శించితిమి గదా! ఇఁక అనుమితివాదియగు నీ మహిమభట్ట మహాశయుఁడును, ధ్వనిమార్గస్థాపకుఁడగు ఆనంద వర్ధనుఁడును విభిన్నమగు మార్గములలో నడపిన కొన్ని సాహిత్య విమర్శ వినోదములను ప్రస్తావించుకొందము.

ఈ క్రింది పద్యమును ధ్వన్యాలోకకర్త ధ్వన్యుదాహరణముగా నిరూపించెను. ఎట్లన:—

'వాణిజక! హస్తి దంతా స కుతోఽస్మాకం
వ్యాఘ్ర కృత్తయశ్చ।
యావల్లులితాలకముఖీ గృహే
పరిష్వక్కతే స్నుషా॥'

ధ్వన్యాలోకకారుఁడగు ఆనందవర్ధనాచార్యుఁడును తద్వ్యాఖ్యాతలును ఈ పద్యమునకు సందర్భము నిట్లు వివరించినారు.

ఏనుఁగు దంతములును పులి చర్మములును అమ్ముకొను నొక వర్తకుఁడు బోయగూడెములోనికిఁ బోయి యొక ముదుసలి బోయనిఁజూచి 'మీ యింటిలో ఏనుఁగు దంతములును బులిచర్మములును గలవా?' యని ప్రశ్నింపఁగా నా వ్యాధుఁ డిట్లను చున్నాఁడు.

'వర్తకుఁడా! నా కోడలు, కదలింపఁబడిన ముంగురులు కలదై యింటిలో తిరుగుచుండునంత వఱకును మా కేనుఁగుదంతములుగాని పులి చర్మములుగాని ఎక్కడివి నాయనా!'

ఈ పద్యమున లులితాలకముఖీ యను పదము అర్థశక్తివలన బోయవనితకు సురతక్రీడయందుగల ఆసక్తిని సూచించుచు, ఆవిడ భర్త యెల్లప్పుడు జిక్కియున్నాఁడని తెలియఁజేయుచున్నది.

ఇచ్చట వ్యాఖ్యాత యిట్లు వ్రాయుచున్నాఁడు.

'అలకాలంకృత ముఖత్వేన మనోహర తమాయాః స్నుషాయాః విభ్రమావేక్షణ సురత విలాసాక్షిప్తచేతాః సంతత తదుపభోగక్షామో మృగయార్థం మత్సుతః క్షణమపి బహిర్నాయాతీతి కుతో హస్తి దంతాదీనాం మద్గృహే సంభవః' ఇత్యయమర్థః స్వతస్సంభవినా తాదృశస్నుషా సత్త్వాది రూపార్థేన వ్యజ్యమానం లులితాలకముఖీత్యేతత్పదం ప్రకాశయతీతి ధ్వనే స పదప్రకాశతా.'

ముంగురులచే నలంకరింపఁబడిన మోముగల దగుటచే మిగుల మనోహారిణిగానున్న తన కోడలి విభ్రమములచేతను, రతివిలాసములచేతను నాకర్షింపఁ బడిన మనస్సుగలవాఁడైన తన కుమారుఁడు ఎల్లప్పుడు నామె నుపభోగించుటచేఁ జిక్కిపోయి, వేటకై క్షణకాలమైనను బయటికి వెళ్లుటలేదు. కాన తన యింటిలో ఏనుఁగు దంతములు మున్నగునవి యెట్లు దొరకును? అనునర్థము 'అట్టి కోడలుండుట' అను స్వతస్సంభవియగు నర్థముచే తోఁచఁజేయఁబడుచున్నదై 'లులితాలకముఖీ' అను పదముచే బయల్పడుచున్నది గాన నీ ధ్వని పదప్రకాశ్యమైనది. కావున నిది స్వతస్సంభవి రూపార్థ శక్తిమూలార్థ ధ్వని.

ఇఁక,వ్యక్తివివేకకారుఁడీ ధ్వన్యాలోకముఁను ఖండించిన వాఁడగుటచే 'ఇది ధ్వనికాదు. అనుమానముచే నిదియు గతార్థమగును. ఇచ్చట నిస్పహత్వము, వ్యాఘ్రాదుల జంపుపనియం దాసక్తి లేకుండుట అను రెండింటిచే మఱుఁగుపఱచఁబడి హస్తిదంతాద్యభావమను అనుమేయార్థజ్ఞానము గలుగుచున్నదనియు, ఇచ్చట వర్తకునకు హస్తిదంతాద్యభావమును దెల్పుటకొఱకై వృద్ధ వ్యాధుఁడు వ్యాపకవిరుద్ధకార్యోపలబ్ధి నుపయోగించెననియు, గాన నిదియు ననుమానమేగాని ధ్వనిగాదనియు జెప్పుచున్నాఁడు.

మఱియు నిది యిట్లుండఁగా నొక యౌచిత్య మిచట విచారింపఁబడుచున్నదని యీవిధమున వ్రాసి యున్నాఁడు.

ఈ పద్యమునఁ జెప్పఁబడినది యెవరిమాటయై యుండును? అత్తమామల మాటయై యుండునా? లేక ఏ సంబంధమునులేని యొకానొక తటస్థునిమాటయై యుండునా?

మామగారి మాటయని తలంచుదమా? యనిన ఆయన, తన కొమార్తె సౌందర్యమును వర్ణించుట యె ట్లనుచితముగాదో అట్లే కోడలిసౌందర్యమును వర్ణించుటయు తగినదిగాదు. కాన నిది మామగారి మాటగా, నిశ్చయింపఁదగదు.

పోనీ అత్తగా రిట్లనినదని తలఁచి దీని నత్తగారి మాటగా నిశ్చయింతమా? అనిన నదియు తగి యుండలేదు. పుత్రప్రేమ విహ్వలురాలైన ఆమె, తమ గృహమునకు ధనసమృద్ధినిగోరుచు నిట్లనిన దన్నను, లేక కోడలి సౌందర్యాతిశయముపై ఈర్ష్య వహించి యనినదన్నను 'ఇచ్చట అమ్మఁదగిన హస్తి దంతాదికము లేదు' అని యింతమాత్రమే చెప్పఁదగి యుండఁగా ఆ కోడలిని వర్ణించుట నిష్ప్రయోజనము అనుచితమును.

కాన వీరి కుటుంబముతో నెట్టి సంబంధమును లేని యెవరిమాటయో యిదియని చెప్పుట యుచితముగా నుండును. అట్లు ఉదాసీనునిమాటయైనప్పుడే కొద్దిగా రసాస్వాదముగూడ లభించును. అట్లు కానిచో విపరీత సురతసమయే అను పద్యమును గూడ మంచికావ్యమని ముఖ్యవృత్తితోఁ జెప్పవలసివచ్చును.

కావున నిది తటస్థవాక్యమనియెంచి 'అస్మాకం' అనుచోట ఏతేషాం అని పాఠము మార్చవలయును.

ఇచ్చట వ్యక్తివివేకకర్తయగు మహిమ భట్టారకుఁడు చేసిన చర్చానిర్ణయములు బాగుగనే యున్నవనవలెను. ఏలయన:— కోడలిని మామగారు కొమార్తెనువలె సద్భావముతోఁ జూడవలయును. ఇట్లు పుత్రికనువలెఁ జూచుకొనవలెనని మన ఆర్యసాహిత్య ములో నెచ్చటఁ జూచినను నగుపించును. ఇది ఆర్య సంప్రదాయము. పాశ్చాత్యులలోఁ గూడ నిట్టిభావమే యున్నట్లు కోడలికిఁ బర్యాయపదమైన Daughter-in-law అను పదము సూచించుచున్నది. మఱియు నామె మామగారిని తండ్రిగారివలె భక్తిభావముతో సేవింపవలయును. ఇది మనకు అనాదిగా వచ్చుచున్న ఆర్షసంస్కృతికి సంబంధించిన ధర్మము. అంతియేకాని అన్యకాముకునివలెఁ దాను కోడలి సౌందర్యమును వర్ణించుట తగియుండదు. కాన మామగారి వాక్య మనుట తగదు.

ఇఁక అత్తగారన్ననో అందమైనకోడలు తనకు లభింపవలయుననియే యెల్లప్పుడును తలంచుచుండును. అట్టికోడలు లభింపనప్పుడే 'కులమింటి కోఁతి' నెక్కడనో తెచ్చికట్టుకొనవలయునని చూచును. అందుచే నామె కోడలి సౌందర్యమునుగూర్చి యీసుచెంది యిట్లు పలికినదనుటకు వీలుగాదు. అదిగాక అత్తలు తమ యింటిలోని విషయము గుటుగానే యుండ వలయునని తలంచుచుందురు. కావుననే 'కాపురము గుట్టు, రోగమురట్టు'అను సామెత స్త్రీలలో నెక్కువగ వ్యాపించియున్నది. కనుక తన యింటిలోని యీ గుట్టును పరాయివాఁడై యేనుఁగుదంతములు కొన వచ్చిన వర్తకునితోఁ జెప్పుననుటయుఁ దగదుగదా!

కాకున్న నిఁక నొకటి యున్నది. కుటుంబ నిర్వహణము ధనైకసాధ్యముగాన కుమారుఁ డెప్పుడును నింటనుండి, అడవిలోని ఏనుఁగులను పులులను వేటాడుట మానినచో కాపురము జరుగుట కష్టమై యీమెకు బాధగలిగి తన యింటిలో పదార్థములు సమృద్ధిగా నుండుటకై కుమారునికి సంపాదనకై హెచ్చరిక చేయువలసిన యవసరము గలిగియుండ వచ్చును.

అట్లయినను ప్రత్యేకముగాఁ గుమారున కేదో విధమున సూచించి కార్యోన్ముఖుఁడగుటకు హెచ్చరిక చేయునుగాని యీ విధముగా పరాయిమగవానితోఁ దమ కాపురపుగుట్టును బయటవేసికొనుచుఁ గోడలి సౌంద ర్యమును వర్ణించుచు నెత్తిపాడుపుమాటలతో సంపాదనకై యెచ్చరించుననుట సమంజసముగాదు. కావున నత్తగారును నీవిధముగాఁ బలికియుండదు.

కనుక నెవఁడో తటస్థుఁ డీవిధముగాఁ బల్కినఁ బలికియుండవచ్చునని యూహించిన మహిమభట్టారకుని యీ యభిప్రాయములు మిక్కిలి బాగుగా నున్న వనవచ్చును.

ఇఁక నిది యుదాసీనుని మాట కాదన్నచో విప రీతసురతసమయే అను పద్యమునుగూడ మంచికావ్యమని చెప్పవలసివచ్చునంటిమి. దాని విషయ మేమననగా:—

'విపరీత సురతసమయే
బ్రహ్మాణం దృష్ట్వా నాభికమలే।
హరేః దక్షిణనయనం చుంబతి
హ్రియాఽఽకులా లక్ష్మీః॥'

(లక్ష్మీనారాయణులకు జరగిన విపరీతసురత సమయమున లక్ష్మీదేవి విష్ణుని నాభికమలమున నున్న బ్రహ్మను జూచి సిగ్గుపడినదై విష్ణుమూర్తి కుడికంటిని ముద్దుపెట్టుకొనెను.)

దీనిని ధ్వనికారాదులు ధ్వని కుదాహరణముగా నొసంగిరి. కాని యిది సరియైనకావ్యము (కవిత్వము) గాదనియు, ఏదో ప్రహేళికవంటిదనియు మహిమ భట్టారకుని యాశయము. ప్రహేళిక అనఁగా తాను సూచించు నభిప్రాయము లోనగూఢముగాఁ గలిగి యుండునది లేక తనలో గూఢముగ నిమిడియున్న యభిప్రాయమును సూచించునది అని యర్థము.

ఇది ప్రహేళికయగు టెట్లనఁగా:—
ఇచ్చట లక్ష్మీదేవి లజ్జానివృత్తి యనునది సాధింపఁదగిన యంశము. దానికి సూర్యస్వరూపమగు విష్ణుమూర్తి కుడికన్ను లక్ష్మీదేవి ముద్దిడుకొనుట హేతువు. 'అది కప్పిపుచ్చుట'యను అస్తమయమును ఊహింపఁజేయుచున్నది. ఆ యస్తమయము సాహచర్య మునుబట్టి నాభికమలముయొక్క సంకోచము నూహింపఁ జేయుచున్నది. ఆ నాభికమల సంకోచము బ్రహ్మ యొక్క చూపునకు వ్యవధానము నూహింపఁజేయు చున్నది. ఇచట బ్రహ్మయొక్క దర్శన వ్యవధాన మనెడి అనుమేయార్థప్రతీతి మూఁడింటితో మఱుఁగుపఱచఁబడియున్నది. కావున ఈ యర్థబోధ ఉపాయ పరంపర నారోహించుటకు బలములేనిదై రసాస్వాదము వఱకును బోవుటకు సమర్థముగాకున్నది. కాన నిది ప్రహేళికా సదృశమైన యొక కవిత్వమే కాని ప్రధానమైనకవిత్వముగా నెన్నఁదగియుండదు.

ఇఁక మఱియొకటి :—

యా నిశా సర్వభూతానాం
తస్యాం జాగర్తి సంయమీ।
యస్యాం జాగ్రతి భూతాని
సా నిశా పశ్యతో మునేః॥

భగవద్గీత 2 అ. 69 శ్లో.

(ఏది యన్నిభూతము (జీవు) లకును రాత్రి వంటిదై నిద్రాసమయ మగునో ఆ నిశయందు ముని మేల్కొనియుండును. ఏవేళయందు జీవులంద ఱును మేల్కొందురో అది మునికి రాత్రివంటిది.)

ఈ భగవద్గీతా శ్లోకమును ధ్వనికారులు తిర స్కృత వాచ్యధ్వని కుదాహరణముగా నిచ్చియుండిరి.

ఇచ్చట యథాతథముగా పై యర్థమును జెప్పినచో విశేష మేమియును లేకపోఁగా రచయిత యొక్క అభిప్రాయమునకే భంగము వాటిల్లుచున్నది. ఎట్లన—

అందఱును నిద్రించునప్పుడు యోగి మేల్కొ న్నచోఁగాని, అందఱును మేల్కొన్నప్పుడు యోగి నిద్రించినఁగాని ప్రయోజనమేమి ? కావున నిచట కవికిఁగల తాత్పర్య మేమియని యాలోచింప వలెను.

మహిమ భట్టారకుఁ డిది ధ్వనిగాదు. ఉప చారమువలన అర్థమును బ్రకటించు టిదియని వివ రించు చున్నాఁడు.

ఎట్లన :—

ఇచ్చట నిశ యను పదమునకు రాత్రియని యర్థమును గాదు. జాగరణ మనుదానికి మేల్కొ నుటయని యర్థమునుగాదు. ఇఁక నేమన—సామాన్య జీవు లందఱును ఏ తత్త్వజ్ఞానమునందు శ్రద్ధలేక యున్నారో ఆ తత్త్వజ్ఞానమునందు యోగి అవధా నము గలిగియుండుననియు, జీవులు అతిముఖ్యముగా నెంచు అసత్య పదార్థమగు ప్రపంచమునందు యోగి పరాఙ్ముఖుఁడై యుండుననియు దీని తాత్పర్యము. ఇచ్చట వాక్యము ఉపచారముతో మఱియొక యర్థ మును బ్రకటించు చున్నది.

'వాక్యస్యచ ఉపచారతోఽర్థాంతర ప్రకాశనం యథా:—యా నిశా.. పశ్యతో మునేః, ఇతి అనేన హి వాక్యేన న నిశార్థో నాపిజాగరణార్థః కశ్చి ద్వివక్షితః. కిం తర్హి ? తత్త్వజ్ఞానావహితత్వం అతత్త్వ పరా

మ్మకత్వంచ మునేః ప్రతిపాద్యత ఇతి తిరస్కృత వాచ్య స్యాస్య గమకత్వం.'

మఱియొకటి :—

'విషమయ ఇవ కేషామపి
కేషామపి ప్రయాత్యమృతమయః।
కేషామపి విషామృతమయః
కేషామప్యవిషామృతః కాలః॥'

(కొందఱికి కాలము విషమయముగా గడచును. కొందఱికి అమృతమయముగా గడచును. కొందఱికి విషామృతమయముగా గడచును. కొందఱి కవిషామృత మయముగా గడచును.)

ఇచట సామాన్యముగా విషమయముగాను అమృతమయముగాను విషామృతమయముగాను అవిషామృత మయముగాను గడచునని యర్థము చెప్పకొన్న నేమియు విషయము తెలియుట లేదుగదా!

ఇచ్చట అర్థాంతర సంక్రమితమైన వాచ్యము ప్రకరణాది వశమున గమకమై యర్థవిశేషమును దెలుపునని మహిమభట్టుని యభిప్రాయము.

'తస్యైవ (వాక్యస్యైవ) ప్రకరణాదితః (ప్రకరణ సామగ్రీ వశతః) అర్థాంతర ప్రకాశనం యథా :—

విషమయ ఇవ......అవిషామృతః కాలః॥

ఇత్యత్ర వాక్యే ప్రకరణాది వశా ద్విషామృత శబ్దాభ్యాం సుఖదుఃఖ స్వరూప సంక్రమితవాచ్యాభ్యాం వ్యవహారఇతి అర్థాంతర సంక్రమిత వాచ్యస్యాస్య గమకత్వమ్.'

ఇచ్చటఁ గల విషము, అమృతము అను శబ్దములు దుఃఖము సుఖము అను ఇతరార్థముల యందు సంక్రమించిన వాచ్యార్థముగలవై యీ క్రింది విషయమును బోధించుచున్నవి.

కొందఱికి అనఁగా అవివేకులకు కాలము దుఃఖమయముగా గడచును. కొందఱికి అనఁగా వివేకవంతులకు కాలము సుఖమయముగా గడచును. కొందఱికి అనఁగా వివేకమును అవివేకమును గలవారలకు కాలము సుఖదుఃఖ మయముగా గడచును. కొందఱికి అనఁగా మూఢప్రాయులైన వారలకు కాలము సుఖమయమును దుఃఖమయమునుగాక గడచును.

ఇట్లర్థ ప్రతీతి గలుగుటకు ధ్వనితో నిమిత్తములేదని యీయన ఆశయము.

అందుచేత అనేకార్థక శబ్ద ప్రయోగముచే మోసగింపఁబడిన వ్యాఖ్యాతలు, గతానుగతికముగ నంధపరంపరగా ప్రవర్తింపఁజేసిన శబ్దమూలక—అనురణనరూపమగు అర్థాంతరప్రతీతి ఉన్నదను వాదములో నుపపత్తి యేమియును లేదు.

సాధారణముగ వ్యాఖ్యాతలుగూడ నిజముగ పండితులమన్న తలంచుచు తప్పు వ్యాఖ్యానములతో తమ్ముమాత్రమే కాక పూజ్యులగు మహాకవులనుగూడ సిగ్గులఁ జేయుచున్నవారు కొందఱు కన్పించుచున్నారు.

అట్లు వ్యాఖ్యాతలు వ్యాఖ్యానములలో పొరపడినారని వ్యక్తివివేకకర్త తెలిపిన యొకటి రెండు ఘట్టములను వివరించి యీ వ్యాసమును ముగించెదను.

ప్రాచీనాలంకారికుఁడైన ఉద్భటుఁడు తన కావ్యాలంకారసంగ్రహములో ఉపమాలంకారమునకు

'యచ్చేతోహారి సాదృశ్య
ముపమానోపమేయయోః।
మిథో విభిన్న కాలాది
శబ్దయో రుపమాతు తత్' ॥

అని లక్షణము చెప్పి

'యథేవ శబ్దయోగేన సా శ్రుత్యాఽన్వయ మర్హతి' అని విభాగమొనర్చెను.

ఈ విభాగ వాక్యమును వివరించుచు ప్రతీహారేందురాజు 'యథేవశబ్దా చాత్ర ఉపలక్షణం. అన్యయాంతరాదపి వాశబ్దాదేః తేన రూపేణ ఉపమానోపమేయ భావస్యావగతేః. యథా—

తాం జానీయాః పరిమితకథాం
జీవితం మే ద్వితీయం
దూరీభూతే మయి సహచరే
చక్రవాకీ మివైకాం।

గాఢోత్కంఠాం గురుషు
దివసే ష్వేషు గచ్ఛత్సు బాలాం
జాతాం మన్యే శిశిరమథితాం
పద్మినీం వాఽన్యరూపాం॥'

అని మేఘసందేశ పద్యము నుదాహరించెను. అనఁగా ఇచట 'పద్మినీంవా=పద్మినీమివ, అన్యరూపాం; జాతాం, మన్యే' అని సమన్వయము. గనుక ఇవార్థమునందు 'వా' శబ్ద ముపయోగింపఁబడినది. కాన నిదియు శ్రౌతోపమాలంకారమున కుదాహరణమే యగునని తన యభిప్రాయమును తెల్పెను.

ఇఁక మేఘసందేశమునకు వ్యాఖ్యాతయగు మల్లినాథసూరి తన వ్యాఖ్యానములో ఇందలి చివఱిపాదము నిట్లు వివరించెను.

'శిశిరేణ = శిశిరకాలేన మథితాం, పద్మినీంవా = పద్మినీమివ, 'ఇవవ ద్వాయథాశబ్దా' ఇతిదండీ. అన్యరూపాం=పూర్వవిపరీతాకారాం జాతాం మన్యే' అని.

మొత్తముమీఁద నీ వ్యాఖ్యాత లిద్దఱును 'జాతాంమన్యే శిశిరమథితాం పద్మినీం వాన్యరూపాం' అని అనుస్వారఘటిత పాఠమునే యాదరించి ఇవార్థమునందు వా శబ్ద ముపయోగపడినట్లు వివరించిరని స్పష్టముగానే తెలుచున్నదిగదా! ఇది యిట్లుంచుదము.

ఇఁక వ్యక్తివివేకకారుఁ డిచట [illegible] ననునది యేమనగా:—ఈ పైఁజెప్పిన పద్యములో

'గాఢోత్కంఠా గురుషు
దివసేష్వేషు గచ్ఛత్సు బాలా
జాతామన్యే శిశిరమథితా
పద్మినీ వాఽన్యరూపా'

అను నీ పాఠము నెఱుఁగకయే వ్యాఖ్యాతలు తమ కవిత్వాటోపమును గూడఁ గొంత నచ్చటఁ జూపుచు, అచ్చట ఈ పాఠమువలనవచ్చు సౌందర్యాతిశయము నెఱుఁగక,

'అవైమి తదవజ్ఞానాద్యత్నాపేక్షో మనోరథః'

ఇత్యాదులయందు సామాన్యముగ వాక్యార్థమును కర్మగాఁ జేయుట చూచుచుండియు, ఇక్కడ 'మన' ధాతువునకున్న వాక్యార్థకర్మత్వమును గమనింపకయే, 'మన' ధాతువునకు 'బాల'అను పదమును కర్మగా తలఁచుచున్నారు.

'పద్మినీ + ఇవ' అనుచోట సవర్ణదీర్ఘసంధిచే వికారమునుపొందిన 'ఇవ'శబ్దమును భ్రమచేత 'వా'శబ్దమునుగాఁ గల్పించి అపవ్యాఖ్యానముల నారంభించుచున్నారు. కాని యిచట

'గాఢోత్కంఠా గురుషు ఏషుదివసేషు గచ్ఛత్సు సత్సు బాలా శిశిరమథితా పద్మినీవ అన్యరూపా జాతా మన్యే'

అనియే అన్వయము.

ఇట్లుగాక వెనుకఁజెప్పిన (బాలాం అను అనుస్వారఘటిత పాఠముతోడ) అన్వయము చెప్పినచో అర్థమునకు వైచిత్రి యేమియు కన్పడుటలేదు. పైగా కాళిదాసువంటి మహాకవి, రసనిధానమైన కావ్యములో వ్యాధినివలె ఇవార్థమునందు 'వా' శబ్దము నుపయోగించునా ?

ఏమీ కాళిదాసుని కవిత్వములో స్ఖాలిత్యములే లేవా? అయినచో 'చంద్రం ప్రవృద్ధోర్మిరివోర్మిమాలీ'అని యాయనయే రఘువంశములో నెట్లు ప్రయోగించెను? అచట రెండుచోట్ల ఊర్మి శబ్దమును ప్రయోగించుటవలన కవికి నిర్మాణ విధానములో 'స్ఖలన' ము గుపించుటలేదా? యని ప్రశ్నింపవచ్చును. కాని 'ప్రవృద్ధోర్మిరివోర్మి' అనునప్పుడు 'ఓర్మి'అను రెండక్షరములకు మైత్రి యున్నది. అందువలన ఆ రెండింటిని ఉచ్చరించినందువలన శ్లేషసుఖ మనుభవించుచు అర్థభేదము నెఱుఁగని యెవరో కల్పించిన పాఠమేగాని యిది అసలు పాఠము కానేరదు. అసలు అచట పాఠము 'చంద్రం ప్రవృద్ధో జలధిర్నిశీవ'అనియే అని యెఱుంగవలయును.

అదిగాక కాళిదాస మహాకవి యన్వయగతి యెచటను నిట్లు గాన్పింపదు.

కనుక 'గాఢోత్కంఠా గురుషు' అనునదియే కాళిదాస రచితపాఠము. మఱియొక పాఠము వ్యాఖ్యాతలు భ్రాంతిచేఁ గల్పించినది'అని. ఇట్టిదే మఱియొక ఘట్టము:—

గ్రామేఽస్మిన్ పథికాయనైవ వసతిః
పాంథాధునా దీయతే
రాత్రావత్ర విహారమండపతలే
పాంథః ప్రసుప్తో యువా
తేనోత్థాయ ఖలేన గర్జతి ఘనే
స్మృత్వాప్రియాం తత్కృతం
యేనాద్యాపి కరంకదండ పతనాశంకీ
జనస్తిష్ఠతి॥'

ఇచ్చట తన యింటికివచ్చి రాత్రిపూట పరుండ వసతి నిమ్మని కోరుచున్న యొక బాటసారి యువకునిఁ జూచి యొక కామిని మన్మథావేశము గలిగినదై ఆతఁడింకొక స్త్రీయందనురాగము గలిగియున్నాఁడేమో అని శంకించి, అన్యాసక్తజనునియందనురాగ మించుట, దారుణతరముగా పరిణమించునని తలఁచి యిట్లు చెప్పుచున్నది.

'ఓ తెరువరీ! ఈ గ్రామములో నిప్పుడు బాటసారులకు పండుకొనుటకు వసతి నిచ్చుటలేదు. ఏలయన నొకరాత్రి యిచట విహారమండపమున నొక బాటసారి పండుకొని యొక రాత్రివేళ మేఘము గర్జింపఁగా తన ప్రియురాలిని స్మరించుకొని యా దుర్మార్గుఁ డొకపని చేసెను. ఆ పని చేయుటచే ఆ యింటివారు 'ఇంటిలో శవమున్నందున విధించు శిక్షపడునేమోయని యిప్పటికిని భయపడుచున్నారు.'

ఇది కావ్యాలంకారసూత్రవృత్తిలో నుదాహరింపఁబడినది. అచ్చటి వ్యాఖ్యాతలు దీని నిట్లు వివరించిరి.

'ఇదివఱలో రాత్రి పూటఁ బండుకొనవచ్చిన యొక బాటసారి ఆ రాత్రి మేఘగర్జనమును విని, ఎక్కడనోయున్న తన ప్రియురాలిని తలంచుకొని తాను మరణించెననియు, ఇంటిలో శవమున్నదని బలవన్మారణప్రయుక్తమగు దండనమును రాజు విధించెననియు, అట్టి దండుగ తమకు పడునేమోయని యిప్పటికిని అచ్చటివారు భయపడుచున్నారనియు, కావున నీకు వసతి నీయఁజాలమనియు నొక వనిత, పండుకొనవచ్చిన బాటసారితోఁ జెప్పుచున్నది.'

అనఁగా నిచట, వెనుక నెప్పుడోవచ్చి పండుకొనిన బాటసారియే మరణించెనని యీ వ్యాఖ్యాతల యభిప్రాయము.

కాని వ్యక్తివివేకకారుఁడగు మహిమభట్టారకుఁడు దీని నంగీకరింపక యిట్లనుచున్నాడు.

ఇచట నొక కామిని, పండుకొన వసతిఁ గోరుచున్న యువకుఁడైన బాటసారినిఁ జూచి మన్మథబాధావేశముగలదై అతఁడింకొక స్త్రీయందనురాగము గలిగియున్నాఁడేమో! యని శంకించుచున్నదై, 'అన్యాసక్తజనునియందనురాగము పెట్టుకొనుట భయంకర పరిణామమునకు దారితీయునని, నీవింకొక స్త్రీయందను రక్తుఁడవు గానిచో ఈ యిల్లంతయునేకాక నేను నీ కధీనురాలనే. అట్లుగాక అన్యాసక్తుఁడవైయున్నచో ప్రయోజనములేదు వెళ్లుము.'అని తన యభిప్రాయము నాతనికి దెలియఁజేయఁదలఁచినదై, వెనుక నొకరికిట్లే వసతి నిచ్చుటచేఁ గలిగిన కామినీమరణమను ఫలితమును దెలుపు వృత్తాంతమును వక్కాణించుట కారంభించినది.

కాని యీ యభిప్రాయమును దెలిసికొనఁజాలనివారై 'ఆమె ఆ బాటసారియే మరణించి' నట్లు తెలుపుచున్నదని కొంద ఱపవ్యాఖ్యానములు చేయుచున్నారు. అట్లు వ్యాఖ్యానించుట పూర్తిగ అయుక్తము. అట్లు వ్యాఖ్యానించిన రసభంగము గలుగును. ఇద్దఱికిని అధికానురాగమున్నను పురుష మరణమును వర్ణించుట మిక్కిలి అనుచితము. ఖలుఁ (దుర్మార్గుఁ) డని ప్రయోగించుటయు, కృతం (చేసెను) అని ప్రయోగించుటయు కుదురదు గూడ.

ఎవఁడు తన యధీనతలేకయే అవశుడై మరణించునో వాని మరణ మొకరి కుపకరింపవచ్చును. లేదా అపకారముగాఁ బరిణమింపవచ్చును. అంత మాత్రముతో వాఁడు సుజనుఁడనికాని దుర్జనుఁడని కాని చెప్పుటకుఁగాని, సుజనత్వ దుర్జనత్వములు నిశ్చయించుటకుఁగాని వీలగునా? 'నేను నీ కుపకరించుటకు మరణించుచున్నాను. నీ కపకారము జరుగవలెనని మరణించుచున్నాను' అని చెప్పి మరణించినచో వాని సుజనత్వమునో దుర్జనత్వమునో పేర్కొనుటకు వీలగును.

అట్లు గాకున్నచో నది అతిప్రసంగ మగును గాన పురుష మరణపక్షము ననుసరించువారును ఆ వ్యాఖ్యాతలును అంధపరంపరగా నిప్పటికిని, యుక్తిశూన్యమైన మార్గముననే సంచరించు చున్నారు.

ఇది వ్యక్తివివేకకారుని వాదము.

ఇచ్చటఁ గొంచెము మనము పరిశీలింతము:—

మన్మథావస్థలలోఁ జివరిదైన మరణావస్థను వర్ణించుటలో సాధారణముగ మరణప్రయత్నమునే వర్ణించెదరు. మరణమును వర్ణింపరు. ఒకవేళ కొందఱు కవులు మరణమును వర్ణించినను స్త్రీ మరణమును వర్ణింతురు. కాన నిట్లు పురుషవధను వర్ణించుట యుచితముగఁ గాన్పింపదు. కాని ఇచ్చట స్త్రీ మరణించినట్లు వర్ణించుట యుచితముగా నుండును.

పురుషుఁడు మరణించినట్లే పద్యమును వ్యాఖ్యానించుట అంత యుచితముగాలేదు.

కనుక నిచ్చట మహిమ భట్టారకుని విమర్శయు నిర్ణయమును సముచితమైనవిగానే కన్పించుచున్నవి.

వెనుకఁ జూపిన

'విషమయ ఇవ కేషామపి
కేషామపి ప్రయాత్యమృతమయః।
కేషామపి విషామృతమయః
కేషామప్యవిషామృత న కాలః.'

అను పద్యములోఁ జెప్పినట్లు కావ్యరసాస్వాదము చేయువారి కాలమమృతమయముగ గడచిపోవును గాన రచయితల యొక్కయు, వ్యాఖ్యాతల యొక్కయు రచనలలోని వ్యాఖ్యానములలోని యౌచిత్యానౌచిత్యములు బరిశీలించుచు కవి తాత్పర్యమును గ్రహించుచు కావ్యరసాస్వాదముఁజేయుచు కాలమును అమృతమయముగాఁ గడపవలెను. అట్టివారే సహృదయులని తెలుపుకొనుచు నిప్పటికి విరమించు చున్నాను.

తెనుఁగులెంక

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

మంజరి


శతకముల్ హరికథల్ జంగమకథలు
నాటకాదులు వ్రాయు నవయౌవనమునఁ
గన్నాఁడ నే 'బాలకవి' యన్నబిరుదు,
నవధానము లొనర్చునపు 'డవధాన,
పండిత' ఖ్యాతిని బడసితి, 'సరస
కవిశేఖర' ప్రథ గంటిఁ, జేకొంటిఁ
బొన్నూరి భావన్న పొలమేర యందు
గంట కిన్నూరు చక్కని పద్యములను
సకల లక్షణవిధా సంపన్నములను
బల్కి 'యాశుకవీంద్ర' పట్ట, ముదాత్త
సభను 'విద్వత్కవిసమ్రా' ట్టనైతి
వెనుక 'జాతీయ కవిబ్రహ్మ' నైతి
నవల 'రాష్ట్రీయ కవ్యగ్రణి' నైతిఁ
బిదప జయాంకముల్ పెక్కు లందితిని
గాని యస్మద్గాంధికథ సుబ్బినపుడు
విశ్వ విద్వల్లోక వినుతి పాత్రుండు
రామలింగారెడ్డి రమణీయముద్రి
నందిన బిరుదున 'కభినవతిక్క'
నాఖ్యమ్మునకు నాత్మ నలరితి నేను;
అలరుట నిందనీయము కాదు గాని
కవితన్ మదీయను గ్రంథరూపమునఁ
బ్రకటించుతటి నట్టపై దీని నిల్పి
పెద్దనేరమిని గావించితి నకట!

కొన్నేండ్ల కీతప్పుగుట్టు గుర్తించి
నాచందమున కెంత నవ్వెనో జగము
నా యహంతకు నెంత నవ్విరో ప్రజలు
బిరుదము ల్గలకవుల్ పెక్కు రీతెల్గు
నాట లేరా నేడు ? నా తప్పువంటి
తప్పు గావింపనిధన్యు లుదాత్త
లీ కవిశ్రేణిలో నెందఱు లేరు ?
వారిపోకడ నేల పాటింపనైతి
వారినిబ్బర మేల వాంఛింపనైతి
నే నేర్పరించిన కృతిని దిక్కన్న
పలుకుసౌ రున్నచోఁ బలిత లెటింగి
నను మెచ్చురా? సూరనను బ్రశంసింప
కుండిరా సాహితీయోగ్యతా నిధులు
చెల్లఁబో ! మతిమాలి చెడ్డ చేసితిని
దోస మియ్యది యెట్లు తొలఁగునం చేను
వగచుచుండ వయస్యవర్గమ్ము నరసి
రావుపేఁటం బ్రజారంజకమ్మైన
సభగూర్చి కాటూరి సత్కులోదితుని
వేంకటేశ్వరుని గవిప్రపంచార్కు
నధ్యక్షుఁ గావించి యస్మదీయమ్ము
పుట్టుపండు వొనర్చి భూరిసత్కృతుల (25–12–1960)
ననుఁ దన్పి; రపు డభినవ తిక్కనాఖ్య
కర్హుఁ డీకైసరుఁ డని సభాసదులు
తత వాగ్విభూతిమైఁ డన్నుఁ గొండాడ
నే నేడఁ దిక్కన్న యేడఁ దెనుంగు
బాసకు నునుతైన పరమర్షి యతఁడు
ప్రజలార ! కవులార ! పండితులార !
'యభినవ తిక్కన్న' యనుపట్టమునకుఁ
జాల నే, నిది నాకు సైరింపరాని

వ్రేఁ గాయె మీముందు విడిచెదన్ దీని
నిఁక నన్నుఁ బిలువకుఁ డీ పవాడమున
మన్నింపుఁడీ నాదుమనవి నం చనితిఁ
దెలవాఱుసరికి నా తెల్పినపల్కు
లివి పత్రికల కెక్కి యిల్లిల్లు తట్టె
బాపురే! కడుమంచిపని చేసి తనుచు
నయ్యరే! నీచంద మభినంద్య మనుచు
గఱువలు వ్రాసినకమ్మలు వేన
వేలుగా వచ్చి రావించె నా కెలమి
సత్యంబు నీకొన్నజనుఁ డింతశాంతి
కుడుచునే! యని మేలుకొంటి నానాఁడు
పదపడి నాయాము పరువులుదీయఁ
దెనుఁగులెంకగ మాఱితిని గ్రన్న నేను
బిరుదమ్ము గా దిది ప్రేమించుసేవ
తెఱుఁగు దెల్పు నహంకృతి విదూరచిహ్న;
మీ కథ నొక్కనాఁ డే నొక యొజ్జ
కడఁ జెప్ప నతఁడు 'లంకా'శబ్దమునకు
వికృతి కాదా లెంక, ద్వీపార్థ మిచ్చు
పదము కాదా లెంక? బళిరా! తెనుంగు
దీవి యన్నర్థంబు తెనుఁగు భారతికిఁ
బీఠ మన్నర్థంబు వినుచు నీ తెనుఁగు
లెంక యన్నుడి వెడలింపదా భవద
హంకృతి నిపుడేని యని నన్ను నెదిరె;
నపు డేను వికృతి కా దయ్యా! యీలెంక
సేవకార్థంబు నిచ్చెడి దేశ్యపదము
కను నందిమల్లయ్యగారి పద్యమ్ము
చను చేమకూర భాషాపేటి కడకు;
నాగేశ్వరుని కాశినాథుని యల్లు
శంభుప్రసాదు సజ్జను నీ వెఱుంగు

దమ్మేటి శివలెంక యను నింటిపేర
నొప్పుటయు నెఱుంగు దుద్దండుఁ డైన
శివకవి శివుఁగొంక శివలెంకఁ జేసె
నతఁడు వెర్రి పదమ్ము నంగీకరించె

నిక్క మారయు మన్న నెయ్యుఁ డయ్యోజ
వెల్వెల్లఁబాఱి నీ వివరింపు నాడు
కను విచ్చినది; తెన్గుఁగడలి నెవ్వాఁడు
త్రిచ్చె నీచందాన రారాపు లొర్చి
యిచ్చె నెవ్వఁడు బాస కెనలేనిబల్మి;
ననుడు నన్ బెద్దసేయకు మనా! యంటిఁ
దెనుఁగులెంకగ నన్ను దిద్దుకొంచుంటి
నుడివోని దగుఁగాక యోగమ్ము నాది
చరితార్థ మగుఁగాక జన్మంబు నాది
నాతివానిత ప్రిబ్బి నునుఁ దేర్పుఁగాక! (గర్వములేమి)
నా తెన్గుతల్లి మన్నన హెచ్చుఁగాక!



విశ్వాంతరాళంలో అంతులేని అగాధాలు


శ్రీ పెమ్మరాజు వేణుగోపాలరావు

విశ్వసృష్టినిగురించి విశ్వస్వరూపాన్నిగురించి మనం అనేకమైన ఊహలు చేస్తుంటాం. తన చుట్టూ ఉన్న భౌతికప్రపంచాన్ని అర్థంచేసుకోవడానికి మానవుడు ప్రయత్నించడం ఈనాటి విశేషంకాదు. పౌరాణికులు పురాణగాథలుగాను, కథకులు అభూతకల్పనలుగాను సృష్టివిచిత్రాలని సమీక్షించిన విషయం మనకు తెలిసినదే. ఈ కోవకు చెందకపోయినా శాస్త్రజ్ఞుల భావనలుకూడ విశ్వరహస్య అవగాహనకి సంబంధించినంతవరకూ వింత అయినవే. అయితే వీరి భావనల్లో కొంత ప్రత్యేకత ఉంది. భౌతికప్రపంచంగురించి తమకు నిజమని నమ్మకంగా తెలిసిన కొన్నిప్రాథమిక సూత్రాలను ఆధారంగాచేసుకుని వాటి పరిధులను దాటకుండా విశ్వంగురించి ఊహించారు. ఈ ఊహలు సిద్ధాంతాలు కట్టుకథలను మించిన కల్పనలకు దారితీయడం పరిశీలించదగ్గ విషయం.

నక్షత్రాల జీవనాధారం

నక్షత్రాల పుట్టుపూర్వోత్తరాలు, పరిణామ దశలనుగురించి శాస్త్రజ్ఞులు తెలుసుకున్న విషయాలు, వాటి నాధారంగాజేసుకుని వీరు ప్రతిపాదించిన సిద్ధాంతాలు ఆధునికవిజ్ఞానసాంప్రదాయంలో చెప్పుకోదగ్గవి. విశ్వాంతరాళంలో హైడ్రోజను పరమాణువులు విహరిస్తూ ఉండేవని అవి గురుత్వాకర్షణ ప్రభావంవల్ల ఒకదానితో ఒకటిచేరి చివరకి నక్షత్రాలు ఏర్పడ్డాయని నేటి సిద్ధాంతం. వేరువేరు పరిణామ దశలలోగల నక్షత్రాలు విశ్వంలో ఉన్నాయని పరిశోధనలవల్ల తెలిసిన విషయమే. ఈ రచనలో నక్షత్రాల అంతిమదశలలోని కొన్నిఅవస్థలనుగురించి నేటి భావనలను తెలుసుకుందాం. ప్రకాశం తగ్గి చివరకి ఆరిపోయి వెలుగు ప్రసరించలేకపోవటం నక్షత్రానికి మరణంఅని చెప్పవచ్చును. ఈ చివరిదశనుగురించి ముసలితనాన్నిగురించి తెలుసుకునేముందు యౌవనంతో మిణుకుమిణుకుమంటూన్న నక్షత్రాలకి ఎల్లవేళలా శక్తి ఎలా లభిస్తోందిఅన్న ప్రశ్నకి సమాధానం తెలుసుకోవాలి.

హైడ్రోజను ధాతువులను హీలియం ధాతువులుగామార్చే న్యూక్లియరులేక కేంద్రకప్రక్రియలు నక్షత్రాల అంతర్భాగాలలో అస్తమానూ జరుగుతూంటాయి. హైడ్రోజనుకంటె హీలియం షుమారుగా నాలుగురెట్లు బరువు. కాని మొత్తం నాలుగు హైడ్రోజను పరమాణువులలోగల పదార్థంకంటె



హీలియం పరమాణువు పదార్థం కొంచం తక్కువ. అంటే హీలియం తయారవుతున్నపుడు కొంతద్రవ్యం మిగిలిపోయినదనుకోవచ్చు—కాని ఇది ద్రవ్యరూపంలో మిగలదు. శక్తిరూపంలో విడుదల అవుతుంది. ఐన్‌స్టయిన్‌గారి సాపేక్ష సిద్ధాంతప్రకారం పదార్థం శక్తియొక్క రూపాంతరమేగదా ($E=MC2$). ఈ ప్రక్రియలకు కావలసిన ఉష్ణోగ్రతకూడా నక్షత్రాల కేంద్రాలలో లభిస్తుంది. వీటికి ఇంధనం (Fuel) అయిన హైడ్రోజను పరమాణువులే నక్షత్రాలకి జీవనాధారంఅన్నమాట. ఈ ఇంధనం సప్లయి అవుతున్నంత కాలం నక్షత్రం యౌవనంతో విరాజిల్లుతోందనే చెప్పుకోవాలి. మన సూర్యుడుకూడా ఒక నక్షత్రమే. ఈ సూర్యనక్షత్ర కేంద్రం (షుమారు మిలియను మైళ్ల ఆవరణగల ప్రాంతం)లో రోజుకి 10^{13}

టన్నుల ఇంధనం ఖర్చవుతోందిగనకనే మనకి రోజూ సూర్యరశ్మి లభిస్తోంది. ఇంకో పది బిలియను (10^{10}) సంవత్సరాలుపోతే సూర్యుడికిగల హైడ్రొజను ఆస్తిఅంతా హీలియంగామారి ప్రకాశవంతమైన జీవితం ఆఖరవుతుంది. సూర్యునికంటె 30 రెట్లు బరువున్న నక్షత్రాలు సుమారు అయిదు మిలియను సంవత్సరాలకే ప్రాణం కోల్పోతాయి. ఇలా తన జీవనాధారాన్ని పోగొట్టుకున్న నక్షత్రం అంతిమఘడియల్లో ఎలా ప్రవర్తిస్తుంది? మరణానంతరం మిగిలిన అస్థికలు ఏరూపంలో ఉంటాయి? నక్షత్రపు దురదృష్టాలు దానికిగల మొత్తం పదార్థరాశి (Mass) ని బట్టి ఉంటాయి. చిన్ననక్షత్రం అతిసున్నితంగా ఒడుదుడుకులు లేకుండా క్రమంగా చివరిరోజులు గడిపేస్తుంది. పెద్దది చాల విపరీతమైన విచ్ఛిన్నావస్థలకి పాల్పడుతుంది. మన సూర్యునిలోగల పదార్థంకంటె 1.4 రెట్లకులోపు పదార్థంకల నక్షత్రాలన్నిటినీ చిన్నవి అందాం. ఈ 1.4× సూర్యుని ద్రవ్యరాశిఅనే పరిమితికి మించిన పదార్థంకల నక్షత్రాలన్నిటినీ పెద్దవి అందాం.

శ్వేతకుబ్జాలు (White Dwarfs)

ముందు న్యూక్లియరు ఇంధనంఅంతా ఖర్చయిపోయిన చిన్నతారలనుగురించి విచారిద్దాం. అంతవరకు అత్యధికమైన ఉష్ణోగ్రతతో ఉడికిపోతూ విహరిస్తున్న వాయురూపంలోని నక్షత్రపదార్థం ఇక సప్లయిలేక వేడిమితగ్గి, చలనంతగ్గి, నీరసించి గురుత్వాకర్షణ ప్రభావానికి లోనై నక్షత్రకేంద్రంవైపుమళ్లుతుంది. ఇలా పదార్థం కేంద్రంవైపు నొక్కబడి నక్షత్రపు పరిమాణం తగ్గినకొద్దీ లోపలి ఉష్ణోగ్రత మళ్లీ హెచ్చటం ప్రారంభం అవుతుంది. అంటే గురుత్వాకర్షణశక్తి ఉష్ణశక్తిగా మారిందనుకోవచ్చును. శక్తి నిత్యత్వ న్యాయం (Conservation of Energy) పాటించినంతకాలం శక్తి తన రూపాలు మార్చుకోటానికి అభ్యంతరంలేదుకదా. ఈ ఉష్ణశక్తిలో సగభాగం ఉపరితలానికి ప్రవహించి బయటికి అనంతాకాశంలోకి ప్రసారమయిపోతుంది. మిగిలిన సగభాగం లోపల బంధింపబడిపోయి, అంతర్భాగాల ఉష్ణోగ్రత ఇంకా పెరిగి, ఉష్ణ, చలనశక్తులు వృద్ధిచెంది నక్షత్రపు సంకోచాన్ని ఆపుచెయ్యటానికి ప్రయత్నిస్తాయి. కొన్నిలక్షలమైళ్ల సైజులోఉన్న నక్షత్రం కొన్నివేలమైళ్ల సైజుకి కుదించబడేసరికి కేంద్రంలో ఉష్ణోగ్రత బిలియను డిగ్రీలదాకా పెరుగుతుంది. ఈ సంకోచానికి సుమారు మిలియను సంవత్సరాలదాకా పట్టవచ్చును. ఈ అవస్థలో ఇలా ఆగిపోయి ఇంక సంకోచం చెందని తారలనే శ్వేతకుబ్జాలంటారు. ఇంక సైజు తగ్గకుండా ఆ శ్వేతకుబ్జం కొన్నిబిలియనుసంవత్సరాలపాటు నెమ్మదిగా చల్లారి చివరకి 'నల్లటిబొగ్గు' అయిపోయి కాంతివిహీనమయి రోదసిలో విహరిస్తూ ఉంటుంది.

అయితే ఈ నక్షత్రం ఇలా శ్వేతకుబ్జావతారంలో స్థిరపడిపోవటానికి కారణమేమిటి? గురుత్వాకర్షణ శక్తిప్రభావంలో ఇంకా ఎక్కువ సాంద్రత, ఉష్ణోగ్రతలతో కూడిన స్థితికి ఎందుకుపోలేదని అడగవచ్చును. ఇది గ్రహించటానికి భౌతికశాస్త్రంలో పరమ ప్రాతిపదికగా పరిగణింపబడే ఒక మూలసూత్రాన్ని గమనించాలి. దీన్ని 'అనిర్దిష్టతా సూత్రం' (Uncertainty principle) అంటారు. దీనిప్రభావం ముఖ్యంగా పరమాణులోకంలో కనిపిస్తుంది. ఎలక్ట్రానులు, ప్రోటానులు, న్యూట్రానులు మొదలయిన ఈ రేణువులు ఏవీ కుదించబడటానికి ఇష్టపడవు. బరువైన రేణువులు తక్కువ స్థలం ఆక్రమించుకుంటాయి. తేలికయిన రేణువులు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించుకుంటాయి. అంచేత ఎలక్ట్రానులు తాము ఆక్రమించుకోటానికిగల స్థలం తక్కువవుతున్నకొద్దీ మిగతావాటికంటె ముందు అయిష్టతను ఎక్కువగా ప్రకటిస్తాయి. తమని కుదించే బలానికి తట్టుకునే ప్రతిబలం తమకు ఉన్నట్లు వ్యవహరిస్తాయి. శ్వేతకుబ్జాలలో గురుత్వాకర్షణశక్తులని ఎదుర్కోనేటంత బలం వాటిలోని ఎలక్ట్రానుల కుంటుంది. 'ససేమిరా! ఇక మాచోటు తగ్గటానికి వీలులేదని' నిలబడతాయి. మన సూర్యునిలో కూడా ఎలక్ట్రానులకి ఇంత ప్రతిభ ఉంటుంది. కొన్నాళ్లకి కాంతివిహీనుడై

నల్లటి బొగ్గయిపోతాడు. (ఇక ఏవిధముగానూ శక్తిని ప్రసరించలేని వస్తువుని 'నల్లటి బొగ్గు' అని చమత్కారంగా సంబోధిస్తున్నాం ఇచ్చట.)

సూపర్నోవా (Supernova)

ఇక పెద్దతారల విషయం—అంటే సూర్యుని ద్రవ్యరాశికన్న 1.4 రెట్లు పైగా ద్రవ్యంగల తారలన్నమాట. వీటిలో ఎలక్ట్రానుల అయిష్టతను లెక్కచెయ్యకుండా గురుత్వబలాలు, నక్షత్రాన్ని ఇంకా కుదించేస్తాయి. సైజు తగ్గిన కొద్దీ పదార్థము సాంద్రత పెరుగుతుంది. సాంద్రత పెరిగిన కొద్దీ గురుత్వ బలాలు మరీ విజృంభించి నక్షత్రంలోని ప్రతిభాగం నక్షత్ర కేంద్రం వైపు లాగివేయబడుతుంది. దీన్నే 'గురుత్వనిపాతం' (Gravitational collapse) అంటారు. ఈ నిపాతం వల్ల నక్షత్రంలో బ్రహ్మాండమయిన న్యూక్లియరు ఎక్స్ప్లోజను లేక ప్రేలుడు సంభవించవచ్చును. సగం కాలీకాలని నక్షత్రపు పైపొరలు ఒక్కసారిగా భగ్గున మండి పేలిపోయి రోదసిలోకి విసిరివేయబడి కోటి సూర్యుల ప్రకాశంతో ప్రజ్వరిల్లుతాయి. దీన్నే 'సూపర్నోవా' లేక 'బృహన్నవ్యతార' అంటారు.

న్యూట్రాను తార (Neutran Star)

ఒకోసారి అంతపెద్ద ప్రేలుడుకూడా నక్షత్రపు పై పొరలని కదపలేదు సరిగదా నక్షత్రం మరీ మరీ కుదించుకుపోయి, నక్షత్రకేంద్రంలో సాంద్రత హెచ్చి, పరమాణువులలోని ఎలక్ట్రానులు కేంద్రకాల చుట్టూ తిరుగుతూ కాలక్షేపం చెయ్యటానికి చోటు చాలక కేంద్రకాలలోని ప్రోటానులతో కలసిపోయి న్యూట్రానులు తయారవుతాయి. త్వరలో అంతా న్యూట్రానులమయం అయిపోతుంది. న్యూట్రానులు బృహత్సంకర్షణశక్తి (Strong interaction) వల్ల ఒకదాన్నొకటి ఆకర్షించుకోగలిగినా మరీ దగ్గరికి నొక్కివెయ్యబడటానికి ఎలక్ట్రానులలాగే ఇష్టపడవు. అంతేకాదు. ఒకదాని నొకటి ఆకర్షించుకుంటాయి. నక్షత్రపు బరువు సూర్యుని బరువుకన్న రెండింతలకి మించకుండా ఉంటే ఈ న్యూట్రానులు సంపీడన శక్తులను (compressive forces) ధిక్కరించి కేంద్రంయొక్క కుదింపును ఆపుచేస్తాయి. కాని కేంద్రంవైపు పైపొరలలోనిపదార్థం అత్యధిక గురుత్వాకర్షణ బలానికి లోనై విసురుగా అతివేగంతో వచ్చిపడుతుంది. ఆ ధాకిడికి కేంద్రపు ఉపరితలం ఉష్ణోగ్రత 100 బిలియను డిగ్రీలదాకా పెరుగుతుంది. ఈ ఉష్ణశక్తి 'న్యూట్రినో' లనే చిన్నరేణువుల రూపంలోకి మారి బయటికి పోతుంది. ఈ న్యూట్రినోలు నక్షత్రపు టంచులలో ప్రయాణం చేస్తూ అక్కడి పదార్థాన్ని తాకి వేడెక్కించి మరొక సూపర్నోవాకి దారి తీయవచ్చుకూడా.


న్యూట్రానులతో నిండిన కేంద్రం తయారవటం—పైపొరలు కేంద్రంవైపు లాగివేయబడటం—న్యూట్రినోలు విడుదల కావటం—వేడెక్కిన పైపొరలు పేలడం—ఈ దశలను దాటుకుంటూ నక్షత్రం పరిణామం చెందటానికి పట్టేకాలం ఎంతో తెలుసా? కొన్ని సెకనులమాత్రమే. ఇలా న్యూట్రాను తారగా మారిన కేంద్రాంతర్భాగం కలదే మనం ఆకాశంలో చూసే 'క్రాబ్‌నెబ్యులా' (crab nebula). ఈ న్యూట్రాను తారనుంచి ప్రసరిస్తున్న రేడియో తరంగాలనూ,ఎక్సుకిరణాలనూ ఈ మధ్యనే 1967లో శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

అగాధాలు (Black Holes)

రెండు సూర్యుల బరువుకన్న ఎక్కువ బరువు గల నక్షత్రాలను గమనిద్దాం. వీటిలో గురుత్వ శక్తులు న్యూట్రానుల అయిష్టతను తోసిరాజని విజృంభిస్తాయి. నిపాతం నిరంతరాయంగా సాగిపోయి అంతపెద్ద నక్షత్రంలోని పదార్థం షుమారు నాలుగు మైళ్ళ వ్యాసంగల గోళం సైజుకు కుదించుకుపోతుంది. అత్యధికసాంద్రతతో పదార్థభూయిష్టమై ఉన్న ఈ గోళపు గురుత్వాకర్షణ శక్తుల ప్రభావంలో పడినదేదీ—చివరకు కాంతికిరణంకూడా — బయటకు రాలేదు. దీని సమీపంలోఉన్న ఏదయినాసరే తిరిగి బయటపడలేని 'అగాధం'లో ప్రవేశించినట్లే. అంటే

ఈ మన పెద్దనక్షత్రం (రెండు సూర్యులకంటె ఎక్కువ పదార్థం కలది) తన జీవనాధారం హరించుకు పోగానే ఒక 'అంతులేని అగాధం' కల్పించుకుని అందులో అదృశ్యమవుతుందన్నమాట.

1915 లో ఆల్బర్టు ఐన్‌స్టయిన్ ప్రతిపాదించిన సాపేక్షసిద్ధాంతాన్ని ఉపయోగించి, ఓపెన్‌హైమర్, స్నైదర్ అనే అమెరికను శాస్త్రజ్ఞులు 1939 లో గురుత్వనిపాతాన్ని గురించి పరీక్ష జరిపారు. వీరి పరిశోధనకారణంగానే కాంతి కిరణాలనుకూడా బంధించగల మహత్తరశక్తులుగా గురుత్వార్షణ శక్తులు పరిణమించగలవని తెలిసింది. కాని తోటి శాస్త్రజ్ఞులు 'ఇదేదో వింతగా ఉంది. ప్రస్తుత ఖగోళ శాస్త్ర పరిశోధనలకి దీనికి సంబంధం కనిపించటం లేదు' అని ఆశ్చర్యపడ్డారేగాని ఈ సంగతి కూలంకషంగా చర్చించలేదు. ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధపు హడావిడి రావటం ఓపెన్‌హైమర్ ఆటం బాంబు నిర్మాణంలో నిమగ్నులైపోవటం జరిగింది. ఆధునిక కలనయంత్రాల సహాయంతో ఈ మధ్యన



గురుత్వ నిపాతంలో భూమిలాటి పదార్థపు విషమావస్థలు

తిరిగి గురుత్వనిపాతంమీద పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఈ కంప్యూటర్లు కట్టిన లెక్కలవల్లనే అగాధాలు ఏర్పడే నక్షత్ర దశలున్నాయని తెలిసింది.

అగాధాలలో 'విచిత్ర ప్రాంతం'


అగాధపు దశలోని వివరాలను గురించి కంప్యూటర్లు చెప్పిన విషయాలు నిజంగా విడ్డూరమైనవే. పదార్థసాంద్రత అనంతమై, ఘనపరిమాణం శూన్యమై పోయేవరకు నక్షత్రాన్ని గురుత్వ శక్తులు కుదించేస్తాయిట. అగాధంలో స్థలము, కాలము అనే వివక్షతలేకుండా స్థలకాలసమన్వయమైన అపరిచిత లక్షణాలతోకూడిన అంతర్భాగం ఏర్పడుతుంది. దీన్ని 'సింగ్యులారిటీ'(Singularity) లేక 'విచిత్రప్రాంతం' అంటారు. ఈ విచిత్రప్రాంతపు పరిధుల్లో ప్రవేశించిన ఏ వస్తువు తిరిగి బయటపడలేదు సరిగదా క్షణమాత్రంలో విచిత్రప్రాంతంలోకి లాగి వెయ్యబడి గురుత్వ శక్తుల ప్రభావంలో నలిగిపోయి అగాధంలో అంతర్ధానమయిపోతుంది.

అగాధపు అంచులు

రెండు సూర్యుల బరువుగల నక్షత్రపు అగాధం షుమారు నాలుగుమైళ్ల వ్యాసం కలిగి ఉంటుందని గదా అనుకున్నాం. ఇంకా పెద్ద నక్షత్రాలకి పెద్ద అగాధా లేర్పడతాయి. బిలియన్‌సూర్యుల బరువుగల నక్షత్రం అగాధంగా మారితే ఈ 'అగాధపు అంచు' ఆ వైపునుంచి ఈ వైపుకి షుమారు 4 బిలియను మైళ్లు వుంటుందిట. అంటే ఈ విశ్వాంతరాళంలోని అంతులేని అగాధాలు అనేకమైన సైజుల్లో ఉండవచ్చన్న మాట. ఈ 'అగాధపు అంచు' (శాస్త్ర పరిభాషలో దీన్ని 'గురుత్వ త్రిజ్య' (Gravitational radius) అంటారు) దాటిన ఎవరూ — రాకెట్లూ, స్పేసు షిప్పులు వగైరా— తిరిగి రాలేరు. అంటే బయటి నుంచి ఎవరూ అగాధానికి ఇంతకంటె సమీపంలోకి వెళ్లలేరు.

కాంతికిరణాలుకూడా బయటకిరావుగనుక నిపాతపు చివరిఘడియలను ఎవరూ బయటనుంచి చూడలేరు. కుదించుకుపోతున్న నక్షత్రపు ఉపరితలాన్నుంచి కాంతికిరణాల ప్రసారం ఈ క్రింది పటంలో వివరించ

బడింది. గురుత్వప్రభావంలో కాంతికిరణాలు వేగం తగ్గడమేకాకుండా వంచబడుతాయి. గురుత్వత్రిజ్య కంటె 1.5 రెట్లు సైజుకి నక్షత్రం సంకోచించగానే నక్షత్రపు ఉపరితలానికి సమాంతరంగా వెలువడే కిరణాలు బంధింపబడతాయి. సైజు తగ్గుతున్న కొద్దీ ఎక్కువ కాంతిబంధింపబడుతుంది. తిన్నగా బయటికి పోవలసిన కిరణాలు కూడా నీరసపడి పోతాయి. అగాధంలో ప్రవేశించాక ఏ దిక్కులో ప్రసరింపబడ్డా బయటకురాదు ఒక్క కాంతి కిరణం కూడాను. అంటే ఈ దృశ్యం చూదామనుకున్న బయటి వారికి గురుత్వ నిపాతం ఒక్కసారి గురుత్వత్రిజ్య దగ్గర ఆగిపోయి నట్లవుతుంది. ఇక సైజులో మార్పులు కనిపించవు. కాంతికిరణాలు క్రమంగా ఎర్రబడి చివరకి అంధకారమవుతుంది. మామూలు నక్షత్రానికి ఈ మార్పులు జరగటానికి కొన్ని సెకనులు మాత్రమే పడుతుంది. బిలియను సూర్యుల బరువుగల నక్షత్రానికి కొన్ని రోజులు పట్టవచ్చును. మరొకవిషయం — అంతిమావస్థలను చూడటానికి ప్రయత్నించడం అనవసరం. నిపాతంవల్ల బయటికి తోసివేయబడి మండుతున్న



పదార్థపు జ్యోతిలో ఆఖరిక్షణాల దృశ్యం మరుగుపడిపోతుంది.

వికృతాకారపు అగాధాః — వింత భావనలు

ఇంతకీ ఈ జోస్యాలన్నీ వంకరటింకరలేకుండా గుండ్రటి పరిపూర్ణ గోళాకారంలో వున్న నక్షత్రాలను గురించి మాత్రమే. కాని విశ్వంలోని చాలా నక్షత్రాలు అటువంటి సౌష్టవానికి నోచుకోలేను. వికృతాకారంతో తమచుటు తాము అనేక రకాలుగా తిరుగుతూంటాయి. జేమ్సు బర్డీన్ అనే అమెరికను శాస్త్రజ్ఞుడు, ఇగార్ నొవికోవ్ అనే రష్యను శాస్త్రజ్ఞుడు వికృతాకారంకలిగి ఆత్మభ్రమణం చేస్తున్న నక్షత్రపు పరిణామదశలను గురించి పరిశోధనలు జరిపారు. నక్షత్రం అగాధంగా మారిపోయినప్పటికి దాని 'కేంద్రం'లో 'విచిత్రప్రాంతం' ఏర్పడక పోవచ్చన్నారు. అంటే పదార్థం అంతర్ధాన మవటానికి చోటు లేదన్నమాట. అంతర్ధానం కాలేకపోతే నిపాతమవుతున్న నక్షత్రపు పదార్థమంతా ఏమయిపోతుంది. విశ్వంలో మరొకచోట అవతరిస్తుందా ? లేక మనకు తెలియని మరొక విశ్వంలో జన్మిస్తుందా ? అంటే ఈ 'వికృతాకారపు అగాధం' పదార్థాన్ని రోదసిలో 'ఒకచోట, ఒకవేళ' మాయంచేసి 'మరొకచోట, మరొకవేళ'కి మారుస్తోందన్న మాట. ఒక 'స్థలకాలం' నుంచి మరొకస్థలకాలానికి మరలించే అహో బిలం అన్నమాట. బహుశః ప్రచండశక్తితో మనకి ఎంతో దూరంలో — విశ్వపుటంచుల్లో—ప్రజ్వరిల్లుచున్న 'క్వాజార్లు' (Quasars) అనేవి ఇలా నిపాతం చెందిన బృహన్నక్షత్రాల పునర్జన్మలేనని కొందరు శాస్త్రజ్ఞులు ఊహించలేక పోలేదు.

ఇంతకంటె వింతఅయిన భావన ఒకటి ఉంది. ఈ విశ్వంఅంతా ఒకనాడు బ్రహ్మాణువు ఒకటి పేలి పదార్థం నలుమూలలకి విస్తరిస్తూండటంవల్ల ఏర్పడినదేనని కొందరి ఊహ. స్థలము, కాలము అనేవి ఈ విస్తరణ లేకపోతే ఉండనే ఉండవుకదా. అయితే

ఈ విస్తరణ అలా నిరంతరంగా సాగిపోవాలనేముంది. కొందరి భావనలో ఈ 'విస్తారమైన' విశ్వం తిరిగి కుదించుకుని ముకుళీకరణం జరిగి ఇంకో 70 బిలియను సంవత్సరాలకి బ్రహ్మాణువు రూపానికి తిరిగి వస్తుందని, ఈ విస్తరణ, ముకుళింపులు నిరంతరంగా జరుగుతూంటాయని, విశ్వం స్పందిస్తూ ఉంటుందని సిద్ధాంతం. బ్రహ్మాణువు తిరిగి ఏర్పడేవరకు మానవుడే ఉంటే మహానిపాతం చెందుతూ ముకుళించుకుంటున్న విశ్వంఅంతా అగాధంలోంచి తిరిగి ఎలా బయటపడుతుందో అనుభవించ గలడేమో !

అగాధా లున్నాయా ?

వందకిపైగా శ్వేతకుబ్జతారలని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. న్యూట్రాను తారలున్నా యనటానికి నిదర్శనాలు కనిపించాయి. కాని 'అగాధాలు' ఉన్నా యనటానికి ఇంకా ఋజువు దొరకలేదు. అయితే రుజువులేకుండా కంటికి కనపడని అగాధాలుంటాయని ప్రతిపాదించే ఏంత సిద్ధాంతాలపై శాస్త్రజ్ఞుల కీ విశ్వాసమేమిటి అని నిలదీసి అడగటం తప్పేమికాదు.

విశ్వంలో అనేక తారలు జంటతారలుగా ఉన్నాయి. గత యాభై సంవత్సరాలలో షుమారు 700 నక్షత్రాలు జంటతారలలో ఒకటిగా ప్రవర్తిస్తున్నట్లు శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. [ఇవి ఒకదాని చుట్టూ ఒకటి తిరుగుతూ ఉంటాయి. టెలిస్కోపులో వీటిలో ఒకదానినుంచి వచ్చే కాంతిని పరీక్షిస్తే క్రమమైన మార్పులు కనిపిస్తాయి. మనకి దగ్గరలో వున్నపుడు నక్షత్రంనుంచి వచ్చిన కాంతికంటె దూరంగా అవతలివైపు తిరుగుతున్నపుడు ప్రసరించిన కాంతి ఎర్రగా ఉంటుంది]. కాని వీటిలో సగం నక్షత్రాలకి సహచారియైన నక్షత్రం కనిపించలేదు. కనీసం వీటిలో పదినక్షత్రాల సహచరులు—కనిపించే నక్షత్రంకంటె బరువుగా—మన సూర్యునికంటె 1.4 నుండి 25 రెట్లవరకు—ఉంటాయని తేలింది. ఈ కనిపించని సహచరతారలు న్యూట్రానుతారలవచ్చును, అగాధాలు కావచ్చును. అగాధపు అంచులలోకి ప్రక్కనున్న మామూలు నక్షత్రపు పదార్థం పడితే గురుత్వనిపాతానికిలోనై ఎక్సుకిరణాలు, గామాకిరణాలు ప్రసరించవచ్చును. అంతేకాదు. ఈ ప్రదేశంనుంచి గురుత్వశక్తి కూడ తరంగాలుగా వ్యాపించవచ్చును. అందుకనే విశ్వకుహరంనుంచి వచ్చే విద్యుదయస్కాంత, గురుత్వ తరంగాలను కనుగొనటానికి శాస్త్రజ్ఞులు కృషిచేస్తున్నారు.

(ఆధారం : కిప్ థోర్న్ (Kip Thorne) వ్రాసిన 'డెత్ ఆఫ్ ఎ స్టార్' (Death of A Star.)

— తెలుగుభాషా పత్రిక – సంపుటి 1; సంచిక–4; 1971; ఈ పత్రిక అమెరికాలో ప్రచురింపబడుతున్నది.



అతడికి తెలియదు

డా. ముదిగొండ శివప్రసాద్

ఏఱుపై ఏ ప్రభాత సంధ్యల్లో మూడు నిద్దర్లు
మేలిమి బంగారపు ఛాయల్లో లోయల్లో
భాస్వరం నీడల్లో ఇంద్రచాపరాక్షసుడు.
దగిర వర్తులాకారంమీద పైథాగరస్ పైథాన్‌లా ఎక్కినప్పుడు
అజంతా శృంగాంతరాల చంచరీక మరుత్‌గరుత్‌హేలాలీలా ప్రవాహాలు
ఒంటరిగా తుంటరిగా ఏకాంతంగా జాలిగా ఏరుకుంటున్నప్పుడు
నేస్తం !!
‘ఎవర్నీ నిద్రలేపకు !!
భయపెట్టకు !
తలుపుతీయకు !!
పలకరించకు !!
ప్రశ్నించకు !!

కన్నీళ్లు కుడితినీళ్లుగా మారినప్పుడు
కాలం రసలింగంగా పైకి లేచినప్పుడు
విభక్తుల్ని విరిచి పొయిలోపెట్టి సంధుల్ని సందుల్లో వదిలి
తెలుగును వెలుగును తగలేసి ఆ బూడిదతో కాఫీ కషాయం కాచినప్పుడు
నీలితెరలు నిద్రాణమైన ఓడలపై
కుత్తుకకత్తుల యుద్ధం చేసినప్పుడు
కొండమీద బండ !!
కొండకింద గుండు !!!
రెండింటికీ నడుమ ధనికరాక్షసి బ్లాక్‌మార్కెట్ ! బ్లాక్‌మార్క్ !!!
తమ్ముడూ !!!
నేనే కెప్టెన్నై, కర్ణధారినై, సామ్యవాదినై, అరుణ తారనై
నేనుకాని నేను నిద్రలేచి

ముందుకు ముందుకు మరీ ముందుకు
దూసుకుంటూ తోసుకుంటూ
బూజు దులుపుకుంటూ జూలు విదిల్చుకుంటూ
నింగీనేలా కలియనిచోట లయ వి
న్యాసంలో —
హాసంతో (?)
కదనప్రధనం ఆహవం రణరంగం సమరం యుద్ధం
చేసినప్పుడు, రక్తం క్రక్కుతూ (ప్చ్ !)
క్రూక్‌ఆయిల్ యంత్రాల్లా
తంత్రాల్లా
ఇక్ష్వాకుల వంశాల్లా
నర మనుష్యుల్లాగా
జీవచ్ఛవాల్లాగా
డేగల్లా
ఈగల్లా
సీజర్లలాగా
రేజర్లలాగా
సీజర్లలాగా
బ్రూటసుల్లాగా
డేగల్లా
ఈగల్లా (ఈ పాదాలు కవిసమ్మేళనాల్లో ఒక్కోటి రెండుమూడుసార్లు చదవాలి.)

గలగల కలకల రాలినప్పుడు
కాలి
న
ప్పు
డు
నేల ఈనినప్పుడు
ఈ గేయ పావురం పైకెగిరినప్పుడు

తుఫాన్లో గిరికీలు కొట్టినప్పుడు
రెక్కలు కత్తిరించిందెవరన్నా !
ఏ దుష్టుడు? సంతుష్టుడు??
అమ్మమ్మా! ! ? ? —— ——,

అరవై ఇంటూ ఐదులో మైనస్ ఒకటీ ప్లస్ ఒకటీ,
లవంగ ప్లవంగ వంగ అంగభంగం చేసినప్పుడు
నిట్టూర్పుల వేన్నీళ్ళ గులాబీలను కోసినప్పుడు కాల్చి
నప్పుడు
గుండెకింద ఫీంకారం
గుండెపైన ఒక ఘూకం
లోలోపల ఢాంఢాం ! ! !
అన్నా ! !
ఓ అణ్
నా ! !
ఇకలే !
తూర్పున తెల్లవారింది
కాకులు 'కావు' 'కావు' మంటున్నాయి
పిల్లులు 'మ్యావు'–మ్యావు'–మంటున్నాయి——
ముఖం కడుక్కో !
కాఫీ తాగు—
కారప్పొడితో ఇడ్లీలు తిను—
(కారం విప్లవానికీ తెల్లనిఇడ్లీ శాంతికీ సంకేతాలు-)
సాంబారులా బారుగా, నిలువుగా అడ్డంగా బక్కపలచగా
మన గీత పారావతాలు పారాలి
ఐరావతాలు రాలాలి—
షడ్దర్శనాలు షడంగాలు గోడవీా
ద
శీర్షాసనంవేసి నిల్చున్నాయి చూడు—
అరుణమైన ఆల్కావీా
కరుణలేని టూలవీా

కవిరాజులో బరాజు
జూలో జంతు వితంతువు-
!!!
హిప్ హిప్ హిప్పీ—హుర్రే!
లే లే లే-
రా రా రా!
బ్రహ్మజెముడు చంద్రుని కిక
లైన్ క్లియర్ ఇవ్వాలోయ్
రాకసి కసి సూర్యాని నుసి
రాల్చు-దటీస్—టు—బీ—డన్
లే
లే
లే
రా
రా
రా
హిప్ హిప్ హిప్పీ—హ్హుర్రే!!!
..................................!!!

[సూచనలు :

1. గ్రంథముద్రణలో ఈ గేయానికి ప్రతిఅక్షరానికీ, ప్రతిఅచ్చుకూ, హల్లుకూ కూడా కింద ఫుట్ నోట్సు ఇవ్వబడుతుంది.
2. ఈ గేయాన్ని మీరు చదివేటప్పుడు దాని ఊగుసూ తూగుసూ అనుసరించి మీరూ ఊగుతూ తూగుతూ వుండాలి.
3. దీని భావమేమిటని నన్ను—ఇప్పుడుమాత్రం అడక్కండి. వ్రాస్తున్నప్పుడు ఆ పైవాడికొక్కడికే తెలుసు—ఇప్పుడు—అతడికీ తెలియదు— —సం॥ రచయిత.]

అచ్చ తెనుగు ప్రబంధము - సుపాణినీ పరిణయము

శ్రీ కపిలవాయి లింగమూర్తి

నన్నయగారు మహాభారతమును తెనుగున వ్రాయు చున్నానని పలికినను రెండువంతుల సంస్కృత పదములు వాడక తప్పలేదు. ఆ పిమ్మట నన్నెచోడ తిక్కనాదులు తెనుగునం దభినివేశము గనబరచినను సంస్కృతమును పూర్తిగా పరిహరింపలేదు. సాహితీ ప్రపంచమున సుమారు యెనుటైదువందల యేండ్ల నుండి యవిచ్ఛిన్నముగా సాగుచువచ్చిన ప్రథ, తమ భాషనే దేశమునంతటను వ్యాపింపజేయవలయునను తలంపు గలిగిన గోలకొండ నవాబుల కాలమున మారి యచ్చతెనుగు కావ్యముల కంకురార్పణ జరుగుట కాలపురుషుని లీలలం దొకటి యనకతప్పదు.

మల్కిభరాముని కాలమున వెలసిన పొన్నగంటి తెలగన్న అచ్చతెనుగుబాసయం దాది కావ్యమగు యయాతిచరిత్రకు శ్రీకారముచుట్టి సార్థకనామ డగుటయేగాక తానొక ప్రక్రియ కాద్యుడైనాడు. అతని యనంతరము పలువురి నా పద్ధతి యాకర్షించి శివకవులవలె, ద్విపదకవులవలె వారిదిగూడ నొక సాంప్రదాయము వెలసినది. దానినే నేటి కందుకూరి వరకు నాయాకాలములం దచట వెలసిన కవులు చేపట్టి గ్రంథరచన గావించుచునే వచ్చినారు. అట్టి వానిలో నీ సుపాణినీపరిణయ మొకటి. ఇది వట్టెము చెన్నకేశవస్వామి కంకితమైన మూడాశ్వాసముల ప్రబంధము. సుపాణినీకార్తవీర్యార్జునుల పరిణయ మిందలి యితివృత్తము.

దీనికర్త సంబరాజు రామచంద్రకవి. ఈతడు వట్టెముగ్రామనివాసియగు కరణము. నేటికి రెండు వందల యేండ్లలోపు వాడని జెప్పుదురు. కవిగారి వంశీయులు నేటికిని యచట కరణాలుగా నున్నారు.

వట్టెము మహబూబ్‌నగర్ జిల్లాలో నాగర్ కర్నూలునకు అనతిదూరముననున్న గ్రామము. పల్లె టూరైనను యచటగల వైదిక- నియోగి-చాత్తాద వైష్ణవులకు సంబంధించిన మూడు కుటుంబము లందు పలువురు కవి పండితులు వెలసినారు. ఈ కవి తనను గురించి యాశ్వాసాంత గద్యమున—

'ఇది శ్రీ కార్తవీర్యార్జున సార్వభౌమాగణ్య కారుణ్యపాత్ర హరితసగోత్రా పస్తంబసూత్ర యజుశ్శాఖాధ్యయనపవిత్ర వట్టెంపురీ సంబ రాద్యంశసరిసవనమిత్ర వేంకటాచలరాయ విద్వ త్పౌత్ర నరసింగరాయశిరోమణిసత్కవి పుత్ర సరస కవితాధౌరేయ రామచంద్రనామధేయ మంత్రి ప్రణీతంబైన సుపాణినీ పరిణయంబను అచ్చ తెనుగు ప్రబంధంబునందు ప్రథమాశ్వాసము.'

అని చెప్పుకొనియున్నాడు. ఈ గద్యమునుబట్టి కవి తాతగారు వేంకటాచలరాజు పండితుడు; తండ్రి నరసింగరాజు సత్కవి యని దెలియుచున్నది.

ఈ నరసింగరాజుపేర వట్టెము చెన్నకేశవ స్వామి కంకితమైన 'లాలిప్రహరి' యను యముద్రిత లఘుకృతి యొకటి ఉన్నది. శ్రీ కృష్ణుడష్ట మహిషులతో క్రీడించి సుఖసుప్తి జెందుట యందలి యితివృత్తము. ఆ లీలా మానుష విగ్రహు డొక్కొక్క భార్యతో క్రీడించి నిద్రజెందినపుడు కవి యొక్కొక్క దిక్పాలకునికొక్కొక్క శ్లోకము—వృత్తము—చూర్ణిక—ఏల —ద్విపద—దరువు—అష్టకము—హెచ్చరిక—అను నష్టవిధ ఛందఃప్రక్రియల ద్వారా యప్రమత్తతగా నుండి యా దిక్కును రక్షించు చుండుమని హెచ్చరిక పలికినాడు. రచనావిధానమునుబట్టి ఇది

యొక యపూర్వమగు సేవా ప్రబంధమని నేను భావించుచున్నాను. ఈ కవి కృత్యంతమున తనను గురించి

'భువి రాగజ్ఞుల కెల్ల సంతసము
నిష్టన్‌జేయు శ్రీ చెన్నకే
శవనామాంకితమై సుధీజనుల
కుత్సాహంబు దీపింప స
త్కవియౌ వక్కెము సంబరాజు
నరసింగం బార్యపాదాంబుజ
స్తవనీయుండు రచించె
నీ ప్రహరి నాచంద్రార్క సంస్థాయిగన్॥

అని చెప్పుకొనియున్నాడు. దీనినిబట్టి యిందు కవిపేరు దప్ప గోత్ర సూత్రాది యితర విశేషములుగాని, అతఁడు సత్కవియైనందుల కింక నేయే కృతులు రచించెనో వాని వివరములుగాని యెఱుఁగు నవకాశము లేదు.

రామచంద్రకవి సుపాణీపరిణయమునే గాక, కార్తవీర్యార్జునశతకమును గూడ రచించెనని వినికిడి గాని, యది నాకు లభింపలేదు. వీనినిబట్టి చూడ నీకవి కార్తవీర్యార్జున భక్తుడై కనిపించును. ఇతడేగాక నీ గ్రామవాసియగు మరియొక కవి పుంగవుడు చింతలపల్లి వీరరాఘవకవి మధురవాణీవిలాసమను పేర వసుచరిత్రకు దీటుగా మరియొక కార్తవీర్యార్జున పరిణయమును రచించెను. దానినిబట్టి యతడుగూడ కార్తవీర్యార్జునభక్తుడే యనవలెను. రామోపాసనయం దాంజనేయునివలె దత్తాత్రేయోపాసనయందు కార్తవీర్యార్జునుని గొలుచుట గలదని మిత్రులు శ్రీ గుండారు హనుమచ్ఛర్మగారు జెప్పిరి. కనుక నీ కావ్యములనుబట్టిచూడ నీ గ్రామపు కవులకు కార్తవీర్యార్జును డిష్టదైవమైనటుల దోచును.

నే నీ వ్యాసమున పేర్కొను సుపాణీపరిణయ,లాలిప్రహరి యను ప్రతులు నాకు శ్రీ వక్కెము రామచంద్రశాస్త్రిగా రాదరమున నిచ్చియున్నారు. వానిలో నీ సుపాణీపరిణయమునకు వక్త చిల్కతపసి; శ్రోత కవ్వడియనుగుమనుమడు. లభించినంతవరకు గ్రంథమున కథ యిటులున్నది.

అనగాననగా నొక పట్టణము - (పేరు దొరకలేదు). దానిని సుకేతు డనురాజు పాలించుచుండెను. వెన్నుడాతని హృత్పద్మమున తేటయై యొప్పుచుండెను. అతని యర్ధాంగికి—(ఆమె పేరుగూడ లభింపలేదు)— పెక్కుమొగలొదవకున్న పుడమిచేడియ, చెలువుని విసము ద్రావబుచ్చుకున్న గట్టుపట్టి, అందరి నొక తీరుగా జూచిన కడలికూతురు, పదుగురితో వాదాడకున్న నలువరాణి దీటువత్తురు. ఒకనా డా సుకేతుని సభకు జేజేని రాబారి యేతెంచి, పూజలంది 'ఓ రాజా! నీవు వెన్నుని యనుగ్రహమున నీలుడను సుతుని, సుపాణిని యను కూతురును గాంతువు. కూతురును వేయిబుజాలరేని కిత్తువు. అనంతరమున నీ పట్టణమున నాఁటేనిజాతర సాగును' అనిచెప్పి, యిందులకు నీవు రేగులకానకరిగి యెనిమిదక్కరముల మరుగు జపించుమని దానిని యుపదేశించి వెడలిపోయెను. నారదుడు వెళ్లినపిమ్మట సుకేతు డంతఃపురమునకు వెళ్లి పట్టమహిషితో నా విషయము జెప్ప నామె 'మీతోగూడ కానకు నేను వత్తును!' అనెను. అంత సుకేతుడామె కడవియందలి భయంకరత్వమును, తపస్సు యొక్క కష్టమునుగుఱించి యుపన్యసించి, సమ్మతింపజేసి తానొక్కడే బదరికాశ్రమమున కేగి తపశ్చర్యకు బూనెను.

అటు లతడు పెక్కేండ్లు తపస్సొనర్పగా దాని కింద్రుడు జడిసి తపోభంగమున కచ్చరలేమలను బంపెను. అపుడు వారికంటె ముం దచట కాముని వెళ్లెను. ఆ వెనుక వలరాజు వెళ్లెను. తరువాత నచ్చరలు వెళ్లిరి. వారు సుకేతునిముందు తమ హావభావ విలాసములెల్ల ప్రదర్శించి వ్యర్థప్రయత్నులై మరలి యింద్రునిజేరి విషయమంతయు విన్నవింప నాతడు దేవతలనుగొని వైకుంఠమునకు వెళ్లి విష్ణువును దర్శించి, నుతించి, సుకేతుని విషయముజెప్పి. 'స్వామీ! మీరు వెళ్లి యాతనికి కోరిన వరములిచ్చి తపము విరమింపజేయుడు. మేము దానిని భరింపలేకున్నా'మని విన్నవించెను. అది విని వెన్నుడు 'ఇంద్రా! నేను సుకేతుని విషయమంతయు నారదు డతనిదగ్గరకు వెళ్లినదిమొదలుకొని యెఱుగుదును కనుక మీరు మీ మీ నెలవులకు వెళ్లుడు. నేను సుకేతుని కోరిక తీర్తు'నని పంపెను.

విష్ణువు వారిని బంపినపిమ్మట వర్షర్తువు వచ్చెను. అది గడచి శరదృతువు వచ్చెను. ప్రజలు ఋతువుల ననుసరించి చేయవలసినకార్యములందు, సలుపవలసిన పండుగలందు నిమగ్నులైరి. సుకేతు డదియేమియు తనకు బట్టకుండ తపోలీనుడై యుండ విష్ణు వాతని తపమునకుమెచ్చి ప్రత్యక్షమై వరము వేడుకొమ్మనెను. ఇప్పటికి ద్వితీయాశ్వాసము దాదాపు పూర్తిగావచ్చినది. కవి నారదుడు సుకేతునకు జెప్పిన విషయమున తన కథాప్రణాళిక ప్రదర్శించినాడు గాన దానినిబట్టి యిక తక్కిన యాశ్వాసకథ యూహించుట దుష్కరముగాదు.

ఈతని శైలి యలతియలతి పదములతోగూడి ధారాశుద్ధితో నొప్పుచున్నది. మచ్చునకు సుకేతుని రాజ్యమును తిలకింపుడు.

కలుగరు దొంగలెన్నటికి,
కల్గరు రంకులొనర్చు వారలున్
కలుగరు బొంకుమానినులు,
కల్గరు నేరముజేయు వారలున్
కలుగరు పేదసాదలును,
కల్గరొకప్పుడు మందుకైన, న
బ్బలుదొర యేలు నేలయి ■
పన్నుగ వాని గొనంబు లేమనన్.

ధారవలెనే యతని వర్ణనలుగూడ తేటతేటమాటలతో నూటిగా నున్నవి. నారదుడు వెన్నునిగుఱించి చెప్పు సందర్భమును జూడుడు.

సిరిబోటియురమున జెలగుచుండెడివాడు
గుడుసుకైదువు సంకు గొనినవాడు
పులుగుల దొరతేజి పొసగుచుండెడివాడు
కమ్మని విలుకాని గన్నవాడు
గాలిమేతరిపాన్పు ప్రోలుచుండెడివాడు
కొలుచువారికి సిరుల్ గూర్చువాడు
బంగారు దుప్పటి వలెవాటుగలవాడు
తులువ రక్కసిపిండు దునుము వాడు
తొగల చెలి తమ్మి మొగడు కందోయివాడు
వేల్పుగమికెల్ల ప్రాపుగా వెలయువాడు
జగములంతట తానెయై నెగడువాడు
వెన్నుడనియును పేరు గైకొన్నవాడు.

వర్ణనలవలెనే భావములుగూడ యలతి యలతి మాటలతో నడచినవి. సుకేతుడున్న వనమున కామని ప్రవేశించినది. అపుడా వనముననున్న తరువులువేసిన చివురులు మదనుడు తెఱవలనటికి యెత్తగా నెత్తుట బొత్తిల్లిన కత్తులవలె, తొడిగిన మొగ్గలు చిగురు బోడుల గుండెలు తల్లడిలజేయు నీటెలవలె నున్నవట! అరవిరిసిన మొగ్గలు తమను డాసి డాసి తిరుగుతేంట్లనుగని ఆస దోసమెరుగదని పిన్ననవ్వు నవ్వుకొనుచున్నట్లున్నవట. అలరులతో నిండిన తరువులు జగములు గెలువబూనిన మరుని వెంటవచ్చిన యమ్ములబండ్లవలె నున్నవట. పూవులనుండి జారు మకరందము వెడవింటితపసి కొమ్మలతో నోమించు సందర్భమున వనలక్ష్మి కర్పించు జలమువలె నున్నదట. మనోహరమగు నిట్టి యచుంబిత భావములకీ వసంతము తావలమై యున్నది.

అచ్చతెనుగు కావ్యముల రచించునపుడు కవి నెదుర్కొను ప్రధాన సమస్య సంజ్ఞావాచకములు. వాని ననువదించకున్న నియమభంగము. అనువదించిన రసభంగము. అందువలన వానిని తృప్తిగా నిర్వహించుట కష్టముకాని యట్టిపట్టుల నీతని యనువదింపు విశేషముగా నున్నది. చూడుడు సుకేతుని యాశ్రమమున కతని తపమును భగించుటకై యచ్చరలు వచ్చినారు. అపుడు

అనటి పేరందిన యచ్చర దొరసాని
మేలైన తొడగుల్క ప్రోలనాడె
నెలతఱ్ఱుపేరిటి నెలతుక చిఱునవ్వు
మొగమున చిగురింప వగలు సల్పె

నూమిన్న యనువేల్పులేమ ముక్కునత్తు
ముత్తెముల్ వెలుగొంద ముచ్చటాడె
పుత్తడి పేరొందు పూవుబోణి మెఱుంగు
మిఱుమిట్లుగొన పాట మెఱుగుజూపె
జింకపేరిటి జేజేల చిగురుబోడి
సొగకన్నుల ద్రిప్పుచు సొగసు నెఱపె
కొదమతెఱగంటి బోటులు కొసరికొసరి
వన్నెచిన్నెలు జూపిరి వలసినటుల

సాధారణముగా కావ్యములందు నాయకులు తపమొనరించు సందర్భమున కవులు తత్తద్రుతు నౌద్ధత్యమును వర్ణించి తన్మూలమున నాయకుని కష్టసహిష్ణుత్వమును వెల్లడింతురు. ఈ కవి యటుల గాక నా పట్టుల ఋతునౌద్ధత్యమునకు బదులు ప్రజల వేడుకలు వర్ణించి సుకేతుని వాని కతీతునిగా జూపినాడు. మానవులు ప్రకృతి వైపరీత్యములకన్న వేడుకలకు వినోదములకు చలింపకుండుటయే కష్టము. మనోధర్మమూలమైన ఈ రహస్యమును కవి చక్కగా నాకళించుకొని యిట తన్మూలమున విషయమున కుత్కర్ష సాధించుట యతని యపూర్వప్రతిభకు నిదర్శనము.

ఇక ఈతడు వర్ణించిన ప్రజాజీవిత మచ్చముగా తెలంగాణ ప్రజాజీవితమే. చూడుడు వర్షర్తువున

కొందరు వరిమొలు కలికిరి
కొందరు కరిగట్లొనర్చికొని రింపలరన్
కొందరు కలుపులు గలిచిరి
కొందరు వెలిచెల్క దున్నగడగిరి కాపుల్.

వర్షము కడబట్టినపిమ్మట సరదాకు మారురూపమగు 'దసరా' వచ్చినది. అప్పుడు

మరునాడుబ్బుచు రాచ...ల్తము
జగామవ్వంపు పూదండ లొ
ప్పరహిన్దూకు గుఱాలతో
మిగుల తీవిన్మించి రాణించి, చి
త్తరు బంగార రదాలతో బలిసి
చెంతన్ గొల్చు బల్మికతో
తర చేమంగుల గుంపుతో జనిరి
పెద్దల్వెంటరా జమ్మికిన్.

స్వాతంత్ర్యమునకు పూర్వము ప్రతిగ్రామము నందు—అందును దొరలు జాగీర్దారులుగల గ్రామము లందు—జమ్మికి వెళ్లెడు వేడుక సరిగా నిటులే జరుగుచుండెను. మా గ్రామము జినుకుంట వెలమ దొరల దగుటవలన నా చిన్నతనమున వారు దసరా నాడు గుర్రములకు పూలదండ అలంకరించి వానిపై దౌడుదీయుచు, బండ్ల నలంకరించి వానిపై యూరేగుచు గామపెద్దలు వెంటరాగా సరిగా నిటులే జమ్మికి వెళ్లుచుండిరి.

దసరా వెళ్ళగనే యన్ని పండుగలకు గొప్పదగు దీపావళి వచ్చెను. అపుడు,

మంగళారతులంది సంపెంగనూనె
తలకు దోగించి వెంటనే జలకమాడి
మేలికోకలు వెనబూన్చి మిగులతొడవు
లొడల నలరించి నెత్తావు లడరదెసల

కులికెడు పూతలున్ విరులు
క్రొంజిగిబట్టలుదాల్చి తియ్యనన్
జెలగెడు సన్నసేవె లొగి
జెన్నలరన్దిని రేయి ప్రొద్దులున్
పలువురుగూడి దుందుమలు
పాల్పడి ద్రిప్పుచు పూలబాజె మ
ల్లెలుగొని కాల్తురెల్లెడల
తేమగుముల్ మొగవాండ్రు నత్తరిన్.

బోగి తొలునాడు మరునాడు బోగినాడు
దాని మూడవనాడు నింపైనవేడ్క
తోడ పండుగ లొనరించి తోలుదాల్పు
వేల్పు బలునోము నోచిరి పెంపువెలయ.

తిరువళికెలు నుప్పరమున
మిరుమిట్లుగొనంగ వెదురుమేల్గడలందున్
సిరిమొగనికంచు మానిసు
లరుదుగ వెలిగించిరప్పు డన్నెలదాకన్.

అని దీపావళిపండుగను గొప్పగా వర్ణించినాడు. అదియేగాక యింకను హోళీ వసంతోత్సవములు, నవరాత్రులు వర్ణించి, నాయా ఋతుసందర్భములందు చాతుర్వర్ణములవారు తమతమ యిండ్లయం దాచరించు

వ్రతాదులు, వివాహాదిశుభకర్మములు దెలిపి తన కావ్యమును జాతీయజీవనవిలసితముగా దీర్చినాడు.

ఇటు లీ కావ్యము పరిమాణమున చిన్నదయ్యు ధారాశుద్ధితో, తేటతెల్లమగు వర్ణనలతో, నచుంబిత భావములతో, ఆగిటి—ఏగిలి-కరిగట్ల—దుందుమలు—పూలబాజెలు—మల్లెలు—వంటి తెలంగాణపు మాండలికములలో, తెలుగువారి జీవనవిధానముతో మనోహరముగా నున్నది.

మనయాంధ్ర భాషయం దిట్టి పరిణయ కావ్యములు పెక్కువెలసినవి. వానిని సమగ్రముగ పరిశీలన జరిపిన, సాహిత్య, సాంఘిక చరిత్రలకేగాక పురాణ వాఙ్మయమునకుగూడ నెంతయో పుష్టి చేకూరగలదు. నేడు మనకు పురాణములందు ప్రసిద్ధులైనవారిని గురించియే యెన్నియో వివరములు దెలియవు. ప్రసిద్ధములైన రఘు— యదు వంశములందే యెందరివో భార్యల పేరులు దెలియవనుట కా రఘు యదువులే ప్రథమ నిదర్శనము. అంతేగాక మన పూర్వ గాథాల హరికిని, అలహాబాదునందలి హిందూస్తానీ అకాడమీవారు ప్రచురించిన హిందీ కథా కోశమునకు కథ లందెంతయో భేదము గనిపించును. కనుక మనకుగల కావ్య సంపదపై సమగ్ర పరిశీలన జరిపిన, దేశదేశమునకు భేదములతో ప్రవర్తిల్లిన పురాణకథలిందు ప్రామాణికేతివృత్తములు నిర్ణయించుట కాకృషి యెంతేని తోడగును. ఇది సాహిత్యఅకాడమీ వంటి బృహత్సంస్థ జేయవలసిన పని.

నా కీ సుప్రాణినీపరిణయ లాలిప్రహరి కృతులు శ్రీ వట్టెము రామచంద్రశాస్త్రి గారిచ్చుటయేగాక యీ వ్యాసరచన కెంతయో తోడ్పడిరి. వారికి నా కృతజ్ఞతలు. నాకు వారొసగిన సుప్రాణినీ పరిణయ ప్రతి యసమగ్రము. అందు ప్రథమాశ్వాసమున రాజవర్ణన మొదలుకొని ద్వితీయాశ్వాసమున నతనికి విష్ణువు ప్రత్యక్షమగువరకు మాత్రమే యున్నది. అప్పటికి దాదాపు యాశ్వాసము ముగియవచ్చినది. కావ్యప్రియులెవరైన దీని సమగ్ర ప్రతికై యత్నించి సాహిత్య లోకమున కెరిగింతురుగాక! అని నాకు లభించినంతవరకీ కావ్యమునగల విశేషములు ముచ్చటించితిని. ఇట్టి కావ్యము లింక నెన్నెన్ని దేశమున నేయే మూలలందు మూలుగుచున్నవో! వానికి ప్రాణముబోసి రక్షించుకొనవలసిన బాధ్యత మనపై నున్నది.

జుత్తిగ-మండపం

శ్రీ జి. ఆర్. వర్మ

జుత్తిగ ఆలయాలగూర్చిన సచిత్రంగా ప్రథమంగా పాఠకుల దృష్టికి తెచ్చాను. ('భారతి' ఏప్రిల్ 1969). చెదురు మదురు విషయాల సేకరించి అంతకుముందెవరూ వ్రాయని—ప్రకటించని విషయాల నూహించి నాకు తోచినవాటిని జోడించి ప్రకటించాను. గవర్నమెంటు ఎపిగ్రాఫిస్టు ఫర్ ఇండియా, తమిళ్నాడు మ్యూజియమ్ డైరక్టర్ డాక్టర్ సత్యమూర్తిగార్ల సౌజన్యంతో అచటి శాసనాలు, గూర్చి వ్రాసాను. కరవాల భైరవమండపం వీరవిజయాదిత్యుడు విజయచిహ్నంగా క్రీ. శ. 1031 35 మధ్య నిర్మించాడన్నాను. శ్రీ వాసుకీ రవి సోమేశ్వర దేవునిపేరులో తన కుడిభుజంగా వున్న నాగకులభూషణ భీమరాజు, రాజమార్తాండ విజయాదిత్యుడు, హితుడైయున్న ఆహవమల్ల సోమేశ్వరుల పేర్లు సూచించేట్లుగా వీరవిజయాదిత్యుడు ప్రతిష్ఠించి యుండునా అనే ప్రశ్న.

శ్రీ తురగా కృష్ణమూర్తిగారు జత్తిగదేవుని ప్రతిష్ఠాత చక్రకూట సోమేశ్వరుడు తనవంశ(ధ్వజ) నామం (నాగ), హితుడు చంద్రాదిత్యుని పేరు తన పేరు—ఇద్దరు వ్యక్తులు-సూచించేట్లుగా క్రీ. శ. 1065—75 మధ్య ప్రతిష్ఠించెననీ కృష్ణాపుర శాసనంలో కళింగ వేంగివిజయం, వేంగీ దహనం బిరుదులు ఈతని కున్నందున చక్రకూటేశ్వరుడు ప్రతిష్ఠించెననే నిర్ధారణకు దోహదకరంగా బస్తరుదంతేశ్వరిని ప్రతిష్ఠించెననీ, ఆమెయే జుత్తిగలో దూతికయనీ, మండప నిర్మాణకాలం క్రీ. శ. 1074 అనీ 'భారతి' జూలై 1970 సంచికలో ప్రచురించారు.

నా రెండోవ్యాసం 'జుత్తిగదేవుని ప్రతిష్ఠాత—చక్రకూటేశ్వరుని వేంగీ విజయం ?' శీర్షికను ప్రచురితమైనది (భారతి—మే, 1971).

చక్రకూటేశ్వరుడు, దంతేశ్వరికీ జుత్తిగ సంబంధంలేదనీ, మండప నిర్మాణకాలం క్రీ. శ. 1074 నాటి దనుకోడానికీ అవకాశాల్లేకపోలేదనీ వ్రాశాను. కృష్ణాపురశాసనం నేజూడలేదు; చూడనక్కరలేదు. చక్రకూటేశ్వరుని వేంగీవిజయదహనాలు అసంభవంగాబట్టి అతడు ప్రతిష్ఠించుటా అంతేఅనే భావం ప్రకటించాను.

నా రెండో వ్యాసానికి సమాధానంగా శ్రీ మూర్తిగారి 'జత్తిగదేవుని ప్రతిష్ఠాత చక్రకూటేశ్వరుడు కాడా?' (భారతి—జూలై, 1971) ప్రచురించారు. శ్రీ మూర్తిగా రీ వ్యాసంలో మరొక 'విషయం', ప్రచురించినందున తప్పనిసరిగా మూడోసారి వ్రాయవలసి వచ్చినది. ఓపినంతవరకూ నా భావాలు పాఠకుల ముందుంచుచున్నాను.

కృష్ణాపురశాసనం పూర్తిపాఠం శ్రీ మూర్తిగారు ప్రకటించలేదు. అందలి ప్రశస్తి విశ్వసిస్తూ సత్యాన్వేషణ, కనీసం సంభవాసంభవాల తర్కించుకోకుండా చక్రకూటేశ్వరుడు కళింగ వేంగీరాజ్యాల జయించి, దహించి క్రీ. శ. 1065-1075 మధ్య ప్రతిష్ఠించెననుటకు నేతిబీరకాయ—ఆధారం దూతిక—దంతేశ్వరి !

నా రెండవవ్యాసంలోనే కృష్ణాపుర శాసనపాఠం ప్రకటించగోరాను. కనీసం వారి రెండో వ్యాసంలో గూడా శాసనపాఠం ప్రచురించని కారణం వారికే తెలియాలి. వారి కాధారభూతమైన ఆ శాసన సంఘటనలు చక్రకూటేశ్వరుని పరంగా అనూహ్యం, అసంభవాలని పునరాలోచించమంటున్నాను.

గ్రంథాలు కొనడానిగ్గాని, కనీసం రాజమండ్రి వెళ్లి 'ఎపిగ్రాఫియా ఇండికా' చూచుటగ్గాని అశక్తుడుగా నున్నాను. చూడనవసరం లేదనుకొంటున్నాను.

శ్రీ మూర్తిగారికి కొండంత అండగావున్న ఆ శాసనం చూడకుండా, తెలియకుండా ఒక్కకలంపోటుతో శాసనస్థ విషయాలు కాదనే సాహసం—నేను అనుశాసించడం నాలో చూచిన శ్రీ మూర్తిగారికి మనవి. ఆ శాసనంలో ఆలయప్రతిష్ఠాపనగూర్చి ఏమీ ఉండదని ఊహించే అలా వ్రాశాను. కాదు అనేందుకు నా కందిన కారణాలు వ్రాశాను.

కాగా దేవుని ప్రతిష్ఠాపనగూర్చి శాసనంలో ఏమీ లభించకపోవడం శ్రీ మూర్తిగారు వారి రెండో వ్యాసంలోనే బైలుపడ్డారు.

పరిశోధకాభిప్రాయంలో సమకాలీన చక్రకూటాధీశ్వరుడు ఒకానొక నృపభూషణుడు. వేంగి రాజరాజు చరమకాలపు చక్రకూటేశ్వరుడు జగదేకభూషణ ధారావర్షుడు. ఇద్దరికీ సంబంధం లేదన్నారు పరిశోధకులు. నాటి రాజకీయ చదరంగంలో ఆహవమల్ల సోమేశ్వరుడు కుమారవిక్రమాదిత్యుని బంపి చక్రకూటేశ్వరుని తన మార్గానికి దెచ్చుకొని వేంగీశ్వరునిపై తిరుగుబాటుగా స్వతంత్రంప్రకటింపజేసె నన్నారు పరిశోధకులు. వేంగీశ్వరుని చరమకాలాన కుమార రాజేంద్రచోడుడు (కులోత్తుంగ చక్రవర్తి) ధారావర్షుని దర్పమడచి కప్పముగొని వచ్చినట్లు వ్రాశారు. తర్వాత సుమారు ఆరేండ్లకు చోళసింహాసన మాశిస్తున్న కుమార రాజేంద్రచోడునీ, నాటి వేంగీశ్వరుడు వీరవిజయాదిత్యునీ శిక్షింప చోళ వీరరాజేంద్రుడు చేసిన దండయాత్రలో—పోరిన కుమార రాజేంద్రచోడుని సైన్యాల్లో నొకానొక చక్రకూట జననాథ సోదరుడున్నట్లు వ్రాసివున్నారు.

రాజ్యము వీరభోజ్యమనే పద్ధతిలో చక్రకూటంలోగూడా రాజ్యాధిపత్యానికి రెండువర్గాలు—ఇద్దరు వారసులున్నారన్నారు. (చక్రకోట్య—భ్రమరకొట్యములు)

శ్రీ మూర్తిగారు తొలివ్యాసంలో ఈ రెండు వర్గాల ఉనికి అంగీకరించారు. మధురాంతకుని (చక్రకోట్య) చంద్రాదిత్యునితో కలిసి ఓడించె నన్నారు. శ్రీ మూర్తిగారు చక్రకూట సోమేశ్వరుడు కుమార విక్రమాదిత్యునితో కలసి మధురాంతకుని సైన్యాల నోడించె ననలేదు.

చక్రకూటేశ్వరుల కులదేవత వింధ్యకాసినీదేవి అన్న పరిశోధకులే వేంగీశ్వరుల సామంతులై వారి ననుకరించుటలో 'శ్రీ మాణిక్యదేవీ దివ్యశ్రీపాద పద్మారాధకుల' మన్నారీ నాగకుల—నాగధ్వజ — భోగవతీ పురీశ్వరులు అన్నారు.

నృపభూషణుడూ, జగదేకభూషణుడూ ఒకరైనా, వేర్వేరైనా జగదేకభూషణుని పేరులో రాష్ట్రకూటచ్ఛాయలున్నట్లే, బిరుదులో కల్యాణి చాళుక్య జగదేకమల్ల జయసింహుని ఛాయలూ ఉన్నట్లుంది.

సోమేశ్వరుడు ధారావర్షపుత్రుడైనా పేరులో అధిరాజులైన వేంగీశ్వరులపోలిక కాక కల్యాణి చాళుక్యుల పోలిక ఉంది. అలాగే ఈ సోమేశ్వరు డోడించిన మధురాంతకుని పేరు చోళ సాన్నిహితుడనే సూచిస్తుంది. కాంచీపుర చోళుల్లో మధురరాజ్యాన్నిగెల్చిన నాటినుండీ—క్రీ. శ. 10వ శతాబ్దంలోగూడా వారి బిరుదావళిలో మధురాంతక యన్నది ఉన్నది—పరకేసరి వర్మ మధురాంతకదేవ ఉత్తమచోళుడు—కథా కాలానికి పేరు చెప్పకపోయినా మధురాంతకదేవుడు పరకేసరివర్మ గంగైకొండ చోళరాజేంద్రుడు.

చక్రకూటరాజ్యాన్ని తమ చెప్పుచేతల్లో ఉంచుకోడానికి ప్రతిస్పర్ధులు సామ్రాజ్యస్థాపనాకాంక్షులైన కల్యాణిచాళుక్యులూ, చోళులూ. శ్రీ మూర్తిగారి సోమేశ్వరుడు కల్యాణిచాళుక్యుల కాశ్రితు డనిపించును.

ఒక శాసనంలో ఉన్నంతమాత్రంచేత అదే శిరోధార్యం అనుకోను. శాసనోక్త సంఘటనలు సంభవమా అనే జిజ్ఞాసకావాలి. కథాకాలానికి కొలనుపాక (కొల్లిపాక) వలె చక్రకూటంగూడా కీలక కేంద్రం. కాని వేంగీ, కళింగాలంత బలమైనదిగాదు. క్రీ. శ. 11 వ శతాబ్దంలో కళింగాధిపతులు ముమ్మడి వజ్రహస్తదేవుడూ; తనయుడు అర్మడి దేవేంద్రవర్మరాజరాజు—ఇద్దరూ ఉద్ధతులే. కళింగం జయించి వేంగివచ్చి జయించి దహించె నన్నంత మాత్రంలో అది సంభవమా అనే ఆలోచన శ్రీ మూర్తిగారికి రాలేదు. చక్రకూటేశ్వరుడైన సోమేశ్వరునకు కళింగ, వేంగీరాజ్యాల గెల్చేటంత శక్తి, సైన్యము వున్నవా ?

నా రెండో వ్యాసంలోనే వ్రాసాను. ఆయా యుద్ధాల్లో పాల్గొన్న సామంత, మాండలిక దండ

నాథులు విజయానంతరం — తర్వాత అధిరాజాకున్న బిరుదావళిని వాడుకొన్న ఆధారం. శ్రీ మూర్తిగారు కాదనగలరేమో గాని పరిశోధకులు కాదనలేరు. కల్యాణి చాళుక్యుల వేంగీదండయాత్రల్లో పాల్గొన్నవారిలో చక్రకూట సోమేశ్వరు డొకడుగావచ్చును.

శ్రీ మూర్తిగారు నమ్మకొన్న సోమేశ్వరుని ప్రశస్తి అతనిదై వుండదు. కల్యాణిచాళుక్యుల ప్రశస్తి అది. చోళ — కళ్యాణీచాళుక్య వైరాల్లో వేంగిలో చక్రకూటంలో రెండుపార్టీల సమర్థించే పార్టీలు రెండూ ప్రతిస్పర్ధులుగా ఉన్నారు.

ఇతీవ బెడంగ సత్యాశ్రయుని దండనాథుడు బయలుసంబి దండయాత్రలో — వేంగిలో ఎనమదలను మరోదుర్గాన్నీ దహించినట్లు పరిశోధకులు గుర్తించారు. వేంగీశ్వరుడైన శక్తివర్మ ఓడిపోలేదన్నారు. జగదేకమల్ల ఇమ్మడి జయసింహుని దండయాత్ర విమలాదిత్యుడు త్రిప్పికొట్టాడన్నారు.

కథాకాలానికి వేంగీరాజరాజు చోళులకూ, వీర విజయాదిత్యుడు కళ్యాణిచాళుక్యులకూ హితులు.

క్రీ. శ. 11 వ శతాబ్దంలో వేంగీ దహన— విజయప్రశస్తి ప్రసక్తి ఎక్కువగా కల్యాణి చాళుక్య శాసనాల్లో చూడనగును.

కేవలం వాదానిగ్గాను శ్రీ మూర్తిగారి నిర్ధారణ అంగీకరిస్తే చక్రకూట సోమేశ్వరుడు జయించిన కళింగంలో ఏమైనా ప్రతిష్ఠించెనేమో తెలిస్తే శ్రీ మూర్తిగారే వ్రాయాలి. ప్రతిష్ఠించడానికి కొంత కాలవ్యవధి పడుతుంది. ఈ చక్రకూటేశ్వరుడు ఎంత కాలం వేంగిలో ఉన్నదీ శ్రీ మూర్తిగారే చెప్పాలి. క్రీ. శ. 1065—75 మధ్య వేంగీశ్వరుడు వీర విజయాదిత్యుడు. రాజధాని నేడు తూర్పుగోదావరి జిల్లాగా వున్నచోటగాని పశ్చిమగోదావరిజిల్లాలోగాదు. చక్రకూటేశ్వరుడు వేంగిని జయించి దహించివుంటే, రాజధాని, వేంగీశ్వరుల కులదైవం భీమేశ్వరునీ వదలి పశ్చిమగోదావరిలో విజయచిహ్నంగా శ్రీ వాసుకీరవి సోమేశ్వరుని ప్రతిష్ఠించెనంటే ఆ కారణం గూడా శ్రీ మూర్తిగారే చెప్పాలి.

క్రీ. శ. 11 వ శతాబ్దంలో వేంగిని జయించిన వారు విజయచిహ్నంగాగాని వేంగిలో కొంతకాలమున్న వేంగీచాళుక్యేతరులుగాని ప్రతిష్ఠించిన వైనాలు ఏ పరిశోధకుడూ వ్రాయలేదు. వేంగీశ్వరుల హితులూ, శత్రువులూ దానధర్మాలు చేశారు. సమరైకభైరవ సత్యాశ్రయ ఇమ్మడి శక్తివర్మను జయించిన చేదిరాజు కూడా ఏమీ ప్రతిష్ఠించలేదు. భీమేశ్వరునకు కానుక నిచ్చిపోయినట్లు శాసనమున్నది. కలిదిండి శాసనాలు— మధురాంతకదేవ రాజేంద్రచోళుడు ఆదేశించెనేగాని తానై వేంగిలో ఏమీ నిర్మించనూలేదు, ప్రతిష్ఠించనూ లేదు. వేంగీరాజరాజు చోళుల కాశ్రితుడన్నారు పరిశోధకులు.

కథాకాలానికి వేంగిలో ప్రతిష్ఠ—నిర్మాణాలు చేసినవారు వేంగీశ్వరులైయుండాలేగాని ఇతరులకు అవకాశంలేదు అనే నా నమ్మకం.

దంతేశ్వరి—దూతేశ్వరి—దూతిక:-శ్రీ మూర్తిగారు కృష్ణాపుర శాసన ప్రశస్తి విశ్వసించి తమ వాదానికి బలకరంగా బస్తరు దంతేశ్వరుని జుత్తిగకు తీసుకు వచ్చారు అని రెండోవ్యాసంలో వ్రాసాను.

వేంగీశ్వరుడైన శక్తివర్మ (క్రీ. శ. 10 వ శతాబ్దం) శాసనాల్లో జుత్తిగ దంతికసీమ. ఆలయ శాసనాల్లోగల దుత్తిక జుత్తిగ అయినది. ప్రజలు క్షేత్రనామాన్నిబట్టి (అంతర్ద్వాదిక, బహిర్ద్వాతిక) చిన్నన్నగపోన్ని దూతిక అనుంటారని వ్రాసానేగాని శ్రీ మూర్తిగా రన్నారనలేదు.

శ్రీ మూర్తిగారు రెండోవ్యాసంలో మాణిక్యేశ్వరీ — దంతేశ్వరీ ఒకరేనని నే నంగీకరించినట్లు వ్రాశారు. దక్షారామ మాణిక్యేశ్వరీ, జుత్తిగ దూతిక, శ్రీ మూర్తిగారి దంతేశ్వరీ, బస్తరు దంతేశ్వరీ ఒకరేనని నే వ్రాయనూలేదు, అంగీకరించనూ లేదు. 'మాణిక్యేశ్వరి (దంతేశ్వరి)' అని నే వ్రాయుటలో నాభావం వేరు.

నాటి చక్రకూటేశ్వరుల ఇలవేల్పు మాణిక్యేశ్వరి. కతిపయకాలపు బస్తరుసంస్థానాధీశుల (దక్షిణ బస్తరు; చక్రకూట) ఇలవేల్పు దంతేశ్వరి (దత్తి, దంతి)గా పరిశోధకులు మారె నన్నారేగాని నే నంగీకరించుట కాదు. క్రీ. శ. 11 వ శతాబ్దం—1065—75 మధ్య చక్రకూటేశ్వరుల ఇలవేల్పు దంతేశ్వరియో కాదో నాకు తెల్లియదు. నాడు మాణిక్యేశ్వరే కావాలి.

రెండోవ్యాసంలో చక్రకూటేశ్వరుడే ప్రతిష్ఠించియున్న ఇలవేల్పు మాణిక్యేశ్వరికే— శ్రీ మూర్తి గారి 'దంతేశ్వరి'కే ప్రాధాన్యమిచ్చి మూలస్థానదేవరకు రెండోమెట్టు ఇచ్చేవాడని వ్రాసియున్నాను. దక్షారామంలో అమ్మవారు దిగువమెట్టులో లేదా అని శ్రీ మూర్తిగారి ఆక్షేపణ. అక్కడ వేంగీశ్వరుల కుల దైవం భీమేశ్వరుడు. చక్రకూటాన్ని సాధించి వారి కులదైవాన్ని మాణిక్యేశ్వరిగా పత్నిగా నిల్పారు వేంగీశ్వరులు అన్నారు పరిశోధకులు. జుత్తిగలో అలాంటి వేమీ లేవు సరికదా జుత్తిగ ఆలయశాసనాల్లో దంతేశ్వరి, దూతేశ్వరి, దూతిక, మాణిక్యేశ్వరి ప్రసక్తే లేదు.

కేవలం వాదాని కంగీకరించినా చక్రకూటం— బస్తరులో మాణిక్యేశ్వరి—దంతేశ్వరి అనే పేర్ల వాడుక మధ్యకాలం కొన్ని శతాబ్దాలుంటే కథాకాలానికి దక్షారామంలో మాణిక్యేశ్వరిగా వుంటే జుత్తిగలో దంతేశ్వరి, దూతేశ్వరి, దూతిక ఎందుకవుతుంది ? చక్రకూటేశ్వరుడే ప్రతిష్ఠించివుంటే ఒకేపేరిట రెండు విగ్రహాలు ప్రతిష్ఠించెనా ? జుత్తిగ దూతికలు క్షేత్ర పాలికలు గాకూడదా ? ప్రజలు క్షేత్రనామాన కతిపయ కాలాన జుత్తికబట్టి దూతిక అనియుందురే గాని చక్రకూటేశ్వర ప్రతిష్ఠిత 'దంతేశ్వరి' మాత్రంగాదు.

పూర్వం వీరులు ప్రతిష్ఠించిన దేవుళ్లకు అమ్మవారి నమర్చ లేదనీ, రౌద్ర సూచనగ్రాసు ఫాలాన నిటలాకు డనేందుకు లింగానికి లొత్త ఏర్పాటు, అందులో ఎఱ్ఱనికెంపు అమర్చే ఆచారం వుండేదనీ ఈ వరకే వ్రాశాను. కాగా ఆలయశాసనాల్లో అమ్మవారు ఉమ (దూతిక - దంతేశ్వరి, దూతేశ్వరి గాదు)ను కతిపయ కాలంలో ప్రతిష్ఠించిన వైనం తొలి వ్యాసం లోనే వ్రాసాను.

మహాకాంతారరాజ్యంలో ఒకప్పుడు స్తంభేశ్వరిని పూజించారు. ఆమె, వింధ్యవాసినీదేవి, మాణిక్యేశ్వరీ ఒకరో కాదో నాకు తెలియదు. చక్రకూట నాగ రాజులు అంతరించిన చాలాకాలానికి బస్తరు రాజులు దంతేశ్వరిని పూజించినట్లున్నది. కొందరు పరిశోధకులు ఆ మాణిక్యేశ్వరీ, నేటి బస్తరుదంతేశ్వరీ ఒకరే అని వ్రాశారు—నిర్ధారణ నాదేననుకొని శ్రీ మూర్తి గారు దక్షారామమాణిక్యేశ్వరీ 'దంతేశ్వరీ' ఒకరేనని నే నంగీకరించా ననుకొన్నట్లుంది.

జుత్తిగలో ప్రతిష్ఠిత చక్రకూటేశ్వరుడైతే చిన్నవిగ్రహం, రెండుగా అనామకంగా వుండే అవకాశం లేదు. అతడే ప్రతిష్ఠించి ఉండిఉంటే మాణిక్యేశ్వరి గానే ఉండాలి. సోమేశ్వరుని నాటి వారి ఇలవేల్పు దంతేశ్వరిపేరిట పూజింపబడెనా ? పరిశోధకులు పేరు మారిందన్నారేగాని ఏనాటినుండో వ్రాయలేదు.

చక్రకూటేశ్వరుడే అమ్మవారిని ప్రతిష్ఠించి వుంటే మూలస్థానదేవతవద్దనే ఉండాలిగాని వేర్వేరుగా 'దూతిక'లుగా ఉండరు. కాగా కతిపయ కాలాన క్రీ. శ. 13 వ శతాబ్దంలో ఏఱువనాయకులు ప్రతిష్ఠించిన ఉమ వేరుగా 'దూతిక'ల కన్న పెద్దగా నిలచి వున్నది.

శాసనాల్లోనే గాదు నేటికీ వేంగి ఆలయాల్లో కౌశికీ కార్తికేయుల సంబంధం చాళుక్యుల కెక్కువగా ఉంది. జుత్తిగ ఆలయంలో 'దూతిక' కన్న, ఉమకన్న పెద్దవిగ్రహం కుమారస్వామిది వున్నది. శారద, అనీశ్వరి, పునీశ్వరి వగైరా పేరిట చిరు బొమ్మలు విడివడిన సప్తమాతృకల్లోని వనిపించును.

వీరుడు విజయచిహ్నంగా అమ్మవారిని నిల్పి వుంటే ఉగ్రరూపం ఉంటుందన్నాను. శ్రీ మూర్తిగారి కది దుర్గ్రాహ్యంగా ఉందంటే నేనేం జెప్పను ? జుత్తిగలో సోమేశ్వరుని 'దూతిక'నూ చక్రకూటేశ్వరు దేకకాలాన్నే ప్రతిష్ఠించె నంటున్నారు శ్రీ మూర్తిగారు. దక్షారామంలో ప్రతిష్ఠితలూ ప్రతిష్ఠానకాలం నేర్వేరని నే చెప్పేలా ?

దూతిక(లు) శ్రీ మూర్తిగారికి ముఖ్యదైవంగా కాన్పించెనేమోగాని శాసనాలంతటా ముఖ్యుడు మూలస్థానేశ్వరుడే.

కరవాలభైరవ మండప నిర్మాణకాలాని కచట అమ్మవారున్న సూచనలేదు. శ్రీ వాసుకీరవిసోమేశ్వరుడు మాత్రమే మండపశాసనంలో పేర్కొనబడినాడు. కతిపయకాలపు కాకతీయులనాటి (విష్ణువు) శాసనంలో వాసుకిని ప్రతిష్ఠించుట—ప్రజలు చెప్పుకునే వాసుకీ సూర్యచంద్రు లన్నట్లుగానే వున్నది. చక్రకూటం కాకతీయులు ఎరుగనిదిగాదు. చక్రకూటేశ్వరుడు,

దంతేశ్వరి వగైరా సంబంధం ఉండిఉంటే వీరభద్రరాజు మంత్రి, విష్ణువు, ఆ విషయం పేర్కొనేవాడేమో!

శ్రీ మూర్తిగారు తెచ్చిపెట్టిన దంతేశ్వరి వగైరా జుత్తిగలో మూలస్థానేశ్వరుని భార్యగాదు సరిగదా ఏనాడూ ముఖ్యదైవతంగాదు. వారి రెండు వ్యాసాలూ చూచాక నాకూ 'ధర్మసందేహం' కల్గింది.

క్రీ. శ. 1065 తర్వాత 'వేంగిని జయించి, దహించిన' చక్రకూటేశ్వరుడు నాటి వేంగిరాజధాని పరిసరాలు వదలివచ్చి జుత్తిగ (దుతిక, దుత్తిక)లో ప్రతిష్ఠించాడే అనుకొందాం. ఆ పొగలు—సెగలు ఆరక ముందే తన రాజ్యంలో తన శత్రువు (1065—75 మధ్య వేంగీశ్వరుడు విజయాదిత్యుడు) ప్రతిష్ఠించిన దేవుని ఎదుట రాజధానీ పరిసరాలు, (కులదైవం భీమేశ్వరుని) వదలి క్రీ. శ. 1074 ప్రాంతాల్లో వీరవిజయాదిత్యుడు స్మారకచిహ్నంగా కరవాలభైరవ మండప మెత్తించుట సంభవమా?

శ్రీ మూర్తిగారి—ప్రతిష్ఠాత చక్రకూటేశ్వరుడనే సిద్ధాంతం అసహజం, అసంభవం అనిపించినందున రెండోవ్యాసం ప్రచురించాను. శ్రీ మూర్తిగారి 'జుత్తిగ దేవుని ప్రతిష్ఠాత చక్రకూటేశ్వరుడు కాడా ?' రెండోవ్యాసంలో కాడనే సందేహం వారికీ కల్గిన సూచన లేకపోలేదు.

క్రీ. శ. 1065 తర్వాత సమీపకాలంలో వేంగిపై నెత్తివచ్చినవి చోళసైన్యాలు. వాటిలో చక్రకూటసోమేశ్వరుడుండుట అసంభవం. కాగా ఆ యుద్ధంలో చోళరాజు జయించలేదనీ, శత్రువైనా వీర విజయాదిత్యునికి బాసటగా కళింగరాజరాజు వచ్చెననీ, ఒకవిధమైన సంధి జరిగెననీ, చోళరాజు పుత్రిక రాజసుందరి కళింగరాజరాజుకు భార్య అయినదనీ పరిశోధకులు వ్రాశారు. నా రెండో వ్యాసంలో కళింగ దండనాయకుడు వనపతిని పేర్కొన్నాను.

కరవాలభైరవమంటప నిర్మాణకాలాని కచట పేర్కొనబడినది—క్రీ. శ. 11 వ శతాబ్దపు ఆలయ శాసనాల్లో ప్రసక్తికి వచ్చినదీ—ఒక్క సోమేశ్వరుడే. క్రీ. శ. 12—13 శతాబ్దాలనాటి శాసనాల్లో ఉమ, అల్లాడీశ్వర, భృంగీశ్వరుల ప్రసక్తిమాత్రమే ఉన్నది. ఒక్క ఉమాదేవినిగూర్చి దప్ప ఇతరమూర్తుల ప్రతిష్ఠ తల తెల్పే శాసనాలు లభించలేదు. అదంతా తొలి వ్యాసంలోనే వ్రాశాను. జుత్తిగలో ఇతరదైవాల ప్రతిష్ఠాపనగూర్చిన వివరాలు శ్రీ మూర్తిగారికి తెలిసి వుంటే ప్రకటించగలరు.

ప్రతిష్ఠాపనలు, దేవాలయనిర్మాణాలు తెలిపే శాసనాలు చాలాచోట్ల లేవనే సంగతి శ్రీ మూర్తిగా రెరుగరా? కొన్నిసందర్భాల్లో ఆలయం ఒకచోట, శాసనం వేరొకచోట; నిర్మాణ—ప్రతిష్ఠాపనాకాలం ఒకటి, వాటి వివరాలిచ్చే శాసనాలు వేరొకచోట, వేరొక కాలానివిగా ఉన్నవి. కొందరు దేవుని ఆకారం, పేరు వగైరాబట్టి 'జాతకాలు' వ్రాశారు. కొన్నిసందర్భాల్లో అంతకుముందున్న పేరుమార్చి మరోపేరు పెట్టడం జరిగింది. ప్రతిష్ఠించిన దొకరైతే గుడి కట్టించినది వేరొకరు. చేర్పులు, మార్పులు, ఆలయాలచరిత్రలో ఉండుట పరిశోధకు లెరుగుదురు.

ముగ్గురు వ్యక్తుల సూచించేదిగా ఉందా అనే నా సందేహాన్నొక సిద్ధాంతంగా తీసుకున్న శ్రీ మూర్తిగారు స్వీయసిద్ధాంతాల్లో ఇర్వురుని సూచించేదిగా చేసిన సిద్ధాంతం ఇంత రాద్ధాంతాని క్కారణం — ఇర్వురిని సూచించుటలో మూడుపేర్లు అసహజం అనిపించింది.

వీరవిజయాదిత్యునికి రాజరాజు వేంగీశ్వరుడుగా నున్నప్పుడు ఆదిలో పశ్చిమగోదావరి—పానార విషయ భాగం బలమైన కేంద్రంఅని లోగడే వ్రాశాను. ఉచంట సంబంధం వ్రాశాను.

జుత్తిగదేవుని ఎదుట మండప మెత్తించుటలో—కులదైవం భీమేశ్వరుని వదలి సోమేశ్వరుని ఎదుట—దేవునికీ వీరవిజయాదిత్యునికీ ప్రాంతీయ బలమేగాక మరో సంబంధంఏదో ఉండి వుండు నని పించక పోదు. నా రెండోవ్యాసంలో శక్తివర్మ శాసనంలో పేర్కొనబడిన సలికేశ్వరనామ మహాదేవుని పేర్కొన్నాను. ఆ సలికేశ్వరుడే శ్రీ వాసుకీరవిసోమేశ్వరు డగునో కాదో పెద్దలు నిర్ణయించాలి. అలాగే ప్రతిష్ఠించుటనుగూర్చి నేటివరకే శాసనాధారం లభించకపోయినా ఆ సలికేశ్వరుడు లేక మరొకపేరిటి దేవునిపేరు ముగ్గురుపేర్లు సూచించేదిగా వీర విజయాదిత్యుడే మార్చెనేమో పరిశోధనీయమే.

కళ్యాణి సోమేశ్వరుడు క్రీ. శ. 11 వ శతాబ్దం పూర్వార్థంలో వీరవిజయాదిత్యునికి బహుధా హితుడు. వీరవిజయాదిత్యుని పాములవాక శాసనం నాగకులభీముని గూర్చినది. ఈ సందర్భంగా పేరు మార్చినా ప్రతిష్ఠించినా వీరవిజయాదిత్యుని కున్నంత అవకాశం దాడిచేసి పోయిన వాని కుండదు. కాగా కథాకాలాన వేంగేతరులు వేంగిలోచేసిన నిర్మాణాలు, ప్రతిష్ఠాపనలు నా దృష్టికి రాలేదు—ఒక్క శ్రీ మూర్తిగారి సిద్ధాంతం తప్ప.

చక్రకూటేశ్వరుని ప్రశస్తి సంఘటనలుగా శ్రీ మూర్తిగారిని నమ్మించిన కృష్ణాపుర శాసనస్థ విషయాలు మరే రెండో శాసనంలోనైనా ఆ సోమేశ్వరుని పరంగా ఉన్నవా ?

కరవాలభైరవ మండపం క్రీ. శ. 1031–35 మధ్యకాలపు విజయచిహ్నం అన్నాను. కాదు క్రీ. శ. 1074 దంటారు శ్రీ మూర్తిగారు. వారలా అనుకోడానికీ అవకాశాలున్నాయని నా రెండో వ్యాసంలో వివరించాను. నా తొలివ్యాసం ర్యాలిశాసన విషయాలెరిగి వ్రాసినదనే విషయం ఆ వ్యాసంలోనే సూచితం. శ్రీ మూర్తిగారు రెండో వ్యాసంలో చూపిన 'డిస్కవరీ' కరవాలభైరవ మండపాన్ని స్మారక చిహ్నంగా నిర్ధారణ చేయటం.

ఆలయశాసనాల్లో మండపస్తంభంపై వీరవిజయాదిత్యుని అసంపూర్ణ శాసనం కనుమరుగై వుంటే అందరూ క్రీ. శ. 1255 లో ఉమాదేవిని ప్రతిష్ఠించిన ఏటువనాయకులే కరవాలభైరవ నిర్మాతలనుకునేవారు.

సమకాలిక, సమీపకాలిక, పూర్వకాలీనుల్లో విజయాదిత్యు లనేకులున్నారు. కాని కరవాలభైరవ బిరుదాంకితు డీ మండపనిర్మాత మాత్రమే. లభించిన శాసనాల్లో జుత్తిగ మండపశాసనం, ర్యాలి శాసనాలు వీరవిజయాదిత్యు డన్నవి. పాములవాక శాసనం, దక్షారామ సోమలదేవిశాసనం, ఇమ్మడిశక్తివర్మ శాసనాల్లో 'వీర'వినా విజయాదిత్య, బెజయితదేవగా ఉన్నది.

అలాగే ర్యాలిశాసనాల్లో కరవాలభైరవ బిరుదాంచితుడుగా వున్నాడు. జుత్తిగ శాసనంలో వీరవిజయాదిత్యు డెత్తించి నట్లున్నదేగాని ఆ బిరుదు లేదు.

పాములవాక శాసనంలో రాజరాజు 12 సంవత్సరాలు పాలించాక పదచ్యుతుడు గావడం కొంపాలొంగు వగైరా గ్రామాలు వీరవిజయాదిత్యుడు భీమరాజు కీయటం వుంది. జుత్తిగ మండపశాసనం (13 వ రాజ్యవర్షం) పాములవాక శాసన సమీపకాలానిదిగా దలచాను. వీరవిజయాదిత్యునివిగాని నాటివిగాని మరికొన్ని శాసనాలు లభించనిదే నిర్ధారణ కనువుగాదు - అంతా ఊహగా వ్యవహరించాలి.

శ్రీ మూర్తిగారు పేర్కొన్నవన్నీ కాదనడ నికి కంకణం కట్టుకోలేదు; కొన్ని విషయాలు ఆలోచనీయం, పరిశోధనీయం; కాదనను—

క్రీ. శ. 11 వ శతాబ్ది శాసనాలు— ఈ కథాకాలానికి సంబంధించినవి కొన్నిటి పరిగణన శకవర్షాలుగా, కొన్ని విజయరాజ్య వర్షాలుగా, కొన్ని శకవర్షంతోపాటు విజయరాజ్య సంవత్సరాలుగాఉన్నది. క్రీ. శ. 1072 ప్రాంతపు ర్యాలిశాసనాల్లో 'విజయరాజ్య సంవత్సరద్వాదశే' రాజరాజు మరణము, వీరవిజయాదిత్యుని విజయము, ఇమ్మడి శక్తివర్మ పాలనాకాలం సూచించేదే—

పరిశోధకాభిప్రాయంలో కరవాలభైరవుని విజయం క్రీ. శ. 1031 ప్రాంతం, మరల క్రీ. శ. 1059 ప్రాంతం. అయితే క్రీ. శ. 1035 తర్వాతగూడా పరగండభైరవ—కరవాల భైరవుల మధ్య యుద్ధాలు జరిగినట్లు, మరో రెండుమూడు సార్లు రాజరాజు చోళులరాజ్యంలో తలదాచుకున్నట్లు

కొందరు పరిశోధకులు వ్రాశారు. కాని పరిశోధకులెవరూ వీరా బిరుదులుదాల్చిన కాలనిర్ణయం చేయలేదు. దాయాదుల నిర్జించి పరగండభైరవుడై రాజరాజు క్రీ. శ. 1022 ప్రాంతాన పట్టాభిషిక్తుడైనాడన్నారు. పరగండభైరవునిగెల్చి వీరవిజయాదిత్యుడు కరవాలభైరవ బిరుదు దాల్చెనన్నారేగాని ఏనాటి గెలుపో నిర్ధారణలేదు. మొదటి విజయానికే ఆ బిరుదు దాల్చియుండరాదా? పరగండభైరవుని 12 సంవత్సరాల పాలనానంతరం రాజ్యం లాక్కొని కరవాలభైరవుడైనాడనే దలచాను. కరవాలభైరవ బిరుదు ర్యాలిశాసనాల్లో మాత్రమే ఉన్నందున క్రీ. శ. 1059–60 గెల్పుతర్వాతనే ఆ బిరుదు దాల్చాడనేందుకూ అవకాశం లేకపోలేదు. అలాగే క్రీ. శ. 1065–6 ప్రాంతాలనాటి చోళ దండయాత్ర (కళింగరాజరాజు బాసటకాగా) నరికట్టి ఆ బిరుదు దాల్చెననీ అనుకోవచ్చును. ర్యాలి శాసనాల పూర్వపువాటిలో లేకున్నా పరగండభైరవుడై పట్టాభిషిక్తుడైన రాజరాజుపై తొలిగెలుపులోనే కరవాలభైరవబిరుదు దాల్చాడని నా నమ్మకం.

ర్యాలి శాసనాల్లో కరవాలభైరవుడు 'సంతానబలాయురారోగ్యైశ్వర్యాభివృద్ధ్యర్థం'గా తూర్పుగోదావరిజిల్లాలో గ్రామాలు దానం చేసినట్లుంది. క్రీ. శ. 1060 తర్వాత వీరవిజయాదిత్యుని మకాం తూర్పుగోదావరి.

మొదటి వ్యాసంలో ప్రసక్తిలేని విషయం శ్రీ మూర్తిగారు బహుశా తమ సిద్ధాంతబలార్థం— కరవాలభైరవ మండపాన్ని స్మారకచిహ్నం జేసిన వృత్తాంతం చెప్పారు.

క్రీ. శ. 1044 ప్రాంతాల్లో నిర్మించాడని నేనంగీకరించినా (అంగీకరించను), చరిత్ర వప్పుకోదంటారు శ్రీ మూర్తిగారు. అందుగ్గాను 'నిస్తేజితవైరివీరుని' రెండో వ్యాసంలో ప్రవేశపెట్టారు.

రాజరాజును 'నిస్తేజితవైరివీరుని' జేసినది నన్నయ. అదైనా 'ఆంధ్రమహాభారతం'లోఅని జ్ఞాపకం. పరిశోధకాభిప్రాయాలబట్టీ చరిత్రబట్టి రాజరాజు నిస్తేజితవైరివీరుడుగా వున్నది క్రీ. శ. 1021–31 మధ్య, క్రీ. శ. 1035—42 మధ్య, క్రీ. శ. 1048 తర్వాత, క్రీ. శ. 1058 పూర్వం అనుకుంటాను. ఈ ఇద్దరు బిరుదులు దాల్చిన కాలనిర్ణయం సూచించే అదేకాలపు ఆధారాలు లేనంతవరకూ అంతా ఊహే కాని నిజంగా తీసుకోలేము.

కథాకాలపు శాసన కవులు వేర్వేరైనా లేఖకులు ఒక్కరుగానే వున్నట్లుంది. వీరవిజయాదిత్యుని శాసనలేఖరి గోకాచార్యుడు ర్యాలిశాసనాల్లో మాత్రమే కరవాలభైరవునిగా పేర్కొన్నాడు.

వీరవిజయాదిత్యుడు అన్ని శాసనాల్లో వీరవిజయాదిత్యుడు, కరవాలభైరవుడుగా పేర్కొనబడలేదు. అలాగే రాజరాజు అన్ని శాసనాల్లోనూ పరగండభైరవుడుగా ప్రస్తుతింపబడలేదు. సమీపకాలికాలైన మూడుశాసనాలుచూస్తే కలిదిండి శాసనంలో 'పరగండ భైరవు' డున్నాడు. రాజరాజు లేఖరి గండయాచారి.

కాబట్టి వారిర్వురి బిరుద ధారణాకాలం నిర్ణయింపబడినగాని ప్రస్తుతాంశం ఒక కొలిక్కిరాదు.

పరిశోధకులు రాజరాజు క్రీ. శ. 1035 ప్రాంతాల్లో వీరవిజయాదిత్యుని ఓడించి బందీగా వుంచి భ్రాతృవాత్సల్యంచేత వధించక విడిచి పుచ్చాడని వ్రాశారు. ఎంతకాలం బందీగా వుంచాడు? ఎప్పుడు విముక్తుణ్ణి చేశాడు? తెలీదు.

శక్తివర్మ పాలనాకాలాన విమలాదిత్యుడు యువరాజు. రాజరాజు భ్రాతృవాత్సల్యం వీరవిజయాదిత్యుని యువరాజు చేయించక రాజేంద్రచోడుని కా అర్హత కల్గించడం అంటే చోళరాజు కహితుడుకాలేక అనవచ్చును. పరిశోధకులనే భ్రాతృవాత్సల్యం సంగతి ఎలా వున్నా రాజరాజు రాజనీతి మెచ్చుకోవాలి— వీరవిజయాదిత్యుని బందీగా వధించి వుండివుంటే అనేకాంతఃకలహాలు కల్గేవనే నా ఊహ.

వీరవిజయాదిత్యుడు వేంగిలో వున్నంతకాలం రాజరాజు నిస్తేజితవైరివీరుడు కాడనుకునే వారిలో నేనొకడిని.

రాజరాజు నిజంగా నిస్తేజిత వైరివీరుడుగా నున్నది క్రీ. శ. 1035–44 మధ్యగాదు. కల్యాణీ చాళుక్యులకు హితుడై— కలిదిండి యుద్ధానంతరం— కళ్యాణీచాళుక్యప్రతినిధి నారాయణభట్టు వేంగిలో

వుండగా, వీరవిజయాదిత్యుడు కల్యాణీచాళుక్య రాజ ప్రతినిధిగా నోలంబవాడిని పాలించినప్పుడు, నన్నయ 'మహాభారతం' ఆంధ్రీకరించిన కాలాన క్రీ. శ. 1051—7 మధ్యనే రాజరాజు నిస్త్రైజిత వైరి వీరుడు అని నా నమ్మకం.

పాములవాక శాసనంబట్టి, జుత్తిగ మండప శాసనం 13 వ విజయరాజ్య సంవత్సరం వీర విజ యాదిత్యుని మొదటి విజయంబట్టి కరవాలభైరవ మండప నిర్మాణకాలం విజయచిహ్నం; క్రీ. శ. 1031—5 మధ్య కాలానిదనే నా నమ్మకం. ఈ విజయరాజ్య సంవత్సరం రాజరాజు సంబంధం. ర్యాలి శాసనాలబట్టి జుత్తిగ మండపశాసనం 13 వ విజయ రాజ్య సంవత్సరం క్రీ. శ. 1073 ప్రాంతానిదగును. కాదనను కాని అది క్రీ. శ. 1031—5 మధ్యదీ, విజయచిహ్నం అనే నా నమ్మకాన్ని నిరూపించ లేక పోతున్నా, స్మారకచిహ్నం గాదనీ, క్రీ. శ. 1074 ప్రాంతానిదిగాదనే నమ్మకము శ్రీ మూర్తిగారు వమ్ము చేయలేరు.

వేంగీశ్వరులందరూ సర్వలోకాశ్రయులూ, విష్ణువర్ధనులే—జుత్తిగ శాసనాల్లో శకవర్ష విజయ రాజ్య సంవత్సరాలు - రెండూ పరిగణించిన శాసనాలు బట్టి (క్రీ. శ. 1069, 1075, 1126) ఏ విష్ణువర్ధన—సర్వలోకాశ్రయుడు జయించినదీ, మర ణించినదీ, పట్టాభిషిక్తుడైనదీ ఒక్క శాసన పరిశోధ కులు మాత్రమే చెప్పగల విషయం.

కలవాలభైరవమండపం త్వరితగతిని నిర్మిం చారనుకొన్న కారణం శిల్ప ప్రాధాన్యత లేకపోవడం— వీరవిజయాదిత్యుని శాసనం అసంపూర్ణం. క్రీ. శ. 1031—35 మధ్య నిర్మితమై వుంటే క్రీ. శ. 1060 తర్వాత వేంగీశ్వరుడైయున్న కరవాల భైర వుడు ఏ కారణాన శాసనం పూర్తి జేయించలేదంటే క్రీ. శ. 1059 వరకతని ఇబ్బందులో, వేంగిలో లేకుండుటో తర్వాత రాజుగా తూర్పు గోదావరిజిల్లాలో నుండుటయో, శ్రీ మూర్తిగారు పేర్కొన్న మనః క్లేశాలు, వృద్ధాప్యం వగైరాలో గావచ్చును.

క్రీ. శ. 1074 లో స్మారకచిహ్నంగా కరవాల భైరవ మండప నిర్మాణం జరిగెనన్న శ్రీ మూర్తి గారు క్లేశాలు, యుద్ధాలు, వృద్ధాప్యం కారణాలుగా శాసనం అసంపూర్తిగా ఉండిపోయెననేందుకూ అదే ఆధారం గావచ్చును.

ర్యాలి శాసనాధారంతో (క్రీ. శ. 1012) సమీపకాలంలో వీరవిజయాదిత్యుడు కరవాలభైరవ బిరుదాంకితుడైనాడు అనేందుకు సాధించిన విజయం లేదుగా? ఏదైనా ఉన్నదా? ఇమ్మడిశక్తివర్మ పట్టాభి షేక కాలానికీ బిరుద సంబంధం ఎంతవరకున్నది?

నేను మొదటినుండీ కరవాలభైరవ మండపం వీరవిజయాదిత్యుని విజయచిహ్నం అంటున్నాను. శ్రీ మూర్తిగారు మొదటి వ్యాసంలో నిర్మాణకాలం క్రీ. శ. 1074 ప్రాంతానిదన్నారేగాని స్మారక చిహ్నంఅనే సూచనకూడా ఇవ్వలేదు. కాని రెండో వ్యాసంలో దానికి 'స్మారకచిహ్నం' ముద్రవేశారు, అందుకనువైన విషయాలు జోడించారు.

ర్యాలిశాసనాల్లో వీరవిజయాదిత్యుని ఆందోళన పుత్రవాత్సల్యంవున్నాయి. వేంగిని జయించి పట్టంకట్టిన జ్యేష్ఠపుత్రుడు వీరస్వర్గం వేంచేశాడు. ఈన అనం తరం పసివాడు రాజు కాగలడన్నది వీరవిజయాదిత్యుని కున్నదా అనేదే సందేహాస్పదం.

రోగనివారణకు, ఆరోగ్యానికి బ్రదికినంత కాలం ఆశతో ఎన్నోచికిత్సలు, మూఢనమ్మకాలు శాంతులు, దానధర్మాలు వగైరాలు— చిరకాలంనుండీ ఉన్న సార్వజనీనాచారం. రోగి మరణిస్తే ఏడ్చి ఊరు కోడం, ఏటా జ్ఞాపకాలు వగైరాలు ఉంటున్నవి.

వీరవిజయాదిత్యునివంటి కార్యశూరుడు, యోధుడు, బహుశా తన అనంతరం వేంగీశ్వరుడు రాజరాజు పుత్రుడని గ్రహించియే వుండును. బాల్పు మరణానికి బేలపడిపోయివుండునా?

స్మారక చిహ్నాలుగా అనేక నిర్మాణాలు, తోటలు, పుణ్యకాలాల్లో దానాలు ఉన్నాయి. మరణించిన వానిని ఖననం లేక దహనం చేసిన చోటు గోరీలు, తులసి కోటలు, నందిని నిల్పే ఆచారం నేడూ ఉంది.

అయితే సార్వజనీనాచారంగా, అపకర్మల చేయించే వారి లెఖ్ఖనూ మరణించినవారుపిన్నలైతే అంత పట్టింపు తంతు తతంగా లుండవంటారు.

ర్యాలి శాసనాల్లో దానధర్మ కారణాలున్నవి. ఆ బాలు డెప్పుడు మరణించినదీ, మరణించిన వానికై స్మారక చిహ్నాల నెలకొల్పటం రికార్డు కాలేదు. మరణించినది రాజధానిలో గావచ్చును. నాయనమ్మ యింట (ఆచంట) గావచ్చునుగాని జుత్తిగలో అయివుండదు. ఏ పరిశోధకుడూ వ్రాయలేదు. అదీగాక తూర్పుగోదావరిలోని వీరవిజయాదిత్యుడు పశ్చిమగోదావరిలో 'స్మారక చిహ్నం' ఎందుకు నిల్పెనో తెలియదు.

మండపా లెత్తించటం నాటి సమకాలిక, సమీపకాలపుటాచారంలో విజయచిహ్నమనీ, స్మారక చిహ్నాలుగా మండప నిర్మాణాలానాడు జరుగలేదనీ నమ్ముటకు నాకు మరో ఆధారం; స్మారక చిహ్నం అయిఉంటే ఏ మాదిరి సంతాపాది సూచనలు లేక కేవలం ప్రతాప సూచనగల 'కరవాల భైరవ' అనే పేరుండదే.

క్రీ. శ. 11 వ శతాబ్దంలో విమలాదిత్యునికి రాజరాజుగాని వీరవిజయాదిత్యుడుగాని స్మారక చిహ్నాలుగా మండపా లెత్తించలేదు. వీరస్వర్గం పొందిన ఇమ్మడి శక్తివర్మకు స్మారకచిహ్నంగా వీరవిజయాదిత్యుడే మండపం ఎత్తించలేదు. రాజరాజుకుగాని వీరవిజయాదిత్యునికిగాని స్మారకచిహ్నంగా కులోత్తుంగచోళు (రాజేంద్రచోడ) డేవిధమైన మండపము ఎత్తించలేదు.

అతిపురాతనంగా స్మారకచిహ్నా లున్నవి. బౌద్ధులస్తూపాలు చాలా స్మారకచిహ్నాలే—మరణించిన వారి పుణ్యంకోసం, సద్గతీ వగైరాలకోసం దానధర్మాలు చేయడం వగైరా బౌద్ధులనుండి నేర్చిన ఆచారం. బౌద్ధులు నాడు ప్రభువుల పుణ్యార్థం, ఆయురారోగ్యైశ్వర్యార్థం దానధర్మాలుచేసే ఆచారం విజయపురి — నాగార్జునకొండ చరిత్రల్లో ఉంది. జుత్తిగ, నత్తారామేశ్వరం ఆలయ శాసనాల్లోగూడా గుడికట్టించటం, పూదోటదానం, దీపదానం వగైరా ఉన్నాయేగాని మండపనిర్మాణమైనం లేదు.

నాటి సమకాలిక — సమీపకాలపు స్మారక చిహ్నాలు అఖండ దీపదానాలు, అగ్రహార దానాలతో పాటు లింగప్రతిష్ఠ— ఆలయ నిర్మాణంగా ఉన్నదేగాని మండపనిర్మాణం లేదు.

ఒకానొక కలిదిండియుద్ధంలో రాజరాజుకు రాజేంద్రచోళమధురాంతకదేవుని సేనాసహాయం అపారం అన్నారు పరిశోధకులు. క్రీ. శ. 1053 నాటిదన్నారా శాసనకాలం. కర్ణాట (కళ్యాణిచాళుక్య) సైన్యాలచే నిహతులైన దండనాయకులు ముగ్గురుకూ స్మారకచిహ్నంగా రాజరాజు కలిదిండి మరో రెండు గ్రామాలు కలిపి మధురాంతక నల్లూరనే పేరు పెట్టి దానంచేస్తూ చేసినది లింగప్రతిష్ఠ; ఆలయ నిర్మాణమూ మండప మెత్తించలేదు.

'...ద్రమిల మణ్డలనాథానాం రాజరాజ బ్రహ్మ మహారాజ నామధేయో స్వమాతులస్య మధురాంతక దేవస్యాతులాదేశం ప్రాప్య కర్ణాటదణ్డనాథైర్యుద్ధ్వా త్రైరేవపాద్ధం దివంగతవా నాశ్విన ... కలిదిణ్డిగ్రామే రాజరాజేశ్వర మితి శివాయతన...'

ఈ కలిదిండి శాసనం—మరణించిన చోళసేనానాయకులకు స్మారకచిహ్నం వేంగిలో వేంగీశ్వరుడు చోళరాజు ఆదేశంపై దేవుని ప్రతిష్ఠించి ఆలయం కట్టించెనన్నారేగాని మండపం గాదు.

జుత్తిగ మండపం విజయచిహ్నం అంటూన్న నేను రెండో వ్యాసంలో చిన్న 'క్లూ'గా బసపతిని పేర్కొన్నాను.

ఆహవమల్ల సోమేశ్వరునికి వీరవిజయాదిత్యుడు అంకకాడు. అంతరంగికుడు. రాజుబదులు పోరే వీరుడు, అంతరంగికుడు. సమకాలికులు భువనైకమల్ల ఇమ్మడి సోమేశ్వరుని, త్రిభువనమల్ల ఆర్మడి విక్రమాదిత్యుని నాటికి వీరవిజయాదిత్యుడు సర్వస్వతంత్రుడు—రాజరాజు మరణానంతరం పాలించిన వీరవిజయాదిత్యుని కడుపులో చల్ల కదలకుండా ఉంచనివాడు చోళరాజు. వేంగిని రాజరాజు నాటివలె చోళరాజ్యాశ్రితం చేయ నిశ్చయించిన వీరరాజేంద్రచోళుడు అపారసైన్యాలతో వేంగిపై క్రీ. శ. 1066 ప్రాంతాల ఎత్తివచ్చాడు. కీర్తిమాత్రకంగా వీరవిజయాదిత్యుని తిరిగి తానే పదస్థుని చేసినట్లు వీరరాజేంద్రచోళుడు చెప్పు

కున్నను జరిగినది సంధి. ఆ సందర్భంలో వీర విజయాదిత్యునికి బాసటగా నిల్చిన, కళింగరాజరాజు చోళ రాజసుందరి నుద్వహించినట్లున్నది. క్రీ. శ. 12 వ శతాబ్దపు కళింగ శాసనాల్లో (అనంతవర్మ చోడ దేవగంగు — కళింగరాజరాజ రాజసుందరీ పుత్రుడుగూడా) ఆ విషయం ఉన్నది.

కళింగరాజరాజు దండనాయకుడు బణపతి. ఈతని దీర్ఘాసిశాసనం క్రీ. శ. 1075 నాటిది. ఈ బ్రాహ్మణవీరుడు '...ఆజావసౌ చోడనృపస్య సేనా మహావనస్యాశ్వమృగాకులస్య మత్తేభ సార ద్రుమ ......దావానలోభూ చ్చలమర్తిగండ'

ఈ ద్రమిళాహవవిజయచిహ్నంగా వనపతి 'సేనాని చేసినపని' దీర్ఘాసి భగవతీదేవి దేవాలయంబున ముందటం గడు ఘనతరమున మణ్డపం బెత్తించె భణ్డన విజయుణ్డు గణ్డగోపాలు ణ్డఖణ్డవర్తి దీవియబెట్టె నద్దేవికి...'

కరవాలభైరవ మండపం స్మారకచిహ్నంగా దంటున్నాను. విజయచిహ్నం అంటున్నాను.

కృష్ణాపుర శాసనం నమ్మిన శ్రీ మూర్తిగారు చేసిన సిద్ధాంతంతో ఎలా ఏకీభవించగలను? వేంగీ దహనాది బిరుదులు చక్రకూట సోమేశ్వరునివి గావనీ, కల్యాణిచాళుక్యులవనే విషయం ఎరుగవచ్చును. శాసనా లన్నీ శిరోధార్యాలని నేననుకోను. అందలి విషయాలు ఎంతవరకు నమ్మదగినవని ఆలోచించాలి.

జుత్తిగకూ ఆలయాలకూ చక్రకూట సోమే శ్వరునికీ, శ్రీ మూర్తిగారు తెచ్చిపెట్టిన దూతేశ్వరికీ సంబంధంలేదు—కరవాలభైరవ మండపం స్మారక చిహ్నంగాదు విజయచిహ్నం—క్రీ. శ. 1031–5 మధ్యకాలానిది—అనే నా నమ్మకం. జుత్తిగదేవుని ప్రతి ష్ఠాత వీరవిజయాదిత్యుడేననే సందేహమేగాని నా నిర్ధా రణగాదు.

అవన్నీ సిద్ధహస్తులైన పరిశోధకులు నిర్ధా రణ చేయదగినవి.



గ్రంథ విమర్శలు

"కేశవసుత్"

[గ్రంథకర్త: ప్రభాకర్ మాచ్వే; ఆంగ్లీకర్త: ఎస్. సదాశివ, ప్రచురణ కర్తలు: కేంద్రసాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ, 1970; పేజీలు: 64; వెల: రూ. 2–50.]

భారతీయ సాహిత్యనిర్మాతలు అనే వరసలో వివిధ భారతీయభాషలలో మహాకవులనుగురించి సమర్థులైనవారిచేత ఇంగ్లీషులో పుస్తకాలు రాయించి కేంద్ర సాహిత్యఅకాడమీ ప్రకటిస్తున్నది. ఈ వరసలో వార్ల వెంకటేశ్వరరావుగారు వేమన వీరేశలింగం గార్ల గురించి రాసిన పుస్తకాలు ఇంతకుముందే వచ్చినై. ఇప్పుడు గురజాడ అప్పారావుగార్నిగురించి రాస్తున్నారు. గిడుగు రామమూర్తి పంతులుగారినిగురించి అడపా రామకృష్ణ రావుగారిచేత రాయిస్తున్నారు. ఈ పుస్తకాలను మళ్లీ వివిధభాషల్లోకి అనువదించే ప్రణాళికకూడా ఒకటుంది. అట్లా తెలుగులోకి అనూదితమైన పుస్తకమే ఈ 'కేశవ సుత్'.

కేశవసుత్ (1866–1905) పందొమ్మిదో శతాబ్దపు మరాఠీకవి. వీరేశలింగంగారికి, గురజాడ అప్పారావుగారికి సమకాలికుడు. ఆంగ్ల విద్యాప్రభావం వల్ల బయలుదేరిన భారత సాంస్కృతిక పునరుజ్జీవన కాలానికి సంబంధించినవాడు. ఆధునికభావాలు, ప్రజాస్వామ్యభావాలు ప్రచారం చేసినవాడు. బ్రహ్మ సమాజ మతాభిమానిలా కనిపిస్తాడు. ఈ కవి జీవితం—సాహిత్యం గురించి 35 పేజీల వ్యాసం ఈ పుస్తకంలో ఉంది. అతని 14 కవితలకు తెలుగులో చేసిన అనువాదాలుకూడా ఉన్నై. దీన్నిబట్టి ఈ కవి జీవితవిశేషాల్ని, కవిత్వాన్ని మనం తెలుసుకోవచ్చు.

ఈ పుస్తకంలో కవిని మెచ్చినవారి అభిప్రాయాలనేగాక, మెచ్చనివారివిగూడా ఇయ్యటం ఈ పుస్తకంలో ప్రత్యేకించి చెప్పుకోదగిన విశేషం.

భారతీయ మేధావులు ఇంగ్లీషువారి ప్రజాస్వామ్యాదర్శాలవల్ల ప్రభావితమయి 19 వ శతాబ్ది నుంచి సంస్కరణభావాలు ప్రచారం చేశారు. సాంఘిక దురాచారాల్ని ఖండించటం అందులో ఒకభాగం. ఈ కాలపు భిన్నభాషారచయితల్లో కొన్నిసామాన్య లక్షణాలున్నై. వాటిని ఈ కిందివిధంగా వేరుచేసి చూపించవచ్చు. 1. సంఘసంస్కరణ, 2. దేశభక్తి, 3. ప్రకృతి ప్రశంస, 4. విశ్వమానవప్రేమ, 5. అశరీరప్రణయం (Platonic love). ఇవన్నీ 'కేశవసుత్' కవిత్వంలో ఉన్నట్టుగా మనం ఈ పుస్తకాన్నిబట్టి గ్రహించవచ్చు. తెలుగులో సంఘసంస్కరణ ప్రధాన లక్ష్యంగా వీరేశలింగంగారు రచన చేశారు. వీరిద్దరిమీదా బ్రహ్మ సమాజమతంవారి ప్రభావంఉంది. గురజాడ అప్పారావుగారి కవిత్వంలో పైన పేర్కొన్న లక్షణాలన్నీ ఉన్నై. అందువల్ల కేశవసుత్, అప్పారావుగారి భావాలకు సామ్యం కనిపిస్తుంది. వాటిలో కొన్ని ఈ సమీక్షలో ప్రస్తావించబడతై.

కేశవసుత్ గురజాడ అప్పారావుగారికన్నా కవితా రచనలో కొంత సీనియర్. అప్పారావుగారి కవితా రచనాకాలం 1910 ప్రాంతం. కేశవసుత్ రచనల్లో కొన్ని 19 వ శతాబ్దం దాటినా, ఎక్కువభాగం 19 వ శతాబ్దపు చివరి సంవత్సరాల్లో రాసినవే. అయితే అప్పారావుగారు కేశవసుత్ కవిత్వాన్ని చదివారనటానికి ఆధారాలు లేవు. వీరి కవిత్వాలమధ్య సామ్యం కాలప్రభావంవల్ల వచ్చిందే.

అప్పారావుగారు వర్ణధర్మాన్ని నిరసించారు. 'మంచి అన్నది మాలలయితే మాలనే అగుదున్' అని ప్రకటించారు. కేశవసుత్‌కూడా 'హరిజన బాలకుని తొలి ప్రశ్న' (1888) అనే కవితలో 'దారిపక్క ఆడుకుంటున్న హరిజన బాలకుణ్ణి ఒక బ్రాహ్మణుడు తరమగా ఇంటికొచ్చి 'నానీడ అతనిపై పడితే ఏమిటి? ఏమికీడు మూడుతుంది?' అని తల్లిని అమాయకంగా అడుగుతాడు. 'నవసైనికుడు' (18?8) అనే కవితలో 'బ్రాహ్మణ్ణికాను, హిందువునుకాను, ఏ జాతి వాణ్ణి కాను' అని ప్రకటిస్తాడు.

'మనిషిచేసిన రాయిరప్పకి మహిమ కలదని సాగి మొక్కటా'న్ని అప్పారావుగారు ప్రశ్నిస్తే' 'విగ్రహాలు పడగొట్టండి' త్వరపడండి అని 'మూర్తిభంజనం' (1905) అనే కవితలో కేశవసుత్ ప్రబోధించారు. వీరిద్దరూ విగ్రహారాధనని మాత్రమే వ్యతిరేకించారు. కాని సంపూర్ణ నాస్తికులైనట్టు బలమైన ఆధారంలేదు.

గురజాడ అప్పారావుగారు 'దేశభక్తి' గీతంలో రాజకీయ స్వాతంత్ర్యాన్ని గురించి ప్రస్తావించలేదు. రాజకీయ స్వాతంత్ర్యానికి ఆయన వ్యతిరేకిఅని అర్థం చేసుకో గూడదు. 1908 మద్రాసు కాంగ్రెసు సభలను అవహేళనచేస్తూ (Psalm) అని ఇంగ్లీషులో రాసిన లఘుపద్యం కాంగ్రెసు సభలలో జరిగే ఫార్సును చూపించటానికే రాశారు కాని స్వాతంత్రోద్యమాన్ని వ్యతిరేకించటం ఆయన ఉద్దేశంకాదు. స్వాతంత్ర్యాకాంక్షను ఆయన కవితారూపంలో ఎక్కడా వెల్లడించలేదు. కేశవసుత్ మాత్రం తన స్వాతంత్ర్యకాంక్షను స్పష్టంగా వ్యక్తీకరించారు. 'ఒక భారతీయుని పలుకులు' (1886) అనే కవితలో—

'ఓ దేవా! ఈ దాస్యపు చీకటిరాత్రి
ఎప్పు డంతరించును ?
స్వాతంత్ర్య భానూదయము
మరల ఎప్పుడగును ?
ఈ పంజరమునుండి
ఎప్పుడు విడివడుదుము దేవా ?
మా జాతికి మరల
పూర్వవైభవ మెపుడు లభించును ?'

అని ఆవేదన పడతాడు.

గురజాడ అప్పారావుగారు కేవల ప్రకృతిచిత్రణ లక్ష్యంగా నీలగిరిపాటలు రచించారు. కేశవసుత్ రాసిన 'దీవాళీ, దీవాళీ' అనే కవితలో మొదటిభాగం 'పర్జన్యాప్రత్' అనే కవిత ప్రకృతి చిత్రణకు ఉదాహరణలుగా ఇయ్యబడ్డయ్. సమకాలీన సమాజంనుంచి నిర్జనారణ్యంలోకి పోవాలన్న కాంక్షకూడా వ్యక్తం చేస్తారు.

'దూరాన ఎచటనో ఒంటిగ వెళ్లవలె' అన్న కవితలో

ఎన్నో తడవలు మనస్సు విరిగినది
ఎన్నియో ఆశలు చచ్చిపోయినవి
వాని నన్వేషించుచు, 'ఏకతార' పుచ్చుకొని
నిర్జనారణ్యములకు వెళ్లవలె.'

అన్న కాంక్షను వ్యక్తపరిచారు. ఇందులో మొదటి రెండు పాదాలు అప్పారావుగారి

'పెరిగి విరిగితి, విరిగి పెరిగితి
కష్టసుఖముల పారమెరిగితి
పండునన్నని ఆశలెన్నో
ఎండి రాలగ బొగిలితిన్'

అన్న పాదాలను గుర్తుకు తెస్తున్నై.

''బ్రాహ్మణ్ణికాను హిందువునుకాను, ఏ జాతి వాణ్ణికాను. విశ్వమంతా వ్యాపించివున్న పతితుల్లో నేను''. 'నా ప్రపంచానికి అవధులు లేవు' అని కేశవసుత్ ఎల్ల లెరుగని విశ్వప్రేమను బోధించారు. 'ఎల్ల లోకము ఒక్క ఇల్లయి, వర్ణభేదములెల్ల కల్లయి' అన్నచోట అప్పారావుగారూ ఇదే బోధించారు.

ప్రాచీన సాహిత్యంలో స్త్రీ పురుషుల ప్రణయంలో శరీరసమాగమమే ప్రధానాంశం. అప్పటి రాచరిక వ్యవస్థ అందుకు కారణం కావచ్చు. ధనస్వామ్య వ్యవస్థవల్ల వచ్చిన మార్పుల్లో ఒకటి సాహిత్యంలో ప్రేమకు దివ్యత్వాన్ని కల్పించటం. దీన్నే 'ప్లెటానిక్ లవ్' అంటారు. తెలుగులో రాయప్రోలు సుబ్బారావుగారు ఎక్కువగా ప్రచారంచేసినా దీని ప్రస్తావన గురజాడ అప్పారావుగారి కవిత్వంలోకూడా ఉంది.

'మరులు ప్రేమని మదిదలంచకు
మరులు మరలును వయసుతోడః
మాయమర్మం లేని నేస్తమె
మగువలకు మగవారి కొక్కటి
బ్రతుకు సుకముకు రాజమార్గము'

అని కాసులు అనే ఖండికలో రాశారు. 'కేశవసుత్' కూడా 'ప్రేమదివ్యము. అలౌకికము' అని అంటారు.

గురజాడ అప్పారావుగారిలాగే కేశవసుత్ కూడా ఎక్కువగా మాత్రాఛందస్సునే స్వీకరించారు. 'అతని కవిత్వమంతయు ఒక చిన్నపాటి సంకలనమున సర్దు

కొనినది’అని కేశవసుత్‌ని గురించిఅన్నమాట అప్పారావు గారికి కూడా వర్తిస్తుంది. వీరిద్దరూ ఆయా సాహిత్యాలకు వైతాళికులుగా పరిగణించబడుతున్నారు. ఒక భేదంమాత్రం కనిపిస్తున్నది. అప్పారావుగారు హాస్య ప్రియుడు. కేశవసుత్ సీరియస్‌కవిలాగా కనిపిస్తాడు.

కేశవసుత్ అప్పారావుగారికన్నా సీనియర్‌కవే అయినా కొన్నివిషయాల్లో, అప్పారావుగారికన్నా ముందున్నారనిపించే కవితలు కొన్ని ఉన్నై. ‘తుతారీ’ (1893) అనే కవితలోని ఈ భాగాన్ని చూడండి.

నియమాలు మనుషులకోసం
మనిషి నియమాలకోసంకాదు.
అభ్యుదయాన్ని అటకాయిస్తే
అలాటి నియమాల్ని అవలికి నెట్టండి
మీ నూత్నశక్తిని ప్రదర్శించండి.
ఘాతుక ప్రతిబంధకాలపై
దండెత్తండి, తరలిరండి
వీరుల్లారా ‘హరేహర’అంటూ
ఆవేశంతో, ఆగ్రహంతో
అభ్యుదయపతాకాన్ని ఎత్తండి’

ఇది 19 వ శతాబ్దంలోనే రాయబడ్డ గీతం అంటే ఆశ్చర్యంవేస్తుంది. సమాజాన్ని మార్చటానికి ప్రతిఘటన అవసరమని ప్రబోధించే కవి తెలుగుదేశానికి ఒక 40 ఏళ్ళతరవాతగాని దొరకలేదు. శ్రీ శ్రీ మహాప్రస్థానం గీతాన్ని పై గీతం గుర్తుచేస్తున్నదంటే కేశవసుత్ తన కాలానికి ఎంతముందున్నాడో మనం గుర్తించవచ్చు. శ్రీశ్రీలాగా కేశవసుత్ అక్కడ కమ్యూనిజాన్ని బోధిస్తున్నాడని మనం భ్రమపడగూడదు. మార్క్సిస్టుభావాలు మనదేశంలోకి అప్పటికి రాలేదు. శ్రీశ్రీ మహాప్రస్థానానికి కేశవసుత్ ‘తుతారీ’కి ఉన్న పోలికలుచూస్తే శ్రీశ్రీకి కేశవసుత్ కవిత్వంతో పరిచయంఉందా అనిపించేంత సన్నిహితంగా ఉన్నై. అయితే పోలికలున్నచోటల్లా ఆ విధంగా ఊహించటం కుదరదు. కాకపోతే కేశవసుత్ తన కాలానికి ఎంత ముందుఉన్నాడో చూపించటానికే ఈ పోలికలు చూపించబడ్డై.

ఇతర సాహిత్యాలతో మన సాహిత్యాన్ని అంచనా వెయ్యటానికి ఇట్లాంటి పుస్తకాలు చాలా అవసరం. ఈ పుస్తకానికి తెనుగు అనువాదం ‘సరళ గ్రాంథికం’లో జరిగింది. కవితానువాదం భావానువాద పద్ధతిలో జరిగింది. నేరుగా మరాఠీనుంచి తెలుగులోకి మాత్రా ఛందస్సుల్లోకి చేయిస్తే కేశవసుత్‌కి ఇంకా న్యాయం జరిగిఉండేదేమో.

—చే. రా.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1, Editor : S. Sambhu Prasad.